పురాణవిష్ణువెవరు?



రచయిత
'కళాప్రపూర్ణ' పండిత గోపదేవ్, దార్శనిక్



ప్రకాశకులు
ఆర్యసమాజము - కూచిపూడి

అంబాదర్శన గ్రంథమాల-66

కాపీలు 1000

వెల: రు. 8-00

భావ - పుష్యమాసము

1995 జనవరి

ప్రకాశకులు :

ఆర్యసమాజము - కూచిపూడి-522 313

ముద్రణ :

విజయ ఆర్టు ప్రెస్ - తెనాలి.

విషయసూచిక



సంపాదకీయము

ఈ గ్రంథ మెన్నడో 1935 లో పండిత గోపదేవ్‌గారిచే రచింప బడెను. విష్ణువు - విష్ణువునకు సంబంధించిన కథలు-జలంధరుడు, శంఖచూడుడు, సముద్ర మథనము, మోహినీరూపము మొదలైన కథలు పురాణములలో చదివినపుడు గ్రుడ్డిగానమ్ము స్వభావము లేనివారగుటచేతను, ప్రతిదానికి హేతువును పరికించు స్వభావము కలవారగుటచేత నీ యసందర్భపు కథలను గూర్చి తత్త్వపరిశీలన చేయదలచి ఆ యా కథలకు మూలములైన యా యా కథలు గల గ్రంథములను పరికించినట్లు ఈ గ్రంథములో వారిచ్చిన సంస్కృత గ్రంథములందలి భాగములు బలపఱచుచున్నవి.

సంస్కృతములోని శబ్దములు ధాతువులకు ప్రత్యేకార్థము లలో కొన్ని ప్రత్యయములు చేర్చుటవలన నేర్పడును. శబ్దము లలోని ధాతువులు ఏకార్థములు, బహ్వర్థములు గలవిగా నుండును. ధావున కెన్ని యర్థములున్నవో యా ధాతువుగల శబ్దములకు నా యర్థములన్నియు నున్నట్లు గ్రహించి సందర్భానుసారముగా నచ్చట తగిన యర్థమును గ్రహింపవలెను. దీనినే సందర్భ శుద్ధి యందురు. అవిధముగా గ్రహింపక కొందఱు, వైదిక లౌకిక భాషా భేదమును గ్రహింపక కొందఱు సాయణుడు మొదలైనవారు వేదమంత్రములందలి పదములకు సరియగు నర్థము గ్రహింపక లౌకికభాషా సంబంధముచే హిరణ్యగర్భుడు, విష్ణువు మొదలైన శబ్దములకు అపార్థమును వ్రాయుటచే నితర దేశీయులకుగూడ వేదములందు గౌరవము సన్నగిల్లి వేదములు ఈశ్వరీయములు కావు పౌరుషేయము లనసాగిరి. వారికి స్వామి దయానందసరస్వతి సరిగా కనువిప్పు కలిగించెను.

విష్ణుశబ్దమునకు సందర్భోచితముగా నర్థములు గ్రహింపక పురాణములలో అసందర్భముగా కథలల్లి విష్ణుశబ్దవాచ్యుడైన

పరమేశ్వరునకు నింద్యగుణములు అంటగట్టి భారతీయు లుపాసించు భగవంతునిపై విదేశీయులకు, విమతులకు నేహ్యభావము కలుగునట్లుచేసిరి. దానిని గాంచి క్షుభితమనస్కులగు పండిత గోపదేవ్‌గారు సత్యమును ప్రదర్శించి భారతీయుల దైవోపాసనను బలపఱచుటకై చేసినకృషియే యీ గ్రంథ రచన. ఈ విషయము పాఠకులే గ్రహింతురు గాక !

పురాణ విష్ణువెవరు ? అను గ్రంథమును ముద్రింపవలసినదిగా కృష్ణాజిల్లా నాగాయలంక వాసులైన తలశిల శ్రీరాములుగారి భార్య కమలమ్మగారు, శ్రీ ఉప్పల బాబురావుగారి భార్య ప్రమీలగారు వలసిన ధనసాహాయ్య మొనర్చి మిక్కిలి తోడ్పడిరి. వారు రైతుబిడ్డలైనను కళాప్రపూర్ణ పండిత గోపదేవ్‌గారిచే రచింపబడిన వైదిక గ్రంథముల చదివియు, వారి యుపన్యాసములు వినియు వైదికధర్మమునందాసక్తి కలవారై వైదికధర్మప్రచార సంస్థయైన కూచిపూడి ఆర్యసమాజమువారిచే నడుపబడుచున్న అంబాదర్శన గ్రంథమాలవారికి ఈ పురాణ విష్ణువెవరు ? అను గ్రంథమును ముద్రింపవలసినదిగా వలసిన ధనమును పంపిరి. అట్టి వీరికి నింకను వైదికధర్మప్రచారమునకు తోడ్పడునట్టి సద్బుద్ధి నిచ్చి వీరికి సకలసౌఖ్యములు కలుగునట్లుగా పరమేశ్వరుడు సహకరించునని విశ్వసించుచున్నాడను.

బుధజన విధేయుడు

వెంకయ్యార్య.

21–1–95

ఓమ్

ఆర్యసమాజ నియమములు

1. సమస్త సత్యవిద్యలకును, విద్యవలన నెఱుంగదగు సర్వ పదార్థములకును ఆదిమూలము పరమేశ్వరుడు.
2. ఈశ్వరుడు-సచ్చిదానంద స్వరూపుడు, నిరాకారుడు, సర్వశక్తి మంతుడు, న్యాయకారి, దయాళుడు, అజన్ముడు, అనాది, అనంతుడు, నిర్వికారుడు, అనుపముడు, సర్వాధారుడు, సర్వ వ్యాపకుడు, సర్వాన్తర్యామి, అజరుడు, అమరుడు, అభయుడు, నిత్యుడు, పవిత్రుడు, సృష్టికర్తయు నై యున్నాడు. అతనినే ఉపాసించుట యోగ్యము.
3. వేదము సత్యవిద్యల గ్రంథము. దీనిని చదువుట-చదివించుట, వినుట-వినుపించుట, ఆర్యుల కందఱికి పరమధర్మము.
4. సత్యమును గ్రహించుటకును, అసత్యమును త్యజించుటకును, నెల్లప్పుడు సిద్ధముగా నుండవలెను.
5. సకలకార్యములను ధర్మానుసారముగా అనగా సత్యాసత్యములను విచారించి చేయవలెను.
6. ప్రపంచమునకు ఉపకారము చేయుట, ఈ సమాజము యొక్క ముఖ్యోద్దేశ్యము. అనగా శారీరికోన్నతికి, ఆత్మోన్నతికి మఱియు సామాజికోన్నతికి పాటుపడవలెను.
7. అందఱితో ప్రేమపూర్వకముగ, ధర్మానుసారముగ, యథా యోగ్యముగ వ్యవహరింపవలెను.
8. అవిద్యను నశింపజేసి విద్యను పెంపొందింప జేయవలెను.
9. ప్రతి వ్యక్తియు తన యున్నతితోనే సంతృప్తి నొందక, అందఱి యున్నతిలోనే తన యున్నతి కలదని తలంపవలెను.
10. సర్వ హిత కరములగు సామాజిక నియమములను పాలించుటలో పరతంత్రులై వ్యక్తి హితకరములగు నియమములందు స్వతంత్రులగుట అందఱికి తగును.

పురాణ విష్ణువెవరు?

పరమేశ్వరుని పలునామములు

యో దేవేష్వధిదేవ ఏక ఆసీత్ కస్మై దేవాయ
హవిషా విధేమ॥ (ఋగ్వే)

యః = ఎవడు, దేవేషు + అధి = సూర్యచంద్రాది (నక్షత్రములు, పృథివి, అగ్ని, జలము, వాయువు, ఆకాశము, ప్రాణము, ఇంద్రియములు మున్నగు) సమస్తదేవతలలో, ఏకః + దేవః = శ్రేష్ఠదేవు డొక్కడు, ఆసీత్ = కలడో, (అ), కస్మై=సుఖస్వరూపుడగు, దేవాయ = పరమదేవుని, హవిషా=స్తుతిప్రార్థనాదులద్వారా, విధేమ = భజింతుము.

పాఠకులారా! ప్రాచీనకాలమున (వేదములు జనులలో ప్రచారమున నున్నపుడు) ఒక్కపరమేశ్వరుని యుపాసనయే భారతదేశమున వ్యాపించియుండెను. ఆ కాలమున బ్రహ్మవాదులగు మధుచ్ఛందుడు, మేధాతిథి, దీర్ఘతముడు, కక్షవంతుడు, అగస్త్యుడు, గృత్సమదుడు, విశ్వామిత్రుడు, వామదేవుడు, అత్రి, భారద్వాజుడు, బృహస్పతి, వసిష్ఠుడు, నారదుడు, కశ్యపుడు, నారాయణుడు, శివసంకల్పుడు, యాజ్ఞవల్క్యుడు, ఐతరేయ ప్రభృతులగు మహర్షులు, వారి సంతతివారైన విద్వాంసులును, బ్రహ్మవాదినులైన లోపాముద్ర, గార్గి, రోమశ, అపాల, ఘోష, హర్య, ఊర్వశి, కద్రువ, యమి, మున్నగు విదుషీమణులును

వేదములను ప్రచారముచేసి యా వేదములందు సర్వత్ర ప్రతిపాదింపబడిన పరమేశ్వరుని మాత్రమే యుపాసించిరి. ఆ పరమాత్ముడే ఇంద్రమిత్రాద్యనేక నామములతో వేదములందు బేర్కొనబడియుండెను. ఇందుకు ముఖ్యప్రమాణములు వేద శాస్త్రములే. ఎట్లన ? వేదములో—

"ఇంద్రం మిత్రం వరుణమగ్నిమాహురథో దివ్యః స సుపర్ణో గరుత్మాన్ ఏకం సద్విప్రా బహుధా వదన్త్యగ్నిం యమం మాతరిశ్వాన మాహుః" సుపర్ణం విప్రాః కవయో వచోభిరేకం సంతం బహుధా కల్పయన్"

వేదవిదులగు విప్రులు ఒక్క పరమాత్మునకే ఇంద్రుడు, మిత్రుడు, వరుణుడు, అగ్ని, సుపర్ణుడు, గరుత్మంతుడు, యముడు, మాతరిశ్వుడు, నని యనేక నామములు కల్పించిరి.

మనువు తన ధర్మశాస్త్రమున నిట్లే వర్ణించియుండెను.

ప్రశాసితారం సర్వేషాం అణీయాంస మణోరపి ।
రుక్మాభం స్వప్నధీగమ్యం విద్యాత్తం పురుషం పరమ్॥
ఏతమేకం వదన్త్యగ్నిం మనుమన్యే ప్రజాపతిమ్ ।
ఇంద్రమేకేఽపరే ప్రాణ మపరే బ్రహ్మశాశ్వతమ్॥ (మను)

బహుకాలమునకు దర్వాత నుపర్యుక్త మహర్షుల సంతాన మా పరమేశ్వరు నుపాసించుట మఱచి యన్యప్రాకృత పదార్థములను పూజింపమొదలిడిరి. ప్రకృతిలో ననేకములగు పదార్థములు గలవు. జలము వాయువు అగ్ని వివిధములగు మకర కచ్ఛపాది జలచరములు, సముద్రములు, నదులు, పర్వతములు, ఆకాశమున గల సూర్యచంద్ర నక్షత్రాదులు నన్నియు ప్రకృతిదేవియొక్క

నైజసంపత్తియే. వీనిలో నద్భుతములైన పదార్థముల నన్నిటిని జనులు దేవునకు ప్రతినిధులుగా భావించి పూజించుచు వచ్చిరి. ఇట్లు కాలము గడచినకొలది యజ్ఞానము ప్రబలమై విద్వాంసులు లేకునికి లోకమున వేదప్రచారము సాంతము నశించెను. ఆ కాలమున ప్రజలు వేదానభిజ్ఞులగుటచే నిష్టమువచ్చినట్లు పూజలు సాగించిరి. కాలాంతరమున కొందఱు బుద్ధిమంతులగు విద్వాంసులు పూర్వమువలె పూజ్యుడైన పరమాత్మ నుపాసనకై జనులను ప్రబోధించి యందు పూర్ణముగా సఫలులు గాకున్నను నానావిధ దేవతోపాసనల నుండి మరల్చి దేవతాత్రయము నుపాసించుటలో జనులకు రుచి కల్పింపగలిగిరి ఆకాశముననున్న సూర్యుడు, అంతరిక్షముననున్న వాయువు, భూమియందున్న అగ్నియే యా దేవతాత్రయము. వీరే కాలాంతరమున బ్రహ్మ విష్ణు మహేశ్వరులయిరి. ఈ మూడు దేవతల నుపాసింపజేయ యత్నించుచు నా విద్వాంసులు యథార్థమున నీమువ్వురికి నాధారుడైన వాడొక డున్నాడనియు, వాడే యుపాస్యుడనియు బోధించిరి. తత్కాల ప్రబంధముల నవలోకించినవారి కది విస్పష్టము కాగలదు.

సాధారణముగా పురాణములందును బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులను వేఱువేఱుగా వర్ణించుచు నా త్రిమూర్తుల కాధారము పరబ్రహ్మ పరమాత్మయనియు వాస్తవమున నా పరమాత్మడే పూజ్యుడు, వంద్యుడు, నుపాస్యుడు నని వర్ణించియుండుట పురాణవిదులకు తెలియనిదికాదు. కాని యిందుగల గూఢాభిప్రాయము నెఱుగక సాధారణజనులు పరమాత్మని స్వరూపమును విడిచి యజ్ఞయాగాదులలో సూర్యుని, అగ్నిని, వాయువునే ముఖ్యదేవతలుగా నెంచి పూజింపసాగిరి. కాని యా రోజులలో

గూడ దేవతలకు బదులుగా మూర్తులను నిర్మించి వానిని పూజించి నట్లెక్కడను గానరారు. అటు తరువాత చాలకాలమునకు దేశమున బౌద్ధమతము వ్యాపించెను. బుద్ధునికాలమున గూడ మూర్తిపూజ యున్నట్లు గానరాదు. ప్రసంగవశమున నిట కొన్ని యైతిహాసిక వాక్యముల నుదాహరించుట దోషముకాదని తోచెడిని. ఈ వాక్యములు (8-4-1932) 'ఆర్య' అను హిందీ పత్రికలో ప్రకటింపబడిన యొక లేఖ ననుసరించి వ్రాయబడినవి. ఆ లేఖ శీర్షిక "మూర్తిపూజ అవైదికము" అని యున్నది. 1) వేదములలో దేవతలయు, ప్రతిమలయు నుల్లేఖలు గానరావు. 2) ప్రొఫెసరు మిల్లరు నభిప్రాయములో వైదికదేవతలు మూడు విభిన్నవర్గములలో విభజింపబడిరి.

ఈ విభాగములలో నెన్నడు సమ్మిశ్రణము కలుగనేరదు. ఈ మూడు వర్గము లెవ్వియన – పృథివి, ఆకాశము, స్వర్గము ప్రతివర్గమునను పదునొకండు దేవతలు గలరు. ఈ వైదికదేవతలు మూక ప్రకృతికి ప్రతినిధులు. వైదికధర్మము నా పాతదృష్టితో జూచిన ననేక దేవతలు ప్రతిపాదించినట్లు కనబడును. కాని యథార్థమున నీ యనేక దేవతావాదాంతస్థలమున నొక్క బ్రహ్మ భావనయే అతి వేగమున ప్రవహించుచున్నట్లు స్పష్టమగుచున్నది. దీనికి ప్రమాణము "కస్మై దేవాయ హవిషా విధేమ" సుఖస్వరూపుడగు పరమాత్మని ఉపాసనాదులద్వారా భజింతుము. 3) బ్రాహ్మణ గ్రంథములు, ఉపనిషత్తులు వాస్తవమున పరమాత్మాన్వేషణ సంబంధమైన యపూర్వమగు నితిహాసములతో పరిపూర్ణములై యున్నవి. వీనిలో భారతీయుల యాధ్యాత్మికత చరమసీమను పొందినది. కాని దీనిలో గూడ మూర్తివిద్యకు

సంబంధమెక్కడను గానరాదు. 4) పురాణముల యుత్పత్తి కాలములో యజ్ఞవిధులు మిక్కిలి శిథిలములై వాని స్థానమున తపస్సు, యోగము వానికి సంబంధించిన యా ధర్మములు స్థాపింప బడినవి. కాని యీ తపస్సుతోగాని, యోగముతోగాని మూర్తి విద్యావికాసమునకెట్టి సంబంధము కానరాదు. 5) మూర్తులు బ్రాహ్మణయుగమునకు సంబంధించిన సంస్కారవాదమునకు ముఖ్యాంగములైయున్నవి. బుద్ధభగవానుడు యుగప్రణాళికి సంస్కారవాదమునకు ఘోరవిరోధి యగుటచే నా విరోధమున తన యంతశ్శక్తులకు తోడుగా మూర్తిపూజను గూడ సమ్మిళితము చేసి యుండెడివాడు. కాని యట్లు చేయడయ్యె. బౌద్ధధర్మమునకు సర్వశ్రేష్ఠ సంరక్షకుడగు నశోకుడు తన గురువు ప్రదర్శించిన మార్గమున నిసుమంతయైన నిటునటు నడువనివాడు.

ఆ యశోకుని శిలాలేఖలందంతట యజ్ఞముల ఖండన చూడ బడుచున్నది. కాని మూర్తిపూజ యా యనుభవ పురుషుని మస్తిష్కమున నెన్నడు నుదయింపదయ్యె. చిత్రణకలాసంబంధమున ననేకప్రయోగములుచేసిన వాడును, భారతవర్షమున కలా ప్రవర్తకులలో సర్వప్రథముడును, విశాలసామ్రాజ్యమున కధిపతియునగు నశోకుడు రెండువందల సంవత్సరములకు బూర్వము పరలోకమునకు బోయిన తన గురువగు బుద్ధభగవానుని మూర్తిని చేయుటకుగాని, చేయించుటకుగాని యెన్నడు నభిలషించినవాడు గాడు. ఈ ఘటన హిందువుల మూర్తివిద్యా చరిత్రమును నెల్లపుడు స్మరింపదగినదిగా నున్నది. 6) అశోకుని సమయము వణకుగల శిలాలేఖలవలన భారతవర్షమునగల పెద్దపెద్ద రాజులుగాని, వారి యనుచరులుగాని, తమ యిష్టదేవతలకు సంబంధించిన భావము

లకు నెన్నడు నెట్టిరూపమునుగాని, యాకృతినిగాని కల్పించినట్లు కనబడదు. హిందువుల యీశ్వరీయ విచారములలో నా యా సమయములందు గొప్ప పరివర్తనములు జరిగినను, దేవతా ప్రతిమల చర్చ యెక్కడను లేదు. 7) క్రీస్తు జన్మించుటకు రెండువందల సంవత్సరములకు పూర్వకాలమునుండి క్రీస్తు జన్మకు తరువాత మూడువందల సంవత్సరముల వఱకు నీ శిల్ప విద్యలో గొప్ప గొప్ప పరివర్తనలు జరిగెను. మౌర్యుల పతన కాలమునుండి గుప్తవంశము యొక్క యభివృద్ధి కాలమువఱకు మూర్తివిద్యలో మిక్కిలి యభివృద్ధికలిగెను. 8) డాక్టర్ స్టీన్ యొక్క యభిప్రాయములో ప్రప్రథమున గ్రీకులు భారతీయుల మూర్తివిద్యయందు మేనేడరు కాలమున అనగా క్రీస్తుకు 150 సంవత్సరములకు పూర్వము ప్రభావము కలిగియుండిరి.

గ్రీకులే మూర్తి పూజాప్రచారమున కధికకారణమని కటాక్షించుచు ఫౌచన్ వ్రాసియున్నాడు. మహాభారత మీమాంసా గ్రంథకర్తయగు పండిత బాలకృష్ణపాండురంగ అనువాడు తన గ్రంథములో నిట్లు వ్రాసెను. భారతమున నెక్కడను మూర్తి పూజకు సంబంధించిన వర్ణనలేదనుట నిర్వివాదాంశము. శ్రీకృష్ణుని యొక్కయు, యుధిష్ఠిరుని యొక్కయు అహ్నికక్రియలవర్ణన విస్తారముగా చేయబడినను నిందు ధాతువుతోగాని శిలతోగాని చేయబడిన మూర్తి యొకట పూజింపబడి నట్లెక్కడను గానరాదు. (మ. భా. మీ. పృష్ఠ 558)

మహాభారతమున 'సౌతి' కొత్తగాజేర్చిన యధ్యాయములందు మూర్తులు దేవాలయములు నుల్లేఖింపబడినవి. (మ.భా.మీ. 559)

దేవాలయములు మూర్తులు నుండి నప్పటికి నార్యుల యాహ్నికధర్మకృత్యములలో నేటివఱకు మూర్తిపూజలేదు. (మ. భా. మీ. పు. 550) మహాభారతములో అవతారశబ్దము రాలేదు (పు. 556).

గ్రీకులు 'ఇల్మ్ బుత్ తరాశీ హింద్' అను పుస్తకములో నీ మూర్తివిద్య వలన హిందీశిక్షను, ఆచారమును, దేవీదేవతలను పశువులయు మనుష్యులయు రూపములలో ప్రకటింపసాగెనని వ్రాయబడియుండెను. ఉత్తర దిక్కుననున్న మహాయానులు (బౌద్ధులు) ఈ గ్రీకు సభ్యతకు సమీపముగానుండిరి. అందు వలన వారు గ్రీకులను జూచి బుద్ధుని మూర్తినిజేయ నారంభించిరి (మస్తానాజోగి).

ఈ లేఖ ననుసరించి గ్రీకులనుండి బౌద్ధులు, వారినుండి జైనులు, వారినుండి పౌరాణికులు నీ మూర్తిపూజను గ్రహించి యుండిరని స్పష్టమగుచున్నది.

ఉపర్యుక్తప్రమాణముల ననుసరించి భారతవర్షమున ప్రప్రథమమున జైనులు మూర్తిపూజ నారంభించినట్లు తెలియుచున్నది. వీరు నాస్తికులయినందున నీశ్వరు నొప్పుకొనకున్నను తమ గురువులగు తీర్థంకరుల మూర్తులను మందిరమందుంచి మిక్కిలి యాడంబరములతో పూజింపసాగిరి. వీరిని ద్వేషించునట్టి యితర హిందువులలో బుద్ధిమంతులు విచారించి తమ సంఘములోని యజ్ఞానులు, జైనుల యాడంబరములకులోనై వారి సంప్రదాయము ననుసరింతురను భయముతో తాముగూడ మూడు మందిరములలో మూర్తులనుబెట్టి వానిని పూజింప నుద్దేశించిరి.

కాని వీరు బుద్ధిమంతులగుటచే మూడు మూర్తులను మాత్రమే కల్పించిరి. సూర్యస్థానమున విష్ణుమూర్తిని వాయుస్థానమున బ్రహ్మను, అగ్ని స్థానమున రుద్రుని కల్పించిరి. ఈ మూర్తుల నీవిధముగా కల్పించి యలంకారములతో జైనులను మించి పూజింప సాగిరి. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కల్పితములనిన మీ కాశ్చర్యముగా నుండును. కాని ముందు గ్రంథమును పరిశీలించి న్యాయదృష్టితో నాలోచింతురేని మీ కిట్టి యాశ్చర్యము కలుగ నేరదు.

ఇందు ప్రథమమున విష్ణుని గూర్చి విచారింపుడు.

విష్ణు నామము

పూర్వకాలమున సూర్యునిపేరు విష్ణువని యుండుట విష్ణు పురాణములోని యీ క్రింది శ్లోకముల వలన బోధపడగలదు.

తత్ర విష్ణుశ్చ శుక్రశ్చ జజ్ఞాతే పునరేవ చ
అర్యమా చైవ ధాతా చ త్వష్టా పూషా తథైవ చ॥
వివస్వాన్ సవితా చైవ మిత్రో వరుణ ఏవ చ
అంశా భగశ్చాదితిజా ఆదిత్యా ద్వాదశ స్మృతాః॥ (వి.పు.)

విష్ణువు, శుక్రుడు, అర్యముడు, ధాత, త్వష్ట, పూషుడు, వివస్వంతుడు, సవిత్రుడు, మిత్రుడు, వరుణుడు, అంశము, భాగము, అను నీ ద్వాదశనామములు సూర్యునివి.

ఇట్లే మహాభారతమునను విష్ణుశబ్దము సూర్యుని నామము లలో పేర్కొనబడియుండెను.

ధాతాఽర్యమా చ మిత్రశ్చ వరుణాంశో భగస్తథా॥

ఇంద్రో వివస్వాన్ పూషా చ త్వష్టా చ సవితా తథా।
పర్జన్యశ్చైవ విష్ణుశ్చ ఆదిత్యాద్వాదశ స్మృతాః॥ (మ బా.)

ధాత, అర్యముడు, మిత్రుడు, వరుణాంశుడు, భగుడు, ఇంద్రుడు, వివస్వంతుడు, పూషుడు, త్వష్ట, సవిత, పర్జన్యుడు, విష్ణువు, నను నీ పండ్రెండు మంది సూర్యులుగా స్మరింపబడిరి.

ఈ ప్రమాణముల ననుసరించి పూర్వకాలమున సూర్యుడు విష్ణుశబ్దముతో వ్యవహరింపబడుటలో సందేహములేదు. ఇట్లే ఆకాశముగూడ విష్ణుపదమని చెప్పబడుచుండెడిది. అమరకోశమే యిందులకు ప్రమాణము.

"వియద్విష్ణుపదం వాపి పుంస్యాకాశవిహాయసీ"

విష్ణుపదమ్=విష్ణోః=సూర్యస్య, పదమ్=స్థానమ్.

అనగా నాకాశము సూర్యునికి స్థానము. ఇంతియగాక వేద, వేదాంగములు ముఖ్యప్రమాణములగుట నందలి ప్రమాణములు పరికింపుడు. వేదకోశమగు నిరుక్తమున నైదవ యధ్యాయమున నాఱవ ఖండములో సూర్యనామముల నిట్లు పేర్కొనిరి. "త్వష్టా, సవితా, భాగః, సూర్యః, పూషా, విష్ణుః. వైశ్వానరః, వరుణః" ఈ శబ్దముల నిర్వచించుచు యాస్కాచార్యుడును విష్ణుశబ్దమునకు సూర్యుడనియే యర్థము వ్రాసెను.

వేదములలో నిట్లనేక ప్రమాణములు గలవు. వానిలో నిట నొక మంత్రము నుదాహరింతుము. ప్రసంగవశమున నితర ప్రమాణములను ముందు చూడగలరు.

"ఇరావతీ ధేనుమతీ హి భూతం సూయవసినీ
మనుష్యే దశాస్యా
వ్యస్కభ్నా రోదసీ విష్ణవే తే దాధర్థ పృథివీమభితో
మయూఖైః".

విష్ణో ! = హే సూర్య ! ఏ తే రోదసీ=ఈ భూ స్వర్గలోకములను, వ్యస్కభ్నాః = నీవు ధారణచేసి యున్నావు, మయూఖైః = కిరణములతో, పృథివీమ్ = భూమిని, అభితః = అన్నివైపులనుండి, దాధర్థ=ధారణచేయుచున్నావు అనగా ఆకర్షించుచున్నావు.ఇందుమయూఖశబ్ద ప్రయోగమువలన విష్ణుశబ్దము సూర్యవాచకమగుటనిస్సందిగ్ధమే కదా !

ఈ ప్రమాణములను పరిశీలించిన తరువాత విష్ణుశబ్దము సూర్యవాచకమైనట్లు పాఠకులకు స్పష్టమైయుండును. అందువలననే సూర్యునికి బదులుగా విద్వాంసులు విష్ణువును కల్పించిరి. ఇట్లు తమ కల్పితదేవునకు సూర్యుని నామమును గ్రహించి నామకరణము చేయుటలో ముఖ్యోద్దేశము బుద్ధిమంతుల దృష్టిని వేదములవైపునకు మఱల్చుట కావచ్చును. నామసామ్యమేకాక సూర్యునిలో నుండు గుణములే, కల్పిత విష్ణువునందును స్థాపించిరి. ఇట్లే సూర్యనామములలో రెండర్థములు గల శబ్దములను తీసికొని వాహనస్థాన శక్త్యాదులను కల్పించిరి. ఇందు వీరికి గల నిపుణత ప్రశంసార్హ మనదగును

విష్ణు వాహనము గరుడుడు

పాఠకులారా ! సూర్యకిరణములకు గల నామములలో సుపర్ణశబ్దము వైదికకోశమున నిట్లున్నది.

ఖేదయః, కిరణాః, గావః, రశ్మయః, అభీశవః,
దీధితయః, గభస్తయః, వనమ్, ఉస్రాః, వసవః, మరీచయః,
మయూఖాః, సప్తఋషయః, సాధ్యాః, సుపర్ణాః, ఇతి
పంచదశ రశ్మినామాని. (నిఘంటు-ప్ర.అ. ఖండ-5)

ఇందు సుపర్ణుడను శబ్దము కిరణనామమని స్పష్టమగుచున్నది వేదములందును పలుతావులలో సూర్యకిరణార్థమున సుపర్ణశబ్దము వచ్చియుండెను.

ఋగ్వేదమున—

వయః సుపర్ణా ఉపసేదురింద్రం ప్రియమేధా ఋషయో
నాథమానాః ।
అపధ్వాంతమూర్ణుహి పూర్ధిం చక్షుర్ముముగ్ధ్యస్మాన్
నిధయేవ బద్ధాన్॥ (నిరుక్త)

ఈ మంత్రమున సూర్యకిరణములలంకారరూపమున వర్ణింపబడినవి.

వయః=అత్యంతగమనస్వభావముగల,సుపర్ణాః=కిరణములు, ఇంద్రమ్=సూర్యుని, నాథమానాః=యాచించుచు, అనగా యాచించుటకు, ఉపసేదుః=చేరెను, ఆ కిరణముల స్వరూపమెట్టిదన, ప్రియమేధాః=యజ్ఞప్రియములు. (సూర్యోదయమునకు పూర్వము యజ్ఞము ప్రారంభించగూడదను నియమము ననుసరించి – ఉదితే జుహోతి) ఋషయః=వసిష్ఠాదులు జ్ఞానప్రకాశకు లయినట్లు కిరణములు పదార్థ రూపప్రకాశకములు.

సూర్యుని సమీపించుటలో ప్రయోజనమేమన, హే స్వామిన్ ధ్వాంతమ్ = అంధకారమును, అపఊర్ణుహి = దూరముచేయుము,

చక్షుః = ప్రాణుల నేత్రమును, పూర్ధి = తమ జ్యోతితోనింపుడు నిధాయఇవబద్ధాన్=పాశమున పక్షి చిక్కుకొనినట్లు మీ మండలమున బద్ధులమైన, అస్మాన్ = మమ్ములను, ముముగ్ధి = వదలి పెట్టుడు.

ఈ మంత్రమున యాస్కాచార్యుడు "సుపర్ణాః ఆదిత్య రశ్మయః" అని స్పష్టముగా వ్రాసిరి. ఇట్లే

యత్ర సుపర్ణా అమృతస్య భాగమనిమేషం విదథాభిస్వరన్తి।
ఇనో విశ్వాస్య భువనస్య గోపః సమాధీరః పాకమత్రావివేశ॥

అను మంత్రమునందును "సుపర్ణాః సుపతనా ఆదిత్య రశ్మయః" సూర్యకిరణములు సుపర్ణులని చెప్పబడునని యాస్కాచార్యులు వ్రాసిరి. ఈ ప్రమాణముల వలన వేదములలో సూర్యకిరణములు సుపర్ణశబ్దముతో వ్యవహరించుట సుస్పష్టము. కాని ప్రస్తుతము లౌకికభాషలో సుపర్ణశబ్దము గరుడుని పర్యాయవాచకముగా ప్రయోగింపబడుచున్నది.

గరుత్మాన్ గరుడస్తార్క్ష్యో వైనతేయః ఖగేశ్వరః
నాగాంతకో విష్ణురథః సుపర్ణః పన్నగాశనః॥ (అమర)

ఇందు గరుత్మాన్, తార్క్ష్య, ఆదిశబ్దములు వేదములలో కిరణార్థములుగా నుపయోగింపబడినవి. సుపర్ణుడు, గరుడు డను పక్షికిపేరు. పాఠకులారా! దీని ననుసరించి కల్పనాసౌందర్యము నూహించుడు. కిరణములే సూర్యుని వాహనములు. సూర్యుడు కిరణములద్వారా లోకమున వ్యాపించుట సర్వవిదితము. వేదములలో ననేకచోట్ల కిరణములు సూర్యుని మోయుచున్నట్లు వర్ణనలు గనబడుచున్నవి. అందువలన సూర్యస్థానమున కల్పించిన

విష్ణుదేవుని వాహనముకూడ కిరణనామ సామాన్యమగు సువర్ణుడను పేరుగల పక్షినిగా కల్పించిరి. ఇట్లు విష్ణువాహనము గరుడు డయ్యెను. ఈ వాహన కల్పనా పరిస్థితిని జూచినను సూర్యునే విష్ణువుగా కల్పించిరనుట నిస్సంశయము. విష్ణుదేవుని కల్పించిన వారు ఇదిగాక మఱియొక నామముతో సంగతికలిపి మఱియొక వస్తువును వాహనముగా కల్పింపక సుపర్ణునే వాహనముగా కల్పించుటలో కారణమేమి ? పక్షులు వాహనములుగా నుండుట లోకవిరుద్ధము కదా ! అను సందేహము పాఠకులకు గలుగ వచ్చును. ఇందుకు కారణాంతరములు గలవు. అవి యెవ్వియన, గరుడుడు సర్పభక్షకుడు. సర్పములను 'అహి' అనియు చెప్పు దురు గదా. సంస్కృతము చదివిన వారికిది సువిదితమే. కాని వైదికభాషలో మేఘమును "అహి" అని చెప్పుదురు.

అద్రిః, గ్రావా, గోత్రః, బలః, అశ్నః, పురభోజాః....

...అహిః, అభ్రమ్, బలాహకః...ఇత్యాది నిరు.

అద్రి, గ్రావము, గోత్రము, బలము ... అహి, అభ్రము, మేఘము... అని 30 పేరులు మేఘమునకు గలవు. ఇపుడు మీకు కల్పనబోధపడియుండవచ్చును. సూర్యకిరణములు (సుపర్ణులు) (అహి) మేఘమును తినునవి. విష్ణుభగవానుని వాహనమగు గరుడుడు, అహి=సర్పమును భక్షించువాడు అందువలన నితర నామములతో నిట్టి పోలికదుర్లభమగుట నీ సుపర్ణుని వాహనముగా కల్పించిరని యూహింపనగును.

ఇంతియుకాక సుపర్ణునిగూర్చి మఱియొక కల్పనా సౌందర్య మును తెలిసికొనవలసియున్నది. మహాభారతమున నాదిపర్వ ములో సుపర్ణు డమృతమును హరించుగాథ విపులముగా వర్ణించ బడినది.

ఇత్యుక్తో గరుడః సర్పైస్తతో మాతరమబ్రవీత్
గచ్ఛామ్యమృతమాహర్తుం భక్ష్యమిచ్ఛామి వేదితుమ్॥

కారణవశమున సుపర్ణుని మాత వినత సర్పమాతయగు కద్రువకు దాసియయ్యెను. తరువాత గరుడునకు తాను అమృతము తెచ్చి నాగుల కిచ్చువఱకు తల్లి దాస్యముపోదని తెలిసెను. అందువలన నమృతహరణములో గరుడు డనేకవిధ సాహస ప్రయత్నములను చేయవలసి వచ్చెను. ఈవిధముగా మహాభారతములో నాదిపర్వాంతర్గత 20–32 వ అధ్యాయము వఱకు సౌపర్ణాధ్యాయములను పేరుతో నీ కథ విస్తారముగా వర్ణించబడియుండుట నెల్లరు చూడదగినది. ఈ కథకు మూలకారణము సూర్యకిరణములగుట విచారకుల బుద్ధికి పరోక్షము కానేరదు. "పయః కీలాలమమృతం జీవనం భువనంవనమ్"అని అమరకోశమున జలమునకు, పయస్సు, కీలాలము, అమృతము, జీవనము, భువనము, వనమునని యనేకనామములు పేర్కొనబడినవి. అందువలన, సుపర్ణుడు అనగా సూర్యకిరణము, అమృతము=జలమును, హరించెను. ఈవిధముగా హరించి కిరణము, జలమును అహి = మేఘమునకిచ్చెను. పూర్వనిఘంటూదాహరణము ననుసరించి అహి = మేఘము, సర్పము అని రెండర్థము లుండుట స్పష్టమే. సూర్యకిరణముల వలన జలము వేడిజేయబడి ఆవిరి మేఘరూపమును బొందుచుండును. ఇట్లు ప్రతిక్షణము జరుగుచుండును ప్రస్తుతమీ ప్రాకృతికకార్య వైచిత్ర్యమునే సౌపర్ణాఖ్యానముగా కల్పించిరనుటసుస్పష్టము. పూర్వము కిరణములు మేఘభక్షకములనియు, నిపుడు కిరణములే జలము (అమృతము) నాహరించిమేఘములకు (అహి) కిచ్చినట్లు వ్రాయుట మీకసంగతముగా దోచవచ్చును.

కాని వాస్తవమున నసంగతములేదు. కిరణముల వలననే మేఘము లేర్పడుటయు నపుడపుడు నష్టభ్రష్టములగుట పదార్థ విజ్ఞానులకు తెలియనిది కాదు. దీని ననుసరించి ఆఖ్యానమున గూడ "తతః సుపర్ణమాతా తామవహత్ సర్పమాతరమ్ పన్నగాన్ గరుడశ్చాపి మాతుర్వచనచోదితః" అని కద్రువ కోరికప్రకారము తల్లి - వినత యాజ్ఞ ననుసరించి గరుడుడు సర్పములను నాగలోకమునకు మోసి తీసికొని పోయినట్లు వర్ణించి యుండిరి. ఇట్లు కద్రూ వినతలు, గరుడునియమృతహరణాదులు వేదమున గల చిన్నచిన్న ప్రాకృత విషయములను గ్రహించి వాని ననేకరూపముల స్థూలాకారమున కల్పించిన గాథలు కాని వేఱుకావని విద్వాంసు లూహింపలేకపోరు. ఇట్టి కథ కనుగుణమగు వేదమంత్రమును జూడుడు.

యత్ర సుపర్ణా అమృతస్య భాగమనిమేషం విదథాభిస్వరన్తి ఇనో విశ్వస్య భువనస్య గోపాః, సమాధీరః పాకమత్రావివేశ॥

ఈ మంత్రము ఋగ్వేదమున జూడగలము. యాస్కాచార్యు డీ మంత్రమును నిరుక్తమున నిట్లు భాష్యము చేసిరి.

యత్ర=ఏ సూర్యమండలమున నున్న, సుపర్ణాః = కిరణములు, అనిమేషం=సర్వదా, విదథా = తమ ర్తవ్యముతో కూడి యున్నవో, (అవి) అమృతస్యభాగమ్ = జలాంశమును, (పృథ్వి నుండి గ్రహించి), అభిస్వరన్తి = పదార్థములను తపింపజేయుచున్నవి. అనగా సూర్యకిరణముల వలన భూమియందున్న జలము శోషింపబడినపుడు జడచేతనయుక్త పదార్థములన్నియు

తపింపబడుట సువిదితము. ఇనః = ఐశ్వర్యయుక్తుడు, విశ్వస్య భువనస్య=సమస్తప్రపంచమునకు, గోపాః = రక్షకుడు, ధీరః = బుద్ధినిచ్చువాడు, పాకః = ప్రతివస్తువుయొక్క పరిణామమునకు హేతువునగు, సః=ఆ సూర్యుడు, అత్ర = ఈ, మా = నన్ను, ఆవివేశ=అవేశించునుగాక. అనగా సూర్యుని వలన నాకు ప్రకాశము ప్రాప్తించును గాక. ఈ మంత్రములో సుపర్ణ, అమృతశబ్దములను నిరుక్తకారులు కిరణ, జలపరములుగా నర్థముచేసిరి. అందువలననే కిరణమును హరియనియు చెప్పిరి. అనగా జలమును హరించునవి. ఇట్టి ప్రాకృతిక వర్ణనలను తీసికొని ఉపాఖ్యానముల నెట్లు కల్పించిరో మీకు స్పష్టమయినదని యెంచెద—

విష్ణువు - సముద్రము

పురాణములలో విష్ణుభగవానుడు క్షీరసాగరమున నివసించునట్లు వర్ణించుట చాల ప్రసిద్ధమైన విషయము. యథార్థముననిదియు సూర్యభగవానుని వర్ణనయే. వైదికభాషలో సముద్రము ఆకాశమునకు గల పేరులలో నొకటి. వైదికనిఘంటువున "అంబరమ్, వియత్, వ్యోమ, బర్హిః, ధన్వ, అంతరిక్షమ్, అకాశమ్, ఆపః, పృథివీ, భూః, స్వయంభూః, అధ్వా, పుష్కరమ్, సగరః, సముద్రః, అధ్వరమ్, ఇతి షోడశ అన్తరిక్షనామాని॥ (నిఘ)

అంబరము, వియత్, వ్యోమము, బర్హి, ధన్వము, అంతరిక్షము, ఆకాశము, ఆప్, పృథివీ, భూ, స్వయంభు, అధ్వ, పుష్కరము, సాగరము, సముద్రము, అధ్వరము నని పదునాఱు నామము లాకాశమునకని వర్ణింపబడెను. వీనిలో సముద్రశబ్దముండుట స్పష్టమే. నిఘంటువు నామభాష్యముచేసిన యాస్కాచార్యులు నీ విధముగా నీ సముద్రశబ్దము నిర్వచించిరి.

తత్ర సముద్ర ఇత్యేతత్ పార్థివేన సముద్రేణ సంది
హ్యాతే సముద్రః కస్మాత్ ? సముద్రవన్తి అపః అస్మాద్
సమభిద్రవన్త్యేనమాపః, సమ్మోదన్తే అస్మిన్ భూతాని
సముదకో భవతి, సమునత్తీతి వా॥ (నిరుక్త)

అనగా భూమియందుండు జలనిధినిగ్గూఢ సముద్రమందురు. అందువలననే ఆచార్యులు, పార్థివేన సముద్రేణ=పృథివీస్థ సముద్రముతో సందేహము గలుగునని వ్యాఖ్యానము చేసిరి. ఇందుకు ముఖ్యకారణము భూతలసముద్ర శబ్దమునకు గల అర్థము తఱచు ఆకాశపదార్థమునకు సమానమగుటయే. సముద్రశబ్దమున కర్థ మేమన, సముద్రవన్తి + అస్మాత్ అపః=దీనినుండి జలము ద్రవీభూతమై భూమిపై పడును. అందువలన ఆకాశము సముద్రమనబడుచున్నది. సమభిద్రవన్తి + ఏనమ్ + అపః = ఆపః= జలము, ఏనమ్ = ఆకాశమును, సమభిద్రవన్తి = ప్రాపించును. ఇట్లే, అస్మిన్=ఇందు, భూతాని=ప్రాణులు, సమ్మోదన్తే=ఆనందమును పొందుచున్నవి. ఆకాశమున ప్రాణులు విహరించుట జగద్విదితమే. సముదకః=అధికజలము (ఆకాశములో) భవతి=ఉండును. సమునత్తివా=అర్ద్రముచేయునది. ఇవి సముద్రశబ్దమునకు అర్థములు. ఈ యర్థములను జూచిన, ఆకాశభూతల సముద్రముల కన్వయించుట ధీమంతులక పరోక్షము. దీనినిబట్టి ఆకాశముసముద్రమని చెప్పబడుటలో సందేహములేదు. వేదమంత్రములలో నిట్టి యర్థము పలుచోట్ల చూడగలము. ఉదాహరణమునకై యొకటి రెండు మంత్రముల నిట పొందుపఱచుచున్నాడ—

ఏకః సుపర్ణః స సముద్రమావివేశ, స ఇదం విశ్వం భువనం
విచష్టే
తం పాకేన మనసాఽపశ్యమన్తితస్తం మాతా రేఢి స ఉ
రేఢి మాతరమ్॥ (ఋ. ౧౦ మం.)

దీనికి సాయణాచార్యుల భాష్యమును తిలకింపుడు.

ఏకః=సర్వకార్యేష్వసహాయః, సుపర్ణః=సుపతనః మధ్యమస్థానోదేవః, సముద్రమ్=అంతరిక్షమ్, ఆవివేశ=ఆవిశతి, (ఆవిశ్యచ) సః ఇదం విశ్వం=సర్వం, భువనం=భూతజాతం, విచష్టే = అనుగ్రాహ్యతయా అభిపశ్యతి, తమ్=ఏవం రూపం, దేవం, పాకేన = పరిపాకేన, మనసా, అంతితః=సమీపే, అహమపశ్యమ్=అదర్శమ్. కించ, మాతా=ఉదకానాం నిర్మాత్రీ మాధ్యమికా వాక్, తం రేఢి= ఆస్వాదయతి. ఉపజీవనమాత్ర మత్ర లక్ష్యతే స ఉ = సఖల్వ, మాతరం=వాచం, రేఢి=వేఢి-తామేవోపజీవతి, లిహ ఆస్వాదనే.

దుర్గాచార్యుల భాష్యము.

ఏక ఏవ = అద్వితీయః, యస్య పతనే = గమనే, ప్రతిమాయానం ద్వితీయంనాస్తి స సుపర్ణః=సుపతనః = వాయుః, సముద్రమ్=అంతరిక్షమ్, నిత్యమావివేశ=ఆవిశతి. న కదాచిదప్యనావిష్టస్తత్ర స చ పునః సర్వభూతాను ప్రవేశీ, తదా విశ్వం భువనం, సర్వాణీమాని భూతజాతాని, విచష్టే=అభివిపశ్యతి, యథా ద్రష్టవ్యాని, తమేవం వర్తమానం, అహం, పాకేన మనసా = విపక్వప్రజ్ఞానేన సర్వగత మపి సన్తమ్ అంతికమివ, అపశ్యమ్ ఋషిః దృష్టదేవతా సతత్వః కస్మై చిదాచక్షాణో బ్రవీతి. తం మాతారేఢి,

స ఉ మాతరం=మాతా మాధ్యమికా వాక్, తముపజీవతి, పర స్పరా శ్రయత్వాత్తయోర్వృత్తే రధ్యాత్మ వదితి-ఇతి.

ఈ భాష్యకారుల భాష్యార్థముల ననుసరించి, మంత్రము యొక్క భావార్థ మేమన, సుందర పతనస్వభావముగల వాయువు సముద్రమ్=అకాశమున వ్యాప్తుడైయుండి సర్వప్రాణులకు ప్రాణ ససహాయుడై యనుగ్రహించుచున్నాడు. అతనిని పరిపక్వజ్ఞాన సహాయమున సంతికమున జూచుచున్నాను. ఆ వాయువును, మాతా=జలమును నిర్మించు మాధ్యమిక దేవత అనగా మేఘస్థ విద్యుత్, నాకుచున్నది. ఆ విద్యుత్తును వాయువు నాకుచున్నది. అనగా పరస్పరము ఆధారభూతులై యున్నారు. ఇట్టి మంత్రార్థము లందు సముద్ర మంతరిక్షవాచకమని స్పష్టపడుచున్నది. ఇంతియగాక.

సహస్రశృంగో వృషభో యః సముద్రాదుదీచరత్॥ (అ.వే.)

వేయికొమ్ములు గల ఎద్దు అనగా సూర్యుడు సముద్రాత్ = ఆకాశమునుండి ఉదితుడయ్యెను. అని అథర్వవేదమున గూడ సముద్రశబ్ద మంతరిక్షవాచకమని తెలియుచున్నది.

మఱియు ఋగ్వేదములో

సో అర్ణవానద్యః సముద్రియః ప్రతిగృభ్ణాతి విశ్రితావరీభిః
ఇంద్రః సోమస్య పీతయే వృషాయతే సనాత్
సయుధ్మ ఓజసా పనీయతే॥

ఈ మంత్రమున 'సముద్రియః', అను శబ్దమును సాయ ణులు సముద్రియః, సముద్రవస్త్యస్మాదాపః ఇతి సముద్రమ్

అంతరిక్షమ్, తత్రభవః సముద్రియః, అంతరిక్షవ్యాపీ, యని వ్యాఖ్యానముజేసిరి. ఇట్టి యుదాహరణములు వేదములందు పరిశీలకుల కనేకములు దొరకగలవు. విస్తరభయమున నిట నెక్కువ నుదాహరించుటనుచితమని తోచెడిని. విద్వాంసులు స్వయముగా వేదముల జూడగలరు. ఇట్లు సముద్ర మంతరిక్ష మని వేదములందు సుస్పష్టముగా గనబడుచున్నది. ఇప్పుడు బుద్ధిమంతులు స్వయముగా మీమాంసింతురు గాక, సూర్యస్థాన మున కల్పించిన విష్ణుభగవానునకై, సూర్యున కాకాశము నివాస స్థానమైనట్లు భూతల సముద్రము కల్పింపబడెను. గాథలలో నెల్ల చోట్ల సముద్ర శాయిభగవానుని వర్ణనను చూచుచున్నాము. పూర్వము వ్రాసినట్లు విష్ణుశబ్దమునకు సూర్యుడని అర్థమున్నపుడు ఆకాశమున నివసించుచుండెడివాడు. ఆ యర్థము విడిచి విష్ణువని వేఱొక కల్పిత దేవుడని భావించినప్పటి నుండి భూతలసముద్రము నివాసస్థానమయ్యెను. ఇట్టి సమానార్థకములగు శబ్దముల తీసికొని యీ కల్పనలు చేయుటలో ప్రథమమున జనులలో గల వేద విశ్వాసమేయని తోచుచున్నది. అందువలన మన చతుర్భుజుడగు విష్ణువు సూర్యునికంటె వేఱుగాడని విబుధులకు గోచరము కాకపోదు.

ఆపః – విష్ణుః

వైదిక నిఘంటువునందు 'ఆపః' అను శబ్దముగూడ నాకాశ నామములందు జూపియుంటిని. ఈ శబ్దముయొక్క అర్థమును విపరీతముగా గ్రహించి వేదసమ్మతమగు అర్థమును విడిచి సంస్కృతభాషలో జలమని వాడియుండిరి. దీన గలిగిన అనర్థ మింతని చెప్పనలవికాదు. 'ఆపః' అను శబ్దము నిత్యబహువచనము

సంస్కృతభాషలో ప్రస్తుతము జలపరముగానే దీని నుపయోగింతురు. ఇందువలన ననేక గాథలు కల్పింపబడి నేడవి సత్యముగా వ్యవహరింపబడుచున్నవి. ఈ యర్థము ననుసరించియే విష్ణువున కనపరుడగు మన నారాయణుడుగూడజలముననివసించుచున్నట్లు వర్ణించిరి. మనుస్మృతిలో.

ఆపో నారా ఇతి ప్రోక్తాః, ఆపో వై నరసూనవః,
తా యదస్యాయనం పూర్వం తేన నారాయణః స్మృతః॥

విష్ణు పురాణమున నిట్లే

ఇదం చోదాహర స్త్యత్ర శ్లోకం నారాయణం ప్రతి
బ్రహ్మస్వరూపిణం దేవం, జగతః ప్రభవావ్యయమ్॥
ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః,
అయనం తస్య తాః పూర్వం తేన నారాయణః స్మృతః॥

వస్తుతః పరమాత్ముడు సంపూర్ణ ప్రపంచమున వ్యాపించియుండును. కేవలము జలమున నివసింపడు. సమస్త ప్రపంచవ్యాపి పరమేశ్వరుడు జలమున లేడని మా యభిప్రాయముగాదు. కాని జలమున మాత్రమే నివసించెననుట యసంగతము. విష్ణువును కల్పించినవారు ప్రథమమున తెలిసియే సముద్రమును నివాసముగా కల్పించిరి. కాని అనంతరకాలమున జనులు సముద్ర శబ్దమున గల గూఢార్థమును గ్రహింపజాలక అనేక అనర్థములు కల్పించి గాథలనల్లిరి. వస్తుతః ఈ శ్లోకములలోగల అపః అను శబ్దము ఆకాశపరము. ఇట్లే 'నారా' అను శబ్దము ఆకాశమునే తెలుపును. 'నరః' అనగా జగన్నేతృడగు పరమాత్ముడు. తస్య -

అపత్యం=నారః = ఆకాశము. ఆకాశముగూడ పరమాత్మునకు స్థానము. ఇట్టి సుందరార్థమును విడిచి పురాణములలో పరమేశ్వరుడు సంపూర్ణ ప్రపంచమును నష్టపఱచి జలమున శయనించుననని వర్ణించియుండిరి. భాగవతమున-

యస్యాంభసి శయానస్య యోగనిద్రాం వితన్వతః,
నాభిహ్రదం బుజాదాసీద్ బ్రహ్మ విశ్వసృజాంపతిః॥

జలమున శయించి యోగనిద్రయందున్న భగవానుని నాభి కమలమునుండి ప్రజాపతులకు ప్రభువగు బ్రహ్మ ఉద్భవించెను. ఇట్లు 'ఆపః' శబ్దమున కర్థము సరిగా తెలిసికొననందున భారతమున ననేక అనర్థేతిహాసములు కల్పింపబడినవి. ఈ యాఖ్యానములు వైదికసంస్కృతిలోగల వైశిష్ట్యమును కలంకపఱచిన వనుట నిస్సందేహము. విధర్ములకాశంకా స్థానములయ్యెను. ఇంతియగాక-

అప ఏవ ససర్జాదౌ తాసు వీర్యమవాసృజత్॥ (మను)

ఈ శ్లోకమున ఆపః అనగా జలమని భావించి సృష్టి ప్రథమమున జలమును సృజించినట్లు వర్ణించుట వైదిక సృష్టిక్రమమునకు సర్వథా విరుద్ధము. అశుద్ధమును వేదమున

తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః
ఆకాశాద్వాయుః, వాయోరగ్నిః, అగ్నేరాపః, ఇత్యాది॥

అనగా

ఆ పరమాత్ముని నుండి ప్రథమమున నాకాశము ప్రకాశమయ్యెను. దీని ననుసరించి "అప ఏవ స సర్జాదౌ" అనుచోట ఆపః = ఆకాశమని అర్థము సరియగునని స్పష్టమగుచున్నది.

మఱియు ఋగ్వేదమున

పరో దివా పర ఏనా పృథివ్యాః పరో దేవేభిరసురైర్యదస్తి
కింస్విద్గర్భం ప్రథమందధ్ర ఆపో యత్ర దేవా
సమపశ్యన్త విశ్వే॥ (ఋ. 10 మ.)

అనగా ఈశ్వరతత్త్వము, ద్యులోకమునకు,పృథివికి, (దేవైః + అసురైః) ప్రాణప్రదములగు నన్ని పదార్థములకు, పరమైయున్న, ప్రథమమున 'అపః'=ఆకాశము ఏ గర్భమును ధరించెను ? సూర్యుడు నక్షత్రములు వాయువు మున్నగు సమస్త దేవతలు ఎక్కడ పరస్పరకార్యములను సాధించిరి ? అని ప్రశ్నించి యనంతర మంత్రమున నిట్లు సమాధానము చేసినట్లు గనబడుచున్నది.

తమిద్గర్భం ప్రథమం దధ్ర ఆపో యత్ర దేవా
సమగచ్ఛన్త విశ్వే
అజస్య నాభావధ్యేకమర్పితం యస్మిన్ విశ్వాని భువనాని
తస్థుః॥

ఆపః=ఆకాశము, ప్రథమం=మొదట, తమిత్ = పరమాత్మ స్వరూప, గర్భం=గర్భమును, దధ్ర=ధారణచేసెను. యత్ర = ఏ గర్భమున, విశ్వేదేవాః=సమస్తదేవతలు, సమగచ్ఛన్త = కలిసి యుండిరో, అజస్య=అజన్ముడైన పరమాత్ముని, నాభావధి=నాభిలో, అనగా (బాహ బంధనే) అను ధాత్వర్థము ననుసరించి ప్రపంచమును బంధించు శక్తియొక్క అధారమున, ఏకమర్పితమ్ =

ఒక్క యచింత్యతత్త్వ మర్పింపబడెను. యస్మిన్ = దేనియందు, విశ్వాభువనాని = సమస్తలోకములు, తస్థుః = స్థిరములైయున్నవో.

ఇందు గర్భశబ్దము ఈశ్వరవాచకమగుట ఆ శబ్దమునకు గల యౌగికార్థమే ముఖ్యము. గర్భము = గ్రహించునది. అందువలన సమస్తజగత్తునకు గ్రహణ-ధారణకర్తయగు పరమాత్ముని ప్రథమమున నాకాశము తనలో ధరించెను. పరమాత్ముడు వ్యాపకుడగుట నాకాశములో నుండెనని తాత్పర్యము.

విద్వాంసు లీ మంత్రార్థముల పరికించక 'అపః' శబ్దమునకు జలమని యనర్థమును చేసినందువలన లోకమున నెంత హాని కలిగినదో పాఠకులు యూహింపగలరని భావించెద.

శేషనాగః - విష్ణుః

విష్ణు సంబద్ధములగు కథానకములలో శేషనాగునిగూర్చియు విచారించుట తప్పనిసరి. కథలలో శేషుడు విష్ణువునకు మంచముగాను వర్ణించియుండిరి. దీనికి ముఖ్యకారణము సూర్యుడు, రెండర్థములు గల శబ్దములే.

సాధారణముగా పృథివి బృహస్పత్యాది గ్రహములను సూర్యు డాకర్షించి ధారణచేయుచున్నట్లందఱికి తెలిసిన విషయమే. కాని, ఆ సూర్యు నెవరు ధారణచేయుచున్నారని శంకింపనంతకంటె పెద్దదగు మఱియొక విశేష ఆకర్షణశక్తి గల మూర్తద్రవ్యము ధరించుచున్నదని సమాధానము రాగలదు. ఇట్లు మరల దాని నెవరాధారమనిన మఱియొకటిని కల్పింపనగు, అంతమున వీని కన్నిటి కాధారముగా నొక యనంత అచింత్యశక్తిని కల్పింపక తప్పదు. ఆశక్తియే పరమాత్ముడని చెప్పబడుచున్నది. ఇది బ్రహ్మాండమునగల పదార్థముల కన్నిటికి నాధారముగా నంత

మున శేషించును గనుక శేషుడనియు అనంతుడనియు చెప్ప బడెను. ఇట్టి శేషుని శయ్యలో జగత్తునమున్న సమస్తలోకములకు పలక్ష్యుడగు సూర్యుడు=ప్రస్తుత కల్పితుడగు విష్ణువు శయనించు చున్నాడు. నేడు శేషుడను పదము సర్పపర్యాయమై అనంత గాథల కాధారమయ్యెను.

"శేషోఽనంతో వాసుకిస్తు సర్పరాజోఽథగోనసే" అమర. పాఠకులారా! ఈవిధముగా కల్పిత విష్ణువుయొక్క సాధారణ రూపము నతని వాహనశయనాదుల వాస్తవస్వరూపము మీకు బోధపడినదని యెంచెద - ఈ కల్పనాసౌందర్యము బుద్ధిమంతుల కెంత రుచించినను పామరజనులలో నధికముగా నజ్ఞానమునే వ్యాపింపజేసి యనర్థసాధన మయ్యెనని వ్రాయుట దోషావహము కాదని తోచెడిని.

(విష్ణువు - చతుర్భుజుడు)

ఇంతవఱకు కేవలము విష్ణుభగవానుని నామవాహనాదులను గూర్చి వ్రాసియుంటిని. ఇకముందు విష్ణుస్వరూపము, విష్ణువునకు సంబంధించిన అవతారము స్వరూపము-విష్ణుశబ్దార్థము మున్నగు విషయముల పాఠకులు చూడగలరు.

పురాణములలో పలుచోట్ల విష్ణుడు చతుర్భుజుడు నాలుగు భుజములు గలవాడని వర్ణించుట పురాణవిదులకు సుస్పష్టము. భాగవతమున నీ క్రింది శ్లోకముల దిలకింపుడు.

కేచిత్ స్వదేహాంతర్హృదయావకాశే ప్రాదేశమాత్రం
పురుషం వసంతమ్
చతుర్భుజం కంజరథాంగచక్రం గదాధరం ధారణయా
స్మరన్తి॥

కిరీటినం కుండలినం చతుర్భుజం పీతాంబరం
వక్షసిలక్షిత శ్రియమ్
తమద్భుతం బాలకమంబుజేక్షణం చతుర్భుజమ్
శంఖగదాద్యుథాయుధమ్
శ్రీవత్సలక్ష్మం గలశోభికౌస్తుభం పీతాంబరం
సాంద్రపయోదసౌభగమ్
మేఘశ్యామశరీరస్తు పీతవాసాశ్చతుర్భుజః
శేషశాయీ జగన్నాథో వనమాలావిభూషితః॥ (దేభా.)

ఇట్టి శ్లోకములు పురాణములలో వందలకొలది దొరకగలవు. వీనిలో విష్ణువు నాలుగుభుజములు గలవాడని వర్ణించుట సుస్పష్టము ఇంతియగాక విష్ణు పార్షదులుకూడ చతుర్భుజములనియే వర్ణింపబడిరి. తదనుకూలముగా మందిరములలో నారూపములను జూచుచున్నాము.

న తత్ర మాయా కిముతాపరే హరే రనువ్రతా యత్ర
సురాసురార్చితాః
శ్యామావదాతాః శతపత్రలోచనాః పిశంగవస్త్రః
సురుచా సుపేశసః
సర్వే చతుర్బాహవఉన్మిషన్మణిప్రవేకనిష్కాభరణాః
సువర్చసః (భాగవత.)

విష్ణులోకమున మాయగాని మాయాపులుగాని లేరు. దేవతాదులచే పూజితులు, నాలుగు బాహువులుగలవారు, సుందర వస్త్రాభరణములు గలవారు హరిభక్తులే విరాజిల్లుచుందురు.

ఈవిధముగా విష్ణుభగవానుడు నాలుగుభుజములు గల వాడని వర్ణించిరి. శిరము, నేత్రములు, అధికముగా వర్ణించి నట్లె క్కడ గానరాదు దీనికి కారణము ముఖ్యముగా సూర్యస్వరూపమే. సూర్యు డుదయించునపుడు కిరణరూపములగు భుజములు నాలుగు దిశలలో వ్యాపించుట అబాల గోపాలమునకు ప్రత్యక్షమే- కిరణములు-కరములు, భుజములు, హస్తములు బాహువులునని పర్యాయపదములే. చతుర్భుజుడను శబ్దము సమస్తమగుట - చతస్సృషు, దిక్షుభుజాః యస్య స చతుర్భుజః=సూర్యః, సూర్యు డని యర్థము. లేక, చత్వారోభుజాః యస్య స చతుర్భుజః అని విగ్రహము చేయనగు. ఇందు గమనింపదగిన దేమన సూర్యుని స్థానమున విష్ణువు కల్పించినపుడు చతుర్భుజ శబ్దమునకు నాలుగు భుజములు గల వాడని యర్థముచేసి విష్ణువునకు బాహువులు నాలుగుగా కల్పించిరి. ఇందు సమాసమున గలవైలక్షణ్యము నాధారముగా గొని యిట్లు కల్పనచేసిరని స్పష్టము. ఇట్లే భాగవత భారతములలో నష్టభుజుడు దశభుజుడుగా విష్ణువు వర్ణింపబడుట జూచుచున్నాము.

కృతపాదః సుపర్ణాంసే ప్రలంబాష్టమహాభుజః
చక్రశంఖాసిచర్మేషు ధనుః పాశగదాధరః॥ (భా॰)

మహామణివ్రాతకిరీటకుండలమ్ ప్రభాపరిక్షిప్త
సహస్రకుంతలమ్

ప్రలంబచార్వష్టభుజం.... శ్రీవత్సలక్ష్మం
వనమాలయావృతమ్॥ (భా.)

పితామహాదపి వరః శాశ్వతః పురుషో హరిః,
కృష్ణో జాంబూనదా భో వ్యభ్రే సూర్య ఇవోదితః॥
దశబాహుర్మహాతేజో దేవతారినిషూదనః,
శ్రీవత్సాంకో హృషీకేశః సర్వదైవతపూజితః॥
(మ. భా. అనుశాసనే)

ఈ శ్లోకములందు విష్ణువష్ట దశ భుజములు గలవాడుగా వర్ణింపబడుట స్పష్టమగుచున్నది. కారణము విశేషముగా నేమియులేదు. సంస్కృతమున నితర సాహిత్యములందుగూడ దిశలు నాలుగు-ఎనిమిది పదిగా వ్యవహరించుటయే. భుజ బాహుకర కిరణపదము లేకార్థములగుట సూర్యకిరణస్థానమున హస్తముల కల్పించి విష్ణువునకు విలక్షణమైన స్వరూపమును లోకమున వ్యాపింపజేసిరి. ఈ యాలంకారిక వర్ణనల యథార్థ స్వరూపమును తెలిసికొనజాలక భారతీయులు కల్పిత విష్ణుదేవుని సృష్టికికర్త ధర్తగా భావించి గృహములందు తత్ప్రతి కృతులను బెట్టి పూజింపసాగిరి. సార్వజనికములగు పెద్దపెద్ద మందిరములు నీ విధముగ నిర్మింపబడినవనుట సందేహములేదు.

విష్ణువు - శ్వేతకృష్ణ శ్యామవర్ణములు

పూర్వకాలమున విష్ణువు శ్వేతవర్ణము గలవాడుగా వర్ణింపబడెను. తరువాత పురాణములలో నక్కడక్కడ శ్వేతవర్ణమును జూడగలము.

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే॥

ఈ శ్లోకము చాల ప్రసిద్ధమైనది. విష్ణు సంబంధమైన సత్య నారాయణ వ్రతాదులలో మొదట నీ శ్లోకమును పఠించుట నంద ఱెఱిగినదియే. సత్యనారాయణ వ్రతపద్ధతిలో నీ శ్లోకము చూచు చున్నాము. ఈ వ్రత పద్ధతి పద్మ పురాణాంతర్గతమని తెలియు చున్నది ఇందు విష్ణువు శ్వేతవస్త్రధారి, చంద్రునిబోలు వర్ణము గలవాడు, చతుర్భుజుడు, ప్రసన్నవదనుడు ననియు, విఘ్న శాంతికొఱకు ధ్యానముచేయవలయుననియు వర్ణన స్పష్టము. ఇట్లు సూర్యస్థానుడగు విష్ణువు శ్వేతవర్ణుడగు టుచితమే. కాని అధిక ముగా విష్ణువు కృష్ణవర్ణుడుగా వర్ణింపబడియున్నాడు. కృష్ణవర్ణము నకు ముఖ్యకారణము సూర్యుడే. వేదములందు సూర్యుని కృష్ణు డని వర్ణించియుండుట పలుచోట్ల జూడగలము. సూర్యునిలో నాకర్షణశక్తి అధికముగా నుండుట కృష్ణుడని వర్ణింపబడెను. ఆకర్షణశక్తి యుక్తమగు వస్తువు కృష్ణమని చెప్పబడును. లోక మున ప్రతి పరమాణువునందును. ఆకర్షణశక్తి గలదు. కాని పృథివ్యాది పదార్థము లన్నిటికంటె సూర్యు డనేకరెట్లు బృహ ద్రూపుడగుట నతనిలో విశేషాకర్షణ శక్తిగలదు. అందువలన ప్రాధాన్యము ననుసరించి సూర్యుడు కృష్ణుడని చెప్పబడెను.

ఋగ్వేదమున—

కృష్ణం నియానం హరయః అపో వసానా దివముత్పతన్తి
త ఆవవృత్రన్ సదనా దృతస్యాऽదిత్ఘృతేన పృథివీ
వ్యుద్యతే॥

హరయః=జలమును హరించునట్టి, (అందువల్లనే) అపః వసానాః = జలముతో మేఘమును నింపునట్టి, హరయః = కిరణ ములు, నియానం = తన నియమములో పృథివ్యాదిజగత్తులను

నియమించుచున్న, కృష్ణం=సూర్యునుద్దేశించి, దివముత్పతన్తి = ద్యులోకమునకు వెళ్ళుచున్నవి. ఆ కిరణములు ఋతస్యసదనాత్=సూర్యుని మండలమునుండి, ఆవవృత్రన్ = మరలివచ్చునపుడు, ఘృతేన=జలముతో, పృథివీ=భూమి, వ్యుద్యతే = తడిసి పోవుచున్నది. ఈ వర్ణన అయనములనో ప్రాతః సాయం సంధ్యలనో ఉద్దేశించి చేయబడినట్లు స్పష్టమే. సాయంకాలమున సూర్యకిరణములు పృథివిలో నొక భాగమునుండి మఱియొక భాగమున కరుగుటయు మరల ప్రాతఃకాలమున పూర్వస్థానమునకు వచ్చునప్పుడు భూమి మంచుతో తడిసియుండుటయు నాపామర విదితము.

ఆకృష్ణేన రజసా వర్తమానో నివేశయన్నమృతం మర్త్యన్చ హిరణ్యయేన సవితా రథేన దేవో యాతి భువనానిపశ్యన్॥

ఆకృష్ణేనరజసా = ఆకర్షణయుక్త పృథివ్యాదిలోకములతో (లోకాః రజాంస్యుచ్యన్తే నిరుక్త) వర్తమానః=తిరుగుచు, సవితా= దేవః, సూర్యుడు, అమృతం=బృహస్పత్యాద్యమర గ్రహములను, మర్త్యంచ = మరణశీల భూమిని, నివేశయన్ = ఉచితస్థానముల స్థాపించుచు, భువనాని=భూతసముదాయమునకు, పశ్యన్=దర్శన శక్తినిచ్చుచు, హిరణ్యయేన రథేన = హరించుశక్తిగల రథముతో ఆయాతి = వచ్చుచున్నాడు. ఇందు ఆకర్షణశక్తి యుక్తములగు పృథివ్యాదిలోకములను కృష్ణశబ్దమున వర్ణించినట్లు స్పష్టమగుచున్నది ఇట్లాకర్షణశక్తి ప్రయుక్తమగు కృష్ణశబ్దమును చక్కగా తెలిసికొనక, కల్పితభగవానునియందు కృష్ణవర్ణమాపాదించి లోకమున ననేకార్థముల కల్పించిన యీ విద్వాంసుల నేమనగలమో తోచకున్నది. సామాన్యజనులలో నిట్టి యజ్ఞానము వ్యాపించు

టకు ముఖ్యముగా నీ విద్వాంసులే సాపరాధులనుట నిస్సంశయమే. వేదమున సూర్యునుద్దేశించి వర్ణించియున్న శుక్ల కృష్ణ రూపములనే మన కల్పిత విష్ణుభగవానునికి కల్పించిరనుటకు మఱియొక ప్రమాణము నుద్ధరించుచున్నాడ.

"తన్మిత్రస్య వరుణస్యాభిచక్షే సూర్యో రూపం కురుతే ద్యోరుపస్థే
అనన్తమన్య ద్రుశదస్య పాజః కృష్ణమన్యద్ధరితః సంభరన్తి॥ (యజు.)

దీనికి పురాణకాలీనుడగు మహీధరుని భాష్యమును తిలకింపుడు.

సూర్యో ద్యోః ద్యులోకస్యోపస్థే ఉత్సంగే మిత్రస్య వరుణస్య చ తద్రూపం కృణుతే కురుతే, యేన రూపేణ జనాన్ అభిచక్షే అభిచష్టే పశ్యతి. మిత్రరూపేణ సుకృతినోఽనుగృహ్ణాతి, వరుణరూపేణ దుష్కృతినో నిగృహ్ణాతీత్యర్థః. అన్య సూర్యస్య అన్యత్ ఏకం పాజో రూపమన్యత్ కాలతో దేశతశ్చాపరిచ్ఛేద్యమ్ రుశత్ శుక్లం దీప్యమానం విజ్ఞాన ఘనానందం బ్రహ్మైవ, అన్యత్ కృష్ణం ద్వైతమ్ లక్షణం రూపం హరితః దిశః ఇంద్రియవృత్తయో వా సంభరన్తి ధారయన్తి ఇంద్రియగ్రాహ్యం ద్వైతరూపమేకం ఏకం శుద్ధం చైతన్యమద్వైతమితి ద్వే రూపం సూర్యస్య సగుణనిర్గుణం బ్రహ్మ సూర్య ఏకఏవేత్యర్థః."

సూర్యః=సూర్యుడు, ద్యోః ఉపస్థే = ద్యులోకోత్సంగమున. మిత్రస్యవరుణస్య=మిత్రవరుణులయొక్క, తద్రూపం=ఆ రూప

మును, కృణుతే = చేయుచున్నాడు, యేనరూపేణ = ఏ రూప ముతో, జనాన్=జనులను, అభిచక్షే=చూచుచున్నాడో, అనగా మిత్ర రూపమున సుకృతుల ననుగ్రహించుచున్నాడు - వరుణరూపమున దుష్టుల నిగ్రహించుచున్నాడు. అస్య=ఈ సూర్యునకు, అన్యత్ = ఒక, పాజః=రూపము, అనంతమ్=దేశకాలములవలన నపరిచ్ఛేద్య మైనది, రుశత్=దేదీప్యమాన ప్రకాశముగలదైన శుక్లము. అన్యత్= రెండవరూపము-కృష్ణమ్ = ద్వైతలక్షణమగు కృష్ణరూపమును, హరితః=దిక్కులులేక ఇంద్రియములు, సంభరన్తి=ధారణచేయు చున్నవి.అనగా సూర్యునికి రెండురూపములున్నవి.ఒకటి ఇంద్రియ గ్రాహ్యమగుద్వైతరూపము,రెండవది శుద్ధచైతన్యస్వరూపము అనగా సగుణ నిర్గుణ స్వరూపమను బ్రహ్మ సూర్యుడేనని తాత్పర్యము. ఇట్లు వేదములలో సూర్యునకు రెండురూపము లున్నట్లును వానిని ద్వైతాద్వైతపరములుగా వర్ణించి సూర్యుడే బ్రహ్మయని మహీధర భాష్యమున స్పష్టపడుచున్నది.వీరు పురాణకాలీనులగుట సూర్యునే పరబ్రహ్మ పరమాత్మని స్థానమున భావించుటలో నతిశయమేమి? యథార్థమున నీ మంత్రభావమేమన సూర్యునకు రెండురూపము లున్నవి. అవి శుక్ల కృష్ణశబ్దములతో వ్యవహరింపబడును. శుక్ల రూపమున లోకములను భాసింపజేయుచున్నాడు. కృష్ణము ఆకర్షణశక్తివలన తాను మండలమునగల పృథివ్యాదిలోకములను ధారణచేయుచున్నాడు. ఈ యర్థము సుస్పష్టముగా నిందు బుద్ధి మంతులకు గోచరము కాగలదు. ఈ వర్ణనల ననుసరించియే కల్పిత విష్ణుభగవానుడు శుక్ల కృష్ణరూపములు గలవాడయ్యెను. విష్ణువులో కృష్ణరూపము నలుపురంగు. సూర్యుని కృష్ణరూపము

లోకలోకాంతరముల నాకర్షించుశక్తి విశేషము. అర్థములలో నెంత భేదమున్నదో పాఠకు లూహింతురుగాక.

విష్ణు విట్లు కృష్ణవర్ణుడగుట తత్సంబంధములగు నవతారములు నావర్ణముతోగూడి యుండినట్లు వర్ణింపబడినవి. వామనుడు, పరశురాముడు, రాముడు, కృష్ణుడు మున్నగు నవతారములన్నియు శ్యామవర్ణయుక్తము లయినట్లు పురాణములలో జూచుచున్నాము. పాఠకులారా! రఘుకుల తిలకుడగు రామచంద్రుడు, యదుకులోత్తంసుడుగా కృష్ణచంద్రుడు, పరశురామ, వ్యాసాదులు ఉత్తమ ఆర్యవంశములలో నుద్భవించి నలుపువర్ణముతో విభూషితులై యుండుట సంభవమా? ఆర్యవంశములలో నేడు నన్యజాతులతో సంమిశ్రణ కలిగిన తరువాత గూడ నీయవతారములబోలు కృష్ణవర్ణు లెక్కడ గానరాదు. మన్వాదిస్మృతులలో గూడ ఆర్యులు గౌరవర్ణులని వర్ణించియుంది. నలుపువర్ణము శూద్రులకై రిజిష్టరు చేయబడినట్లుండుట విబుధుల కపరోక్షము. అందువలన, దశరథుడు, వసుదేవుడు మున్నగు సుందర గౌరవర్ణముగల తనువుల నుండి కృష్ణవర్ణ వికారులై రామచంద్రాదులు చక్రవర్తి లక్షణములతో బుట్టిరనిన బుద్ధికి విపరీతముగా దోచకపోదు. నేటి బుద్ధిమంతు లీ విలక్షణవర్ణమును అవతారవాదమునకు ముఖ్య హేతువుగా సమర్థింతురు. ఈ బుద్ధికౌశలము నిరాధారమగుట విచారకుల హృదయమునకు నచ్చదు. వాస్తవమున మొదట మూడు దేవతలనే ప్రధానముగా నొప్పుకొన్నను, తరువాత అజ్ఞానము ప్రబలిన కొలది, రామచంద్రాది మహాప్రతాపులగు రాజులను గూడ, దేవతలుగా భావించి సుందరమూర్తులను కల్పించి పూజింపసాగిరి.

ఇట్లు లోకమున నవతారవాదము ప్రబలమయ్యె. ఇందు ప్రత్యక్షనిదర్శనము మన గాంధిమహాత్ముడే. రాజకీయక్షేత్రమున

వీరు పడిన కష్టములను జూచి లోకము వీరిని ముందు మహాత్ము డని గౌరవించెను. తదనంతర మవతారపురుషుడని యెంచి మూర్తులను గల్పించి కొందఱు పూజింపసాగుట మనము జూచు చున్నాము. ఈ విధముగానే రామకృష్ణాదు లవతారపురుషు లయిరి. అందువలన వారి వర్ణమును కృష్ణ-శ్యామ మయ్యెను.

ప్రసంగవశమున శ్యామశబ్దమును గుఱించియు కొంచెము వ్రాయుట నుచితముకాదని తోచెడిని. విష్ణువును శ్యామవర్ణుడనియు నటనట వర్ణించియుండిరి. దీనికి కారణమేమై యుండును. సాధా రణదృష్టితో కృష్ణశ్యామ శబ్దములు పర్యాయపదములుగా వాడ బడియుండినను శ్యామశబ్దమునగల విశేషమునుగూర్చి కొంచెము వివరింపదలచి కొన్నివాక్యములు వ్రాయుచున్నాడ-విష్ణుకల్పనకు తరువాత బహుకాలమునకు జనులు విష్ణువుయొక్క యథార్థ రూపమును మఱచి విష్ణువును బ్రహ్మగానే దలపసాగిరి. బ్రహ్మ ఆకాశముతో నుపమింపదగియుండుటచే విష్ణువునుగూడ నాకాశ ముతో పోల్చసాగిరి. అందువలన విష్ణువు, రూపమునగూడ నాకాశ మునుబోలి శ్యామవర్ణుడయ్యెను. ఇది అనభిజ్ఞులయిన భక్తుల నిరాధారకల్పనకంటె వేఱుగాదు. ఆకాశమున నేరూపములేక కేవలము శ్యామవర్ణము దృష్టిగోచరమగుచున్నట్లు విష్ణువునందును యథార్థమున నేరూపములేక శ్యామవర్ణము కల్పితమని భావించు నెడల యీ కల్పన బుద్ధిమత్తతనే ప్రకటించును. అట్లుగాక కొంతమంది యైతిహాసికుల దృష్టికోణముతో విష్ణువును శ్యామవర్ణు డనుటకు కారణాంతర మూహింతురేని అజ్ఞానమే వెల్లడియగును. అది యెట్లన లౌకికసాహిత్యమున శ్యామశబ్ద మొక విలక్షణ సౌందర్యమునకు వాచకముగా వాడబడుచున్నది. కావ్యనాటకా దుల ననేక స్థలములలో.

శీతకాలే భవేదుష్ణా గ్రీష్మే చ సుఖశీతలా,
తప్తకాంచనవర్ణాభా సా శ్యామేత్యభిధీయతే॥

ఆ యా ఋతువుల సుఖావహ శీతోష్ణాది గుణములు కలిగి యతిసుందరమగు స్త్రీ శ్యామా అని చెప్పబడుచున్నదని వర్ణింపబడెను. అందువలననే గౌరవర్ణ విభూషితయగు పరమపూజ్యయునగు సీతామహారాణినిగూడ వాల్మీకులు శ్యామా అని వర్ణించియుండిరి. వ్యాసులు ద్రౌపదినిగూడ నిట్లే శ్యామ అని వాడియుండిరి. శ్యామా స్త్రీలింగశబ్దము, పుంలింగమున శ్యామ అని చెప్పవచ్చును. భారతీయులు తమ పూర్వాచారముల విడనాడి సాంసారిక సుఖసంగులై తమ యారాధ్యదేవుడైన విష్ణువునుగూడ పరమసుందర బాలకాకృతిలో మోహనరూపునిగా గల్పించి తదనుకూలముగా శ్యాముడని వర్ణింపసాగిరి. రాధే శ్యామశబ్దములో గల వైచిత్ర్యమిట్టిదే. మందిరములలోగూడ రామకృష్ణాదుల మూర్తులు బాలకాకృతిలోనే కల్పించి పూజింపసాగిరి. బాలరూపము తదితర యువావృద్ధరూపములకంటె సుందరమగుట జగద్విదితమే. ఉత్తరభారతమున దేవీనవరాత్రుల కాలమున తదితర కాలములందును సమారోహముతో జరుపబడు రామలీలలందును రామాది వేషములను బాలకులే ధరించి రాముని లీలలను ప్రదర్శింతురు. రావణ వధకాలమున రాముడు బాలకుడుకాకున్నను ఇట లీలలందు ప్రదర్శకరాముడు బాలకుడే జనుల మనసు నాకర్షించును వీని కన్నిటికి ముఖ్యకారణము భారతీయుల మానసిక దుస్థితియే. ఐతిహాసికుల దృష్టికోణముతో నికముం దుదాహరించు విషయము చిరస్మరణీయము, శ్యామశబ్దమునకు సుందరార్థ మెట్లుగలిగెను ?

శ్యామశబ్దము రంగును బోధించును. ప్రథమమున నార్యు లిటకు వచ్చినపుడు చాల గౌరవర్ణులుగా నుండిరి. ఈ దేశమున నున్న జాంగలికులు అనార్యులు నలుపువర్ణముగల వారుగానుండిరి. కాలక్రమమున నార్యులు అనార్యుల కన్యలతో సంబంధము చేయ సాగిరి. వారికి కలిగిన సంతానము ఆర్యులబోలి గౌరవర్ణులుగాని, అనార్యులగు మాతలవలె నత్యంత నలుపువర్ణముగల వారుగాని కొక విలక్షణ శ్యామవర్ణులైరి. ఈ వర్ణము ఆర్యులకందముగాదోచి వారీ శ్యామశబ్దమును సుందరార్థమున ప్రయోగింపసాగిరి. క్రమ క్రమమున సాహిత్యములో నీశబ్దము. సుందరార్థ ప్రతిపాదకమై భారతీయుల ఆరాధ్యదేవతల రూపబోధకస్థానము నలంకరించి నట్లు తెలియుచున్నది. వాస్తవమున కల్పనాగుణముగ విష్ణువు నకు శుక్లవర్ణమే ఉచితమనితోచెడిని. ఎందువల్లనన సంస్కృత సాహిత్యమున సత్వగుణప్రధానులయిన వ్యక్తులను శుక్లగుణ యుక్తులుగను, రజోగుణ ప్రధానులయిన వారిని రక్తవర్ణులుగను, తమోగుణ ప్రధానులను కృష్ణవర్ణులుగను వర్ణించుటాచారము గానబడుచున్నది. యముడు నతని కింకరులు తమోగుణ ప్రధాను లగుట వారిని అత్యంత కృష్ణవర్ణులుగా వర్ణించుట పురాణవిదు లెఱుగుదురు. ఈ మర్యాద ననుసరించి రక్షకస్థానాపన్నుడగు విష్ణువు శుక్లవర్ణుడును సంహారస్థానీయుడగు రుద్రుడు రక్తవర్ణుడును కావలసియుండ దానికి విపరీతముగా వర్ణించుటకు కారణము పురాణములలో దొరకకపోవచ్చును. వైదికసాహిత్యానుసారము సూర్యునకు బదులుగా కల్పింపబడిన వాడగుట విష్ణువునకు శుక్ల కృష్ణవర్ణములు వర్ణించుట యుక్తియుక్తముగా గనబడుచున్నది. పాఠకులారా పూర్వోల్లిఖిత పరిస్థితులను బట్టి విష్ణువు కేవలకల్పిత దేవుడుగా విచారకులకు నిశ్చయము కలుగకపోదు.

విష్ణువు - లక్ష్మి-శ్రీ

విష్ణువు యొక్క శక్తి లక్ష్మి-శ్రీదేవి యని వ్యవహరింపబడు చున్నది. సంస్కృతభాషయందు శోభాసంపత్తులను లక్ష్మి-శ్రీ శబ్దములతో వాడుచుందురు. విష్ణువునకు శ్రీదేవిని పత్నిగా కల్పించినవారు బుద్ధిమంతులగుటలో సందేహములేదు. విచారించి చూచిన నీ ప్రపంచమునకు శోభనుగల్పించువాడు సూర్యుడే గదా! ఈ విషయమును అనగా సూర్యుని వలన కలుగు ప్రాకృతిక సౌందర్యమును వర్ణించుట దుస్తరమైన విషయము, సూర్యుని ఉదయము వలన భూమిలోగల సమస్తప్రాణులు చైతన్యమును పొంది వ్యక్తావ్యక్తభాషలలో ప్రభాతగీతలను పాడుచు నెట్లు మనస్సును హరించునో ప్రతివారికి ననుభవవిషయమే. సూర్యుడున్న కాలమున జగమున నన్నివిధముల జాగృతి కనబడు చుండును. సూర్యాస్తమున జగమున నంధకారము వ్యాపించి భయావహదృశ్యమేర్పడుట ఎల్లరకు తెలిసినవిషయమే. ఒకప్పుడు రాత్రికూడ శోభాయుక్తమై యుండుట చూచుచున్నాము. రాకా సుధాకరునితో గూడిన రాత్రి యెవరికి సుఖము గలిగింపదు. ఎవరి కన్నుల కింపుగొలుపదు. ఎల్లరికి సుందరముగానే కనిపించును. కాని యీ సౌందర్యమునకు కారణము సూర్యభగవానుడే. సూర్యుని వలన ప్రకాశమును బొందియే అమృతకిరణుడు రాత్రి నలంకరించుచున్నాడు. అందువలన ప్రపంచమున సౌందర్యమునకు కారణము సూర్యుడగుట స్పష్టమే. ఇంతియుగాక పదార్థముల శోభకు ముఖ్యముగా కారణము వాని రూపము. మేఘ సౌందర్యము దానిలో నుండు శ్యామవర్ణమువలననే. మయూరము యొక్క చిత్రవిచిత్ర వర్ణమే దానిసౌందర్యమునకు ముఖ్యహేతువు.

ఇట్టి రూపమును గ్రహించునది నేత్రము. ఈ నేత్రమునకు కారణము తేజము. ఆ తేజమున కాకరమే సూర్యుడు. ఈశ్వరుని సృష్టిలో నయనార్థమే సూర్యుడు కల్పింపబడెను. "చక్షోః సూర్యోఽజాయత" మఱియు జగమునగల శుక్లనీల పీతహరితాది రూపములన్నియు సూర్యునివలన నేర్పడినవి. అందువలననే సూర్యుని విశ్వరూపుడనియు వ్యవహరింతురు. విశ్వరూపుడన 'విశ్వాని=సమస్తాని రూపాణి యస్మిన్' ఎవనియందు సమస్త రూపములున్నవో వాడు, లేక, 'విశ్వం సర్వం రూపయతీతి' సమస్తమును రూపించువాడునని యర్థము. ఛాందోగ్యోపనిషత్తులో

అసౌ వా ఆదిత్యః పింగల ఏష శుక్ల ఏష నీల ఏష
పీత ఏష లోహితః॥

నిశ్చయముగా సూర్యుడే పింగల వర్ణము. ఇతడే శుక్లము. ఇతడే నీలము పీతము, లోహితమును.

సూర్యు డిట్లు రూపప్రదాతయేగాక, సంపత్తికిని కారణభూతుడే. సూర్యుడనేక విధములయిన రోగములను నాశము చేయును. అందువలన లోకమున వ్యాధులు తగ్గుచుండును. పశు, పక్షి వివిధములగు నౌషధములు నన్నియు సురక్షితులగుచున్నారు. ఇట్లు మహాసంపత్తికి కారణభూతుడగుచున్నాడు. సూర్యుని అతపమువలననే సస్యాదులు చక్కగా ఫలించుచున్నవి. ఇట్లు విచారించినకొలది సౌందర్యము-ధనధాన్యాది సమృద్ధి రూపమగు లక్ష్మియు సూర్యునిశక్తిగా గనబడుచున్నవి. కేవల మిది యూహకాదు. ఇందు వేదప్రమాణము జూడుడు. ఈ క్రింది

మంత్రమున సూర్యునిశక్తియే శ్రీ అనియు లక్ష్మి అనియు వర్ణింప బడెను.

శ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యా వహోరాత్రే పార్శ్వే
నక్షత్రాణి రూపమశ్వినౌ వ్యాత్తమ్ ఇష్ణన్ని
షాణమముం ఇషాణ సర్వలోకం మ ఇషాణ॥ (య. 31 అ.)

అథమహీధరభాష్యమ్—

ఋషిరాదిత్యం స్తుత్వా ప్రార్థయతే. హే ఆదిత్య శ్రీః లక్ష్మీశ్చ తే తవ పత్న్యౌ జాయాస్థానీయే త్వద్వశ్యే ఇత్యర్థః-యయా సర్వజనాశ్రయణీయో భవతి సా శ్రీః, శ్రీయతే అనయా శ్రీః సంపదిత్యర్థః యయా లక్ష్యతే దృశ్యతే జనైః సా లక్ష్మీః సౌందర్యమిత్యర్థః. అహో రాత్రే తవ పార్శ్వే పార్శ్వస్థానీయే నక్షత్రాణి గగనగాస్తా రాః తవ రూపమ్. తవైవ తేజసా భాసమానత్వాత్ తేజసాం గోలకః సూర్యోనక్షత్రాణ్యంబుగోలకాః ఇతిజ్యోతిశాస్త్రోక్తేః. అశ్వినౌ ద్యావాపృథివ్యౌ తవ వ్యాత్తమ్ వికాశితముఖస్థానీయే. అశ్నువాతే వ్యాప్నుతస్తౌ అశ్వినౌ ద్యావాపృథివ్యౌ ఇమే హీదగ్ం సర్వమశ్నువాతామితి శ్రుతేః. య ఈదృశస్తం త్వాం యాచే ఇష్ణన్ కర్మఫలమిచ్ఛన్ సన్ ఇషాణ ఇచ్ఛ ఇషు ఇచ్ఛాయామ్ వికరణవ్యత్యయః యద్వా ఇష ఆభీక్ష్ణ్యే క్ర్యాదిః అన్వేచ్ఛార్థః కిమేషణీయమ్. తత్రాహ అముం

పరలోకం మే మమ ఇషాణ. మమ పరలోకః సమీపీకో౽స్త్వితీచ్ఛా అమోఘేచ్ఛత్వా దిష్టం భవతీత్యర్థః, సర్వం మే మమ ఇషాణ సర్వలోకాత్మకో౽హం భవేయమితీచ్ఛేత్యర్థః ముక్తో భవేయమిత్యర్థః సర్వం ఖల్విదం బ్రహ్మేతి సామశ్రుతేః॥

ఈ మంత్రమున కర్థము మహీధరభాష్యము ననుసరించి చేయుట మహీధరభాష్యమును ప్రామాణికముగా నెంచుచుండుట కాదు. కేవల మొకప్పుడు సూర్యుని ప్రధానదేవతగానెంచి యెట్లు భావించిరో సూర్యుని సాధనమున నొక దేవతను కల్పించి సూర్యగుణాదుల నా దేవతయందెట్లు ఆరోపించిరో చూపుటయే ముఖ్యోద్దేశ్యము.

ఋషి సూర్యుని స్తుతించి ప్రార్థించెను. హే ఆదిత్య! శ్రీః లక్ష్మీశ్చ=శ్రీ, లక్ష్ములు, ఇరువురును నీకు భార్యాస్థానీయులు. అనగా నీకు వశీభూతులు అహోరాత్రములు పార్శ్వస్థానములు గగనస్థితతారలు నీకు రూపము అవి నీవలననే భాసింపబడుచున్నవి. జ్యోతిశ్శాస్త్రమున అగ్నిగోళమును సూర్యుడనియు జలగోళములను నక్షత్రములనియు చెప్పబడెను. పృథివీద్యులోకములు ముఖస్థానీయులు. ఇట్టి నిన్ను, నాకొఱకై పరలోకమును, అన్నిలోకములను కోరుచని యాచించుచున్నాడ. అనగా నేను సర్వలోకాత్ముడనై ముక్తుడనుగావలెనని యభిలషించుచున్నాడ—

ఈ మంత్రమున సూర్యుని పత్నులు లక్ష్మి అనియు శ్రీ అనియు, స్పష్టముగా చెప్పబడెను. అందువలననే మన కల్పిత విష్ణువునకు శ్రీ లక్ష్ములు పత్నులుగా చేసిరి. ఇందు ముఖ్యముగా

గమనింపవలసినదేమన పత్నీశబ్దము. వైదికభాషయందు పాలించు శక్తిని పత్ని అని చెప్పుదురు. సూర్యాది పదార్థములకు మనుష్యుల వలె స్త్రీలు పత్నులెవరు లేరు. కాని యీ పదార్థములలో జగము లను పాలనపోషణచేయునట్టి విశేషశక్తి గలదు. ఆ శక్తినే పత్ని అని చెప్పుదురు. లక్ష్మియొక్క ఉత్పత్తి సముద్రమునుండి యని పురాణముల నొప్పుకొని యున్నారు. సముద్రము ఆకాశపరమగుట పూర్వము వర్ణించియుంటిమి. అందువలన నాకాశమునుండి లక్ష్మి యుద్భవించెను. అనగా ఆకాశమున నున్న సూర్యునినుండి లక్ష్మి పుట్టిన దని తాత్పర్యము సంస్కృతమున, మంచస్థ జనులుక్రో శించుచున్నారనుటకు 'మంచాః క్రోశన్తి' అని ప్రయోగించుట సాహిత్యవిదులకు తెలియనిదికాదు. సమయాంతరమున జను లీ గూఢభావమును తెలిసికొనజాలక సముద్రమనగా కేవలము భూతలసముద్రమనియు నందు సముద్రమథనకాలమున లక్ష్మి యుద్భవిల్లెననియు నామెను గ్రహించినట్లును భావించిరి. ఈ యజ్ఞానమునకు మేరలేకుండుట విషాదకరము.

విష్ణువు - సముద్ర మథనము

సముద్ర మథనమును గుఱించిన గాథయు నతిప్రసిద్ధము. మహాభారతమున, రామాయణమున, శ్రీమద్భాగవతాది పురాణ ముల నెల్లచోట్ల నీ కథను చర్చించియుండిరి. ఈ కథలలో విష్ణువే ముఖ్యుడు. విష్ణువు మోహినీరూపమును ధరించకున్న దేవతల పరిశ్రమమంతయు విఫలమయియుండెడిది. ఇట్టి మహత్త్వ పూర్ణ మైన కథను గుఱించి విచారించుటావశ్యకమని యెంచెద—

ఇందుగల కల్పనయు నతిరోచకముగా నుండును. మహా భారతమున, వాల్మీకి రామాయణమున నీ కథ యిట్లు వర్ణింప బడెను.

తతో నారాయణో మాయాం మోహినీం సముపాశ్రితః
స్త్రీరూపమద్భుతం కృత్వా దానవానభిసంశ్రితః॥

తత స్తదమృతం తస్యై దదు స్తే మూఢ చేతసః
స్త్రియై దానవదైతేయాః సర్వే తద్గతమానసాః॥

(మహాభారతము)

ఉచ్చైఃశ్రవాః హయశ్రేష్ఠో మణిరత్నం చ కౌస్తుభమ్,
ఉదతిష్ఠన్ నరశ్రేష్ఠ తదైవామృతముత్తమమ్॥

అథ తస్య కతే రామ మహానాసీత్ కులక్షయః,
అదితేస్తు తతః పుత్రాదితిపుత్రా నయోధయన్॥

ఏకతామగమన్ సర్వే అసురారాక్షసైః సహ
యుద్ధమాసీన్మహాఘోరం వీరత్రైలోక్యమోహనమ్॥

యదా క్షయం గతం సర్వం తదా విష్ణుర్మహాబలః,
అమృతం సోఽహరత్తూర్ణం మాయామాస్థాయ మోహినీమ్॥

యే గతాఽభిముఖం విష్ణుమక్షరం పురుషోత్తమమ్,
సంపృష్టాస్తే తదా యుద్ధే విష్ణునా ప్రభవిష్ణునా॥

(ఇత్యాది- వాల్మీకి రా. బా. కాండ. సర్గ)

ఈ శ్లోకము లన్నిటి భావమేమన—

నారాయణుడు మోహినీరూపము ధరించి యద్భుతమగు నారీమణియై దానవుల సమీపించెను. అప్పుడా మూర్ఖులగు దాన

వులు ఆ స్త్రీ రూపమును జూచి మోహించి యామె కమృతము నిచ్చిరి. అని మహాభారతమున నాదిపర్వములో నుండెను.

హే రామ! ఆ సముద్రమునుండి యుచ్చైఃశ్రవమను పేరుగల ఈ హయశ్రేష్ఠమును మణిరత్నమగు కౌస్తుభము నుద్భవించెను. తరువాత అమృతముద్భవిల్లెను. దాని కొఱకు పెద్ద కులక్షయమయ్యెను. అదితిపుత్రులగు దేవతలు దైత్యులతో యుద్ధము చేయసాగిరి. అసురులు రాక్షసులు కలిసి దేవతలతో ఘోర సంగ్రామ మొనర్చిరి. ఈవిధముగా యుద్ధమొనర్చి యందఱు నశించగా విష్ణువు మోహినీరూపముతో అమృతమును హరించెను. ఇంతియగాక తన కభిముఖులైన దైత్యదానవాదుల సంహరించెను. అని రామాయణములో కనబడుచున్నది. ఇట్లే శ్రీమద్భాగవతమున నష్టమస్కంధము యొక్క షష్ఠాధ్యాయమునుండి యీ కథ ప్రారంభింపబడియుండెను. సంక్షేపముగా నట యిట్లు వర్ణింపబడెను.

అసురులు దేవతల నోడించి పరమవృద్ధిని పొందసాగిరి. అప్పుడు దేవతలందఱు బ్రహ్మను తీసికొని విష్ణువు దగ్గఱకు వెళ్లిరి. విష్ణువు వారితో "మీరు అసురులు కలిసి సముద్రము మథనము చేసి యమృతమును సంపాదింపుడు. ఆ యమృతమును మీరే పొందగలరు. అసురులు పరిశ్రమమునుజేసి నిష్ఫలులు కాగలరు. ఆ సమయమున విషము నుద్భవించును. కాని భయపడవద్దు. మంథరాచలమును మంథనదండముగను, వాసుకుని మంథన రజ్జువుగను కల్పించి శీఘ్రముగా సముద్రమును మథింపుడు. దీనివలననే మీకు శుభముకలుగును. అని చెప్పెను. తరువాత దేవదానవులు కలిసి సముద్రమును మథించిరి. ప్రథమమున

హాలాహలము పుట్టెను. దానిని శివుడు గ్రహించెను. హవిర్ధాని పుట్టిన ఋషులు గ్రహించిరి. శ్వేతవర్ణముగల ఉచ్చైశ్శ్రవమను నశ్వమును, నాలుగు దంతములుగల ఐరావతమను గజమును నింద్రుడు స్వీకరించెను. కౌస్తుభమణిని విష్ణువుతీసికొనెను. పారి జాత ముద్భవిల్లి స్వర్గము నలంకరించెను. తరువాత నప్సరలు పుట్టిరి. తదనంతరము లక్ష్మీదేవి పుట్టెను. ఆమెను విష్ణువు గ్రహించెను. వారుణి పుట్టగా దాని నసురులు తీసికొనిరి. అంత మున నమృత ముద్భవించెను. ఆ యమృతమును కలశమున దీసికొని వైద్యరాజగు ధన్వంతరి ప్రకటమయ్యెను. ఆ సమయ మున విష్ణువంతర్హితుడయ్యెను. దేవదానవులలో తుముల యుద్ధ మయ్యెను. అందు దేవతలను జయించి యమృతకలశమును దాన వులు తీసికొనిపోసాగిరి. విష్ణు వీ లీలనంతయు జూచి మోహినీ రూప మునుదాల్చి మార్గమధ్యమున నసురులకు కనబడెను. ఆ రూప మును జూచి మోహించి యమృతభాండము మోహిని చేతిలో నిడిరి. మోహినీరూపుడగు విష్ణువు అసురులను మోసగించి దేవతల కమృతపానము చేయించెను. ఈ కథ పురాణములలో నెల్లరు చదివిగాని వినిగాని యుండుట మిక్కిలి ప్రసిద్ధమే. కాని మహా భారతము రామాయణము భాగవతమున గల యీ కథాంశమున చాల భేదముగలదు—మహాభారతమున,

తతః శతసహస్రాంశుర్మథ్యమానాత్తు సాగరాత్
ప్రసన్నాత్మా సముత్పన్నః సోమః శీతాంశురుజ్జ్వలః॥
శ్రీరనంతరముత్పన్నా ఘృతాత్ పాండరవాసినీ
సురాదేవీ సముత్పన్నా తురగః పాండరః స్తథా॥

కౌస్తుభస్తు మణిర్దివ్యః ఉత్పన్నో ఘృతసంభవః
మరీచివికచః శ్రీమాన్ నారాయణ ఉరోగతః
పారిజాతస్తు తత్రైవ సురభిస్తు మహామునే॥
అజాయత తదా బ్రహ్మన్ సర్వకామఫలప్రదే
శ్రీః సురాచైవ సోమశ్చ తురగశ్చ మనోజవః
యతో దేవాస్తతో జగ్మురాదిత్యపథమాశ్రితాః
ధన్వన్తరిస్తతో దేవో వపుష్మానుదతిష్ఠత
శ్వేతం కమండలుం బిభ్రదమృతం యత్ర తిష్ఠతి
ఏతదత్యద్భుతం దృష్ట్వా దానవానాం సముత్థితః
అమృతార్థే మహాన్నాదో మమేదమితి జల్పతామ్
శ్వేతైర్దంతైశ్చతుర్భిస్తు మహాకాయస్తతః పరమ్
ఐరావతో మహానాగోఽభవద్వజ్రభృతాధృతః॥
అతినిర్మథనాదేవ కాలకూటస్తథా పరః
జగదావృత్య సహసా సధూమోఽగ్నిరివ జ్వలన్
త్రైలోక్యమోహితం యస్య గంధమాఘ్రాయ తద్విషమ్
ప్రాగ్రసద్ లోకరక్షార్థం బ్రహ్మణోవచనాచ్ఛివః
దధార భగవాన్ కంఠే మంత్రమూర్తిర్మహేశ్వరః॥

(మ. భా ఆ. ప, అ 18)

మథ్యమాన సముద్రమునుండి సహస్రకిరణుడును ప్రసన్నాత్ముడును ప్రకాశవంతుడు నగు చంద్రుడుదయించెను.

తరువాత నా జలమునుండి శ్వేతవస్త్రధరయగు లక్ష్మి పుట్టెను. సురాదేవి, తెల్లగుఱ్ఱము, కౌస్తుభమణియు నుద్భవించెను. అందు కౌస్తుభమణి విష్ణువును ప్రాపించెను. పారిజాతము, కామధేనువు, నా సముద్రమునుండి ప్రకటమయ్యెను. లక్ష్మి - సురాదేవి, సోముడు, ఉచ్చైః శ్రవము, మున్నగు నవన్నియు ఆదిత్యమార్గము దేవతల సమీపమునకు పోయెను-అప్పుడు శరీరధారియగు ధన్వంతరి చేతిలో నమృతముతో నిండిన తెల్లని కమండలువును తీసికొని యుత్పన్నుడయ్యెను. ఈ యద్భుతలీలను చూచి దానవులలో నిడిమాకను పెద్దశబ్దముపుట్టెను. తదనంతరము నాలుగు దంతములు గల ఐరావతము పుట్టెను. పశ్చాత్ కాలకూటముద్భవింప బ్రహ్మ యాజ్ఞవలన శివుడు దానిని గ్రహించెను. అటు తరువాత కథలో లక్ష్మి అమృతముల కొఱకు దేవదానవులలో ఘోరయుద్ధము జరిగెను అప్పుడు మోహినీరూపమును ధరించి విష్ణువు దానవులను మోసముచేసి దేవతల కమృతముతో పొట్టనింపి కృతార్థులను చేసెను.

రామాయణమున—

ఉత్పపాతాగ్నిసంకాశం హాలాహలమహావిషమ్
తేన దగ్ధం జగత్సర్వం సదేవాసురమానుషమ్॥
అథ వర్షసహస్రేణ ఆయుర్వేదమయః పుమాన్
ఉదతిష్ఠత్ సుధర్మాత్మా సదండః సకమండలుః
అథ ధన్వంతరిర్నామ అప్సరాశ్చ సువర్చసః
వరుణస్య తతః కన్యా వారుణీ రఘునందన !

ఉత్పపాత మహాభాగా మార్గమాణా పరిగ్రహమ్
దితేః పుత్రా న తాం రామ జగృహుర్వరుణాత్మజామ్
అదితేస్తు సుతా వీర ! జగృహుస్తామనిందితామ్
అసురాస్తేన దైతేయాః సురాస్తేనాదితేః సుతాః
హృష్టాః ప్రముతాదిశ్చాసన్ వారుణీగ్రహణాత్సురాః॥

(వా. రా. బాలకాండ)

సముద్ర మథనసమయమున ప్రథమమున విషము అగ్ని తుల్యమైనది పుట్టెను. దానివలన సమస్తజగము దగ్ధముకాదొడగెను. అప్పుడు దేవతలందఱు మహాదేవుని సమీపించిరి. హరియు నట ప్రకటమై యీ విషమగ్రపూజకు తుల్యముగా నుద్భవించినది. అందువలన దీనిని నీవు గ్రహించవలసినదని శివునితో చెప్పెను. శివు డట్లే చేసెను. తరువాత చాల వత్సరములకు ధన్వంతరి దండకమండలు సహితుడై యుద్భవిల్లెను. అప్సరలు పుట్టిరి. జలమునుండి పుట్టిరి గనుకనే అప్సరలనబడిరి. తరువాత వరుణకన్యా వారుణీ (మద్యము, సురా) ఉపస్థితయై తన్ను గ్రహించు వారిని ప్రతీక్షింపసాగెను. దితిపుత్రులు దానవు లాసురను గ్రహింపరైరి. కాని హే వీర ! అదితిపుత్రులు దేవతలు అనిందితమగు వారుణిని గ్రహించి తుష్టులైరి. అందువలననే దానవులసురులనియు దేవతలు సురులనియు చెప్పబడిరి. ఆటు తరువాత రామాయణములో "ఉచ్చైఃశ్రవాహయః శ్రేష్ఠోమణిరత్నం చ కౌస్తుభమ్" అని క్రమముగా అశ్వము మణి, అమృతము నుద్భవిల్లినట్లును అమృతార్థము దేవ దానవులలో తుములసంగ్రామము జరిగి నట్లును, విష్ణువు మోహినీరూపముదాల్చి దానవుల మోస

గించి దేవతలకు అమృతమిచ్చి పురందరుని సంతోషపెట్టి నట్లును వర్ణింపబడెను.

భాగవతమున కథాభాగము పూర్వమే చూపియుంటిమి. ఈ మూడు గ్రంథములగల కథాభాగము నిట నుదాహరించుటలో నభిప్రాయ మేమన అమృతోత్పత్తి సంబంధమయిన భావము తత్తద్గ్రంథకారుల కాలములో నెంత విస్తారమయ్యెనో స్పష్టపఱచుటయే. రామాయణములో లక్ష్మియొక్క ప్రసంగమేకానరాదు. వారుణిని దానవులు గ్రహింపక పోయిరనియు దేవతలే స్వీకరించిరనియు గలదు. ఇందుకు విరుద్ధముగా శ్రీమద్భాగవతమున "అథాసీత్ వారుణీ దేవకన్యా కమలలోచనా అసురా జగృహుస్తాం వై హరే రనుమతేనవై" అప్పుడు కమలలోచనయగు వారుణీదేవి ప్రకటయయ్యెను. భగవానుని యనుమతి వలన దానవు లామెను గ్రహించిరని స్పష్టముగా వర్ణింపబడియున్నది. ఇంతియగాక యితర పదార్థముల యుత్పత్తి క్రమములో నెంతయో భేద ముండుట స్పష్టమే. ఇట్టి విరోధములుండుట కథ యసత్యమని తోచెడిని. సత్యమగుచో నన్నిచోట్ల నొకే విధముగా వర్ణింపబడి యుండుటనివార్యము, కథను కల్పించిన నాటి భావ మీ గ్రంథ కారుల సమయమున విలుప్తమగుటచే వీరుతమకు దోచినట్లూహించి కథను వ్రాసియుంటిరి. రామాయణ భారతాదులను జూచిన నీ కథలన్నియు నా గ్రంథములలో సమయాంతరమున చేర్చినట్లు స్పష్టము గాకపోదు. ప్రసంగవశమున ముసలమ్మలు పిల్లల మనో వినోదము కొఱకో లేక వారిని నిద్రపుచ్చుటకో వంతకథలను వినిపించునట్లు-రామాయణ భారతములలో నీ కథలును వినిపింప బడినట్లు విబుధులకు తెలియని విషయముకాదు. ఎందువల్లనన గ్రంథమునగల మూలవస్తువుతో నీ కథల కెట్టి సంబంధమును

గానరాదు అందువలన నిట్టి కథలు కల్పితములు క్షేపకములనుట నిర్వివాదాంశము. నే డీ కథల నిట్లు సమాలోచించుచున్న మాకు-ఆఖ్యాయికల మూలరచయితల యవికలమగు రచన దొరకనందుకు దుఃఖము కలుగకుండ నేరదు. యథారూపమున నాఖ్యాయిక లభించియున్న దాని భావమును స్పష్టపఱచుట కథ్మ కావకాశ ముండెడిది. పౌరాణికు లీ కథాభావములను బొత్తుగా నెఱుగరు. ఇట్టి పరిస్థితిలో నిందు ఏ యే భాగములు సమానతను బొంది యున్నవో, వాని భావమేమో గమనింతురుగాక - ఈ కథలలో నెల్ల చోట్ల సముద్రమును మథించుట, అమృత ముత్పన్నమగుట, ఆయమృతమునుసురులు తీసికొనిపోవుట మోహినీరూపమునుదాల్చి విష్ణుభగవానుడు దానవులను మోసగించి దేవతల కృతకృత్యుల జేయుట మున్నగు కథాంశము లన్ని గ్రంథములలోను జూడబడు చున్నవి. అందువలన వీని భావమేమో మీ యెదుట నుంచ యత్నించుచున్నాము.

పాఠకులారా ! వస్తుతః నేడు మనమే సముద్రమును జూచు చున్నామో ఆ సముద్ర మథన మెన్నడును జరిగియుండలేదు. ముందెన్నడు జరుగబోవునది లేదు. మనుష్యులలో నెమూర్ఖుడును ఈ సముద్రజలమును మథించి అమృతమును పొంద యత్నింపడు. దేవత లిట్లు యత్నింతురన్న బుద్ధిమంతులు నమ్మగలరా ? యథార్థమున జనులు నమ్ముచున్న అమృతమను పదార్థమును లేదు. అమృతమును గ్రోలి యమరులైన దేవతలంద ఱెక్కడకుబోయిరి. దేవ దానవు లెల్లరు పృథివిమీదనే యుద్ధమొనరించినట్లు పురాణములలో వినుచున్నాము గదా ! నే డొక్కరైన గనబడరేమి ? కారణమేమై యుండును ? ఈ కథలోనున్న సత్యభావము తెలియక

యిట్లు భావించుచున్నారు. ఈ పురాణకాలమున దేశమున నంధ కారము వ్యాపించెను. ఆ యజ్ఞానాంధకారము నేటికి నశింపలేదు.

నిజమైన భావమేమన, ఇంతకుపూర్వ మనేకస్థలముల నాకాశమునకు సముద్ర మనుపేరున్నట్లు వ్రాసియుంటిమి. ఇందుకు పూర్వప్రమాణములనే స్మరింపుడు. ప్రస్తుత మిట అసురశబ్దముతో మేఘము వ్యవహరింపబడుచున్నది. నిఘంటువు జూడుడు.

అద్రిః, గ్రావా, గోత్రః, బలః, అశ్మః, పురభోజాః, బలిశానః, అశ్మా, పర్వతః, గిరిః, వ్రజః, చరుః, వరాహః, శంబరః, రోహిణః, రైవతః, ఫలిగః, ఉపరః, తపలః, చమసః, అహిః, అభ్రమ్, వలాహకః, మేఘః, దృతిః, ఓదనః, వృషన్ధిః, వృత్రః, అసురః, శేషః, ఇతి త్రింశన్మేఘ నామాని॥ (నిరు.)

ఇందు అసుర పదము మేఘనామముగా స్పష్టపడుచున్నది. దేవపదము సూర్యకిరణ పరముగా పూర్వమే మీరు వినియున్నారు. ఇట్లు అసుర దేవపదవాచ్యములగు మేఘ సూర్యకిరణములను దేహధారులుగా మనమున నెంచుడు. అప్పుడు మేఘములసుర గణములు, సూర్యకిరణములు దేవగణములు నగును. వీరిరువు రును గలిసి సముద్రము ననగా నాకాశమును మథించుచున్నారు. లోకమున, కేవల దుగ్ధమునుగాని, దుగ్ధపరిణామ భూతమగు పెరుగునుగాని మథించి ఘృతమును దీయునట్లు - సూర్యకిరణ ములు భూమండలమునగల జలమును బాష్పరూపమున నాకాశ

మున జేర్చినపు డవి మేఘరూపములను ధరించి వాయువశ మున నిటునటు పరుగులిడుట చూచుచున్నాము. ఈ ప్రాకృత దృశ్యమే మేఘములను నసురులు కిరణములను దేవతలు పర స్పరము ఆకాశమను సముద్రమును మథించుచున్నారు. ఈ మథనమున నమృతము పుట్టును. పాఠకులారా! అమృతమనగా జలము ఇందుకు ప్రమాణము పూర్వ ముదాహరించిన మంత్రము లను స్మరింపుడు. అమరకోశమునందును జలమున కమృత నామము జూడగలము.

"పయః కీలాలమమృతం జీవనం భువనం వనమ్" అమరజలము నమృతమనుటలో నుద్దేశమేమన సూర్యకిరణముల వలన తపింప బడిన జలమావిరియై యాకాశమునకు పోయి యటనుండి శీతల తనుబొంది మరల వర్షరూపముననో, మంచురూపముననో జల మయి యథారూపమున నెల్లకాలముండుటయే. అమృతమనగా నశించనిదనియేగదా అర్థము. సూర్యకిరణ మేఘముల యొక్క సంఘర్షణమే దేవాసుర యుద్ధము. అందు వర్షరూపముగా పరిణ మించు జలమే అమృతము. వర్షసమయమున విచిత్రదృశ్యము కాననగును. ఆకాశమున మేఘములు నానాదిశలకు పరుగెత్తు చుండుట చూచుచున్నాము. ఈ పరిస్థితియే అసురులు అమృత మునుగొని పారిపోవుటగా నూహించిరి. అపుడు సూర్యకిరణము లను దేవతలు తమ పరిశ్రమవ్యర్థమగుట జూచి విష్ణువు అనగా సూర్యు నాశ్రయించిరి. అపుడు విష్ణుడు (సూర్యుడు) మోహినీ రూపము అనగా విద్యుత్‌రూపమునుదాల్చి అసురులను మేఘము లందు ప్రవేశించుచున్నాడు. ఇట్లు ప్రవేశించి మేఘములను ఛిన్నభిన్నముచేసి వర్షింపజేయుట అసురులనుండి అమృతమును

హరించుట. వర్షించుటయే దేవతలకు అమృతము - జలము లభించుట. ఇట దేవతలన సమస్త పదార్థములు నని భావించుట. వైదికభాషలో పదార్థములన్నియు దేవశబ్దమున వ్యవహరించుట స్మరింపదగిన విషయము. ఇట్లు పృథివ్యాది సమస్త పదార్థములను దేవతలు అమృతము (జలము) ను పొంది తృప్తులగుచున్నారు. ఇట్టి ఘటనలు ప్రకృతియందనేకమారు లెల్లకాలముల జరుగుట సర్వజనులకు విదితమే గదా! అందువలన పాఠకులారా! అమృతమథన మిట్లు ప్రతి ఋతువునందు జరుగుచున్నది. ఈ భావమును గ్రహించక గాథలను సత్యముగా భావించుట వివేకులకుచితముగాదని దోచుచున్నది.

ఇట్లే హాలాహలాది పదార్థముల నూహించుటకు వర్షారంభకాలమున లోకమున నెల్లచోట్ల నతివేడియు నందువలన రోగాదులు వ్యాపించి ప్రాణులు పరితపించుటయు మీకు తెలియనిదికాదు. ఈ పరిస్థితియే విషము పుట్టుటయు లోకములను దహింపజేయుటయు నని యెంచుడు. ఇట్టి విషమును విద్యుద్రూపి శివుడు హరించుచున్నాడు. అనగా విద్యుదావిర్భావానంతరము పూర్తిగా వర్షములు కురిసి లోకమున శాంతిగలుగుచున్నది. దీనినే శివుడు విషమును గ్రహించి శమింపజేయుట. విద్యుత్ శివు డెట్లయ్యెనో ముందు రుద్రస్వరూప నిరూపణ సమయమున వివరింతుము.

ఉచ్చైఃశ్రవమనగా వాయువు. వాయువు నశ్వముగా భావించిరి. మేఘముల నిటునటు తీసికొని పోవునది గనుక వాయువు నశ్వమని కల్పించిరి. అటు తరువాత ఐరావతము పుట్టుచున్నది. ఈ యైరావతము మేఘమేగాని వేఱుగాదు. ఇరా = అనగా అన్నమని వర్షమని యర్థము. "ఇరాం తృణాతీతివా, ఇరాం దదాతీతి

వా, ఇరాం దధాతీతివా, ఇరాం దారయతే ఇతివా, ఇరాం ధారయతే ఇతివా" ఇత్యాది నిరుక్తమున జూడుడు ఇరా=అన్నము, వర్షము, దేనికి గలదో దానిని ఇరావత్ అని చెప్పుదుము. ఇరావత్‌కు ప్రభువు ఐరావతమని చెప్పబడును. ఇట్లు అన్నవర్షాదులను కలిగించు మేఘమే ఐరావతమని యర్థము.

కౌస్తుభమణి యనగా మేఘమునుండి వర్షింపబడు శిలారూపమగు జలమే. తెలుగున వడగండ్లని చెప్పుదుము. కౌ అనగా పృథివియందు (ఉన్న పదార్థములను) స్తోభతి = హింసించునది (కౌ పృథివ్యాం పదార్థాన్ యః స్తోభతి స్తభ్నాతి హింసతీతి కౌస్తుభః మేఘవృష్ట ప్రస్తరః) కనుక వడగండ్లను కౌస్తుభమని చెప్పుదురు. ఇది సూర్యుని వలననే గలిగినది గనుక సూర్యస్థానుడగు విష్ణువునకు చెందినట్లు వర్ణించియుండిరి.

లక్ష్మి యన శోభ-సౌందర్యమని పూర్వమే వర్ణించియుంటిమి. ప్రస్తుత మిట మేఘవర్ణ విశేషమే లక్ష్మి. అదియు సూర్యునివలననే గలుగుచున్నదిగాన విష్ణువున కధీనమగుట కల్పనలోననౌచిత్యము కలిగింపదు. వారుణీదేవియనగా వర్షము. వర్ష మందఱిచేత వరింపదగినది యనగా కోరదగినది గనుక వారుణియని చెప్పబడినది.

విచారశీలురగునో పాఠకులారా! ఈ సముద్ర మథన మిట్లు కేవలము ప్రతిదినము జరుగునట్టి ప్రాకృతికదృశ్యముకంటె వేఱుగాదని మీ కిపుడు స్పష్టమైయుండునని యెంచెద-ఈ యాఖ్యాయికను సత్యమనియెంచి జలమయ సాగరమును దేవదానవులు మథించిరనియు నందు అమృతము పుట్టెననియు దానిని రాక్షసులు

గొని పోవుచుండ విష్ణువు మోహినీరూపమున వారల మోసగించి దేవతలను తృప్తిపఱచెనని నమ్మువారు తమ పరమపూజ్యుఁడగు భగవానుని పైన తుడుపరాని యమార్జనీయ కలంకము నాపాదించిన వారగుదురు. ఇంతియగాక స్త్రీ జాతిని దూషించుచు సుందర రూపముపై వజ్రపాత మొనరించిన వారగుదురు. లోకమున మనుష్యులు తమ తమ యాధిపత్యమున సంగ్రామముల నొనరింతురు. పూర్వ మనేకయుద్ధములు జరిగినవి. నేడు నట్లు జరుగుచున్నవి. ఈ యుద్ధములలో బలముతో శత్రువుల జయింప మనుజులు యత్నింతురు ఇంతియగాక మనుష్యులు తమ తమ స్వభావము ననుసరించి యుత్తమ నికృష్టకార్యముల నాచరింతురు. ఆ యా కర్మల ననుసరించి ఫలములను సైతము పొందుదురు. ఈశ్వరుడు మనుజుల కార్యములలో నెట్టి విఘ్నమును కలిగింపరాడు. ఈశ్వరు డొక సాధారణ మనుష్యునివలె రాగద్వేషములతోగూడి పక్షపాతియై వర్తింపడు. అతనికి శత్రుమిత్రులు లేరు "న మే ద్వేష్యోऽస్తి న ప్రియః" ఈశ్వరుడు నిత్యశుద్ధబుద్ధ ముక్తస్వభావుడు దేవదానవ మనుష్య పశుపక్ష్యాది సమస్త జీవుల కధిదేవుడు. అందఱికి సమానుడు.

అందువలన నసురుల మోసగించి దేవతల కుపకార మెట్లు చేయుగలడు. దుష్టసంహారము శిష్టానుగ్రహము నీశ్వరుని స్వభావ మందురేని సత్యమే. కాని యీశ్వరునకు నిగ్రహానుగ్రహములు ఛలవృత్తితో జేయవలసిన యవసరమేమి? ప్రాణులు తమ కర్మానుసారము ఫలములను బొందుచు తద్ద్వారా కష్టసుఖములను ప్రాపించుటయే పరమేశ్వరుని నిగ్రహానుగ్రహములు. ఇట్టి సుందరమైన యమోఘ నియమముండ యీశ్వరునకు శరీర ధారియై కృత్రిమ నింద్యమార్గముల నిగ్రహానుగ్రహముల జేయ

వలసిన యవసరమేల గలుగును. ఈశ్వరు డన్నివిధముల సమ
ర్థుడు గదా! అసురులను దండింపదలచిన వారిని ప్రత్యక్షముగా
నపరాధమును జూపి దండింప నేరడా! కపటవృత్తితో నింద్య
పద్ధతిని మోసగించుటేల? దుర్బలుడైన వాడేగదా తన శత్రువును
కపటముతో జయింపనెంచును? అందువలన పాఠక మహాశయు
లారా! అజ్ఞానులైన మనుజు లిట్లీశ్వరుని కపటుని నింద్యచరిత్రు
నిగా కల్పింతురు. దేశమున నజ్ఞానము వ్యాపించి పతితావస్థలో
నున్నపుడు మనుజు లిట్లు తమ కనురూపుడుగానే తమ యిష్ట
దేవుని కల్పింతురు. తాము చోరులైన తమ దేవుని చోరునిగను,
జారియైన జారునిగను, భావింతురు. అనగా నట్టి కథల నీశ్వర
సంబంధముగా గల్పించి తద్ద్వారా తమ దోషములను కప్పిపెట్ట
నెంతురు. ఎట తమ తమ యిష్టదేవు నిట్లు కపటి, వ్యభిచారి,
పక్షపాతినిగా భావింతురో యా దేశమున సజ్జనులు నివసించుట
లేదని యెంచుడు. అజ్ఞానులు, జాంగలికులుగా నివసించుచుండుట
యనెట్టి సందేహములేదు. ఇంతిలోగాక ఆ దేశపురాజుగూడ నున్మ
త్తుడై యుండును. అక్కడ విద్యలకు స్థానముండదనుట నిస్సం
శయము. మనుష్యులు సువిచారులు స్వతంత్ర విచారులుగాని
కాను. కాని భారతదేశము వేదవిదులగు బ్రహ్మర్షులకు నివాసస్థానమే
గాక ఆయుర్వేదాది విజ్ఞానముల కాకరమైయుండి నే డిట్టి
దుష్కరమగు నజ్ఞానమున కాస్పదమగుట విచారకుల హృదయ
మునకు దుఃఖము కలిగింప కెట్లుండును? విద్వాంసులారా!
సముద్ర మథనాది కథల యభిప్రాయమును సరిగా తెలిసికొన
నందున నెంతటి యనర్థము కలుగుచున్నదో ఊహింపుడు.

విష్ణువు - వామనుడు

వామనావతారమునకు సంబంధించిన పురాణములలో ముఖ్యముగా భాగవతమున నతి ప్రసిద్ధము - ఇదియు భగవానుని కపట పాటవమును ప్రకాశించు గాథలలో నొకటి. ఇట్టి కథా భాగములను గూర్చి విచారించునపుడు విచారకుల హృదయము భారతవర్షమున వ్యాపించిన యజ్ఞానాంధకారమునకై పరితపింపక పోదు. న్యాయాధి దేవుడగు పరమేశ్వరు నుపాసించు భారతము నేడు తమ యారాధ్యదేవుని పరమ కపటునిచేసి, స్తుత్యాదుల నతని ననుగ్రహింపజేయుచు సంతసించుచున్నది.

"యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే"

అను గీతాసూక్తిని ప్రతిదినము పఠించు భారతదేశము తమ యారాధ్యదేవుని కపటునిగాజేసి నందువలన కలుగు నష్టమును గుర్తింపకుండుట మిగుల సంతాపమును గలిగించుచున్నది. భలా! ప్రపంచమున తన యాచరణమున భక్తులకు కపటము నేర్పు పూజకుడు, నిష్కపటి యెట్లుగాగలడు? పౌరాణికులను ప్రశ్నించిన, జనులకు శత్రువులను జయించుటకై యిట్టి యుపాయములనే సాధనములుగా నుపయోగింపుడని నేర్పుటకే భగవాను డిట్లాచరించెనని చెప్పుచు సిగ్గుపడకుండుటయేగాక తమ పాండిత్య ప్రకర్షతను గుఱించి గర్వించుచున్నందుల కెంతయు దుఃఖము కలుగుచున్నది. ఇంతియగాక వైదికవర్ణనల నిట్లు గాథలగా నల్లి తద్ద్వారా లోకమున నజ్ఞానము వ్యాపింపజేసిన వారిని గూర్చి శోకింప కెట్లుండగలమో తెలియకున్నది. ఈ మిథ్యాకథలవలన

వేదములును కలంకితములయినవి. పౌరాణిక యుగమున విద్వాంసు లీ వేదభాగములు కఠినముగానెంచి వానిని జనసామాన్యమునకు బోధించుటకై యిట్టి విపరీతఫలముల నిచ్చు గాథల రూపమున బోధింపసాగిరి. అందువలననే నేటికిని పండితులు పురాణము లన్నియు వేదమూలకములన్నియు వీనివలననే లోకము విశిష్య శూద్రులు తరింతురనియు చెప్పుచున్నారు. కాని, పాప మీ యవి వేకులయిన పండితులకు మూలమునకు ప్రస్తుతగాథలకునున్న భేదమెంతో, దానివలన కలుగు ఫలమేమో తెలియదు అందు వలననే కథావాచకులు వాచనకాలమున ప్రతిష్ఠలను సంపాదించు టకై యొకరినిమించి యొకరు కల్పితకథలలో నసంభవ విషయ ములను జేర్చుచుందురు. ఉదాహరణము కొఱకు అగస్త్యుడు సముద్రమును శోషించిన కథను తీసికొనుడు. ఇందువాస్తవమున నగస్త్యుడనగా సూర్యుడు. సముద్ర మనగా నాకాశము వర్షాకాల మునకు తరువాత అగస్త్యు డుదయించుచున్నాడు. శరదృతువు నందు సూర్యు డగస్త్యుడని చెప్పబడును. సూర్యు డొక్కొక్క మాసమున నొక్కొక్క పేరుతో చెప్పబడును. అందువలననే ద్వాద శాదిత్యులనియు ప్రసిద్ధికలదు.

అగంపర్వతం మేఘం స్త్యాయతి సంఘాతయతి సమ్యక్నాశయతి యః సోఽగస్త్యః.

ఎవడు మేఘమును నష్టభ్రష్టముచేయునో వా డగస్త్యుడు అని చెప్పబడును. అనగా శరదృతువునందు సూర్యుడు ఆకాశ మునగల మేఘములను నష్టముచేసి అగస్త్యుడని చెప్పబడు చున్నాడు-అందువలన ఎక్కడనైన అగస్త్యుడు సముద్రమును

శోషించుచున్నాడని వచ్చిన కథావాచకులు అగస్త్య సముద్రశబ్ది ములకుగల సత్యార్థములను తెలిసికొనక అగస్త్యుడను నొక ఋషి కారణవశమున సముద్రమును త్రాగెనని చెప్పసాగిరి. కాలక్రమ మున అగస్త్యుడు సముద్రము నేల త్రాగెను? ఎట్లు త్రాగెను? మరల సముద్ర మెక్కడనుండి వచ్చినది? అని యనేకులు శంకింపబూని నపుడు నా యా శంకానుగుణముగా గాథలనల్ల సాగిరి. విశేషముగా సమాధానము దొరకనిచోట్ల ఋషులు మహాను భావులు. వారి విషయములో నిట్లు శంకింపరాదని బోధింపసాగిరి. జనులు మూఢులయి యుండుటవలన తమ ఋషుల ప్రభావము లను గూర్చి కొనియాడుచు కాలయాపనచేయసాగిరి. ఇట్టి కాల ములో ప్రాచీనార్థమును తెలిసికొనువారు కొందఱుండినను వారు యథార్థ అర్థములను సర్వసాధారణులకు బోధించుట దుర్ఘట ముగా నెంచి యుపేక్షించుచుండెడివారు. ఇట్లే వామనసంబంధ మైన కథయు రచింపబడెను.

ఈ వామనావతారమునకు సంబంధించిన కథకును ముఖ్య కారణము సూర్యుడే. సూర్యుడే త్రివిక్రముడు. వామన కథలో త్రివిక్రమపదము గూడ ననేకమారులు వచ్చి యుండుటందఱికి తెలిసిన విషయమే. త్రివిక్రముడు, అనగా త్రిమూడులోకము లలోనో మూడుస్థానములలోనో (వి) విశేషముగా (క్రమ) పాద విక్షేపములు గలవాడు – మూడులోకములను వ్యాపించినవాడని అర్థము. ప్రస్తుతమున సూర్యుని కిరణములు ద్యులోకముననూ, అంతరిక్షముననూ భూమియందును వ్యాపించుటచే త్రివిక్రము డనబడుచున్నాడు. లేక ప్రాతః మధ్యాహ్న సాయంకాలములందు తన కిరణప్రసారము లను పాదవిక్షేపములతో భాసించువాడని

యర్థము. ప్రాతఃకాలమున చాలసరలరూపమున ననగా తీక్ష్ణతలేక ప్రకాశించును. అపుడు (బలి) అనగా అంధకారము చాలప్రబల ముగా నుండును. ఇట్లు సూర్యుడను విష్ణువు ఉదయకాలమున తీక్ష్ణరూపమును దాల్చినపుడు అంధకారమును బలిప్రతాపశాలియై లోకముల నావరించియుండును. క్రమముగా సూర్యు డంబరమున వ్యాపించుకొలది అంధకారము నశించిపోవును. ఈ దశనే విష్ణువు బలిని పాతాళమున కణుగదొక్కినట్లు వర్ణించిరి. అప్పుడు దేవ గణములు అనగా జీవులు ప్రసన్నులైరి. ఇదియే యీ కథయొక్క ముఖ్యభావము.

ఏవం పుత్రేషు నష్టేషు దేవమాతాఽదితి స్తదా
హృతే త్రివిష్టపే దైత్యైః పర్యతప్యదనాథవత్॥
ఏకదా కశ్యప స్తస్యా ఆశ్రమం భగవానగాత్
నిరుత్సవం నిరానన్దం సమాధేర్విరతశ్చిరాత్॥
సపత్నీం దీనవదనాం కృతాసనపరిగ్రహః
సభాజితో యథాన్యాయ మిదమాహ కురూద్వహ॥

(భాగవతమ్)

ఇట్లు శ్రీమద్భాగవతమున నష్టమస్కంధమునందు వామనావ తారసంబంధమైన కథచూడగలము. సంక్షేపమున నిట్లు వర్ణింప బడెను. దేవాసుర సంగ్రామము జరుగగా నందు అసురులు విజయులైరి. దేవతల యధికారములన్నియు నసురుల యధీన మయ్యెను. ఇట్లు దేవమాతయగు నదితి యొక్క పుత్రులెల్లరు స్వాధికారములను కోలుపోయి స్వర్గమును నసురుల పాలుచేసి

దుఃఖితులయిరి. శోకసంతప్తులగు సంతానము జూచి యదితియు నతి దుఃఖితయయ్యెను. ఇట్లుండ నొకప్పుడు కశ్యపమహర్షి యదితి ఆశ్రమమునకు వచ్చి యదితి యతిక్లేశార్తయై యుండుటయు నాశ్రమమంతయు నిరుత్సాహముతో దుఃఖావిష్టసూచకముగా నుండుట జూచెను. కారణమడుగగా నదితి వృత్తమెల్ల వినిపించెను. కశ్యపుడంతయు విని హే ప్రియే! ఈశ్వరుని సంకల్పము చాలప్రబలమైనది. ప్రపంచమంతయు చాలస్నేహబద్ధమైయున్నది. వస్తుతః ఆత్మ యెక్కడ-ఈ మాయకుగల సంబంధమేమి? ఈ దేవతలు నసురులు నందఱు నీ పుత్రులేకదా? అసురులు జయించిన నీ పుత్రులకే జయము గలిగినది కదా? ఇందు చింతకు పనియేమి? కానిమ్ము నీవు భగవానుని సేవించుము. భద్రమయ్యెడిని. వాని సేవ యమోఘమైనదని చెప్పి వెళ్లిపోయెను. అదితియు నతని యాదేశము ననుసరించి వ్రతపరాయణ యయ్యెను. తదనంతరము కొంతకాలమునకు అదితి గర్భము నుండి వామను డుదయించెను. దేవతలందఱు కలిసి యితని కుపనయనాది సంస్కారములను చేసిరి. అసురాధిపుడగు బలిచక్రవర్తి యజ్ఞమొనరించుట విని యటకు వామనుడు పోయెను. బలియు నతనికి శాస్త్రోచిత సత్కారముల నాచరించెను. ఆ సత్కారమును గురించి భాగవతమున నిట్లు వర్ణింపజడియున్నది.

స్వాగతం తే నమస్తుభ్యం బ్రహ్మన్ కింకరవామ తే
అద్య నః పితర స్తృప్తాః అద్య నః పావితం కులమ్
అద్య స్విష్టః క్రతురయం యద్భవానాగతో గృహాన్
అద్యాగ్నయో మే సుహుతాః యథావిధి ద్విజాత్మజ

త్వచ్చరణావనే జనైః హతాంహసో వార్భిరియం చ
భూరహో
తథా పునీతా తనుభిః పదై స్తవ॥

హే బ్రహ్మన్! మీకు స్వాగతము. నమస్కారము చేయుచున్నాను. మీ కొఱకేమి సత్కారము చేయుదును. నేడు మా పితరులు తృప్తులయిరి. కులము పవిత్రమయ్యెను. యజ్ఞమును చక్కగా నిర్వర్తింపబడినది. మీరు గృహమునకు వచ్చుటచే మా యగ్నులు చక్కగా వేల్వబడినది. హే ద్విజ మీ పాదప్రక్షాలిత జలముచే నీ భూమియు పవిత్రమైనది. హే వటో! మీ కోరికేమి? భూమి-కాంచనము-గోవులు-విప్రకన్య-గ్రామము-గజములు - రథములు-తురగములు-వీనిలో మీ కభీష్టమేమి? కోరుదురు గాక. అని బలి ప్రార్థించెను. ఈ వచనములను విని ప్రథమమున వామనుడు బలిని యథేచ్ఛగుణములతో ప్రశంసించెను=అతని వంశము యొక్క కీర్తిని గూర్చి గొప్పగా వర్ణించెను. అంతమున నిట్లు చెప్పెను—

తస్మా త్త్వత్తో మహీమీషద్వృణేఽహం వరదర్షభాత్
పదాని త్రీణి దైత్యేంద్ర సంమితాని పదా మమ
నాన్య త్తే కామయే రాజన్ వదాన్యాజ్జగదీశ్వరాత్
నైనః ప్రాప్నోతి విద్వాంసమ్ యావదర్థప్రతిగ్రహః
అధికం యోభికాంక్షేత సస్తేనో దండమర్హతి॥ (భా.)

హే దైత్యేంద్ర! ఈ కారణమున నిన్ను కొంచెము భూమి నిమ్మని యాచించుచున్నాడ. నాకు నా పాదప్రమాణముతో మూడు

పదముల భూమి కావలయును. ఇంతకంటె అధికము కోరను. ప్రయోజనము ననుసరించి అవశ్యక ప్రతిగ్రహములు బ్రాహ్మణు నకు పాపముగలుగనేరదు. అధికము గోరువాడు చోరుడు దండ నార్హుడు. ఇట్లు వామనుడు పలుకగా బలిచక్రవర్తి హే బ్రహ్మ చారిన్! నీ వచనములు వృద్ధులంబోలియున్నవి. నావంటి వదా న్యుని మూడుపదముల ప్రమాణముగల భూమిని యాచించు టనుచితముగా తోచుచున్నది. కానిందు మీ కోరికప్రకారముగా భూమిని తీసికొనుడని సంకల్పపూర్వకముగా భూమి నిచ్చెను. అప్పుడు వామనుడు బృహద్రూపుడై యొక పాదముతో పృథివిని రెండవపాదముతో ద్యులోకమును కొలిచి మూడవపాద ప్రమాణ స్థలమును గానక బలితో నిట్లనెను. హే మహారాజ! మూడవపద ప్రమాణముగల స్థలమును జూపుము. లేకున్న నీవు పాతాలము నకు బొమ్ము-ప్రతిజ్ఞాభంగమునకు ఫలమిదియే యనెను! ఇట్లు బలిచక్రవర్తిని పాతాలమునకు బంపెను. ఇట్లే వాల్మీకిరామాయణ మున నీ కథ వర్ణింపబడియున్నది. కథాంశములో విశేషభేదమును గానరాదు. కించిన్మాత్ర భేదమేమన-కశ్యపుడు తాను స్వయముగా నదితితో గూడి తపస్సునుజేసి యీశ్వరుని ప్రార్థించెను.

"పుత్రత్వం గచ్ఛ భగవన్! అదిత్యా మనుజానఘ!"

హే భగవన్! నాకును ఆదితికిని పుత్రత్వమును బొందుము. భాగవతమున కేవల మదితియే వ్రతమాచరించెను — ఇట్టి కథ అన్యాన్యపురాణములందు నతిప్రసిద్ధము.

పాఠకులారా! ఈ కథా విషయముగా విచారింతురుగాక. దీనికి మూలకారణమేమి? వేదవిదులకు దీనికిగల మూలకార ణము శబ్దార్థముల యొక్క భ్రమయని తెలియకపోదు. పూర్వ

ముదాహరించిన యగస్త్యసముద్ర శోషణమువలె కథకులు త్రివిక్ర మాది శబ్దార్థములను తెలిసికొనజాలక కథనల్లిరి. పామరజనులలో వ్యాపింపజేసిరి. ఈ కథ యొక్క వాస్తవభావమేమో పూర్వము కొంచెముగా సూచించియుంటిమి. ఇకముందు విస్తారముగా వ్రాయు చున్నాము.

ఈ కథ యొక్క వాస్తవభావమేమో సరిగా తెలిసికొన వలయునన్న విష్ణుశబ్దార్థమును గూర్చి మొదట విచారించవలెను.

అథ యద్విష్టతో భవతితద్విష్ణుర్భవతి. విష్ణుర్విశతేః వా వ్యశ్నోతేర్వా-నిరుక్తదై వతకాండ-అథాస్యోపరిభాష్యమ్ అథ యద్ యదావిషితః వ్యాప్తోఽయమేవ సూర్యో రశ్మిభి ర్భవతి. తత్తదా విష్ణుర్భవతి. విశతేర్వా యదావిష్ఠప్రవిష్టః సర్వతో రశ్మిభిర్భవతి తదా విష్ణుర్భవతి – వ్యశ్నోతేర్వా విపూర్వస్యవాఽశ్నోతేః. యదా రశ్మిభిరతిశయేన అయం వ్యాప్తో భవతి వ్యాప్నోతి వా రశ్మిభిరయం సర్వం తదా విష్ణురాదిత్యో భవతి.

వైదికభాషయందు విష్ణుశబ్దమనేకార్థములనున్నను, ప్రస్తు త మేవిష్ణువును తీసికొని వామనావతార కథ కల్పింపబడెనో ఆ విష్ణు శబ్దమున కర్థము సూర్యుడే యనుట నిశ్చయము - ఇందుకు ప్రమాణము పై నుదాహరించిన యాస్కులేఖయే-దాని కర్థమేమన- సూర్యు డెప్పుడు తన కిరణములద్వారా వ్యాప్తుడై పూర్ణుడగునో అప్పుడు విష్ణువనబడుచున్నాడు – విశ ప్రవేశనే అను సంస్కృత ధాతువువల్ల నీ శబ్దము సిద్ధించును. లేక విపూర్వక అశ ధాతువు

వలన నీ శబ్దమేర్పడగలదు. కాని అర్థము సమానమే. కిరణము లతో వ్యాప్తుడగు సూర్యుడు విష్ణువనబడును. సూర్యు డెప్పుడు కిరణయుక్తుడై వ్యాపించియున్నను భూమిపై ప్రాతఃకాలమున కిరణరహితుడై యున్నట్లుండి క్రమముగా ఊర్ధ్వగామియగు కొలది సమస్త కిరణములతో భూమి అంతరిక్ష ద్యులోకములను వ్యాపించి విష్ణువనబడుచున్నాడని యాస్కాచార్యుని తాత్పర్యము. అందువలన విష్ణుశబ్దమునకు సూర్యుడని యర్థము స్పష్టమగు చున్నది. ఇందుల కుదాహరణముగా యాస్కాచార్యుడే వైదిక మంత్రము నిట్లుదాహరించెను.

ఇదం విష్ణుర్విచక్రమే త్రేధా నిదధే పదమ్. సమూఢ
మస్య పాంసురే యది కించ తద్విక్రమతే విష్ణుః
త్రేధా నిధత్తే పదమ్ త్రేధా బావాయపృథివ్యామంతరిక్ష
దివీతి శాకపాణిః, సమారోహణే విష్ణుపదే గయ
శిరసీతి ఔర్ణువాభః, సమూఢమస్య పాంసురే ప్యాయ
నేఽన్తరిక్షే పదం న దృశ్యతేఽపి వోపమార్థే స్యాత్
సమూఢమస్య పాంసులఇవ పదం న దృశ్యతే-నిరుక్తమ్॥

దీనిని దుర్గాచార్యు లిట్లు వ్యాఖ్యానముచేసి యుండిరి.

యదిదం కించిత్ విభాగేన వ్యవస్థితం తద్విక్రమతే విష్ణురాదిత్యః కథమితి? యత ఆహ - "త్రేధా నిధత్తే పదమ్" నిదధే పదం నిధానం పదైః, క్వ! తత్ర తావత్. పృథివ్యామంతరిక్షే దివీతి శాకపాణిః పార్థివోఽగ్నిర్భూత్వా

పృథివ్యాం యత్కించిదస్తి తద్విక్రమతే తదధితిష్ఠతి. అంతరిక్షే విద్యుదాత్మనా, దివిసూర్యాత్మనా యదుక్తమ్ తమ్ము అకృర్వాన్ త్రేధా భువేకమ్ ఇతి. సమారోహణే - ఉదయగిరా వుద్యన్ పదమేకం నిధత్తే-విష్ణుపదే మధ్యం దినఽన్తరిక్షే గయశిరసి అస్తంగిరా ఇత్యౌర్ణవాభఆచార్యః. మన్యతే ఏవమ్ - సమూఢమస్య పాంసురే అస్మిన్ ప్యాయసే ఏతస్మిన్ అన్తరిక్షే సర్వభూతవృద్ధిహేతౌ యన్మధ్యదినపదం విద్యుదాఖ్యం పదం తత్సమూఢమ్ అన్తర్హితం న నిత్యం దృశ్యతే. తదుక్తమ్ - స్వప్నమేతన్మధ్యమం జ్యోతిరనిత్య దర్శనమ్. ఇతి అపి వోపమార్థే స్యాత్ సమూఢమివ పాంసువే పదం న దృశ్యతే ఇతి. యథా పాంసువే ప్రదేశే పదం న్యస్తం ఉత్క్షేపణసమనంతరమేవ పాంశుభిరాకీర్ణ త్వాత్ న దృశ్యతే ఏవమస్య మధ్యమం విద్యుదాత్మకం పద మావిష్కృతిసమకాలమేవ వ్యవధీయతే నావతిష్ఠతే ఇత్యర్థః- ఇతి.

విష్ణుః = సూర్యుడు, ఇదమ్=విభక్తమైయున్న యీ దృశ్య ప్రపంచమునందు, విక్రమతే = తన కిరణములతో వ్యాపించు చున్నాడు. అనగా పృథివ్యంతరిక్షద్యులోకములలో సూర్యుడు తన కిరణములద్వారా వ్యాపించుచున్నాడు. వ్యాపించుటెట్లన - త్రేధా నిదధే పదమ్=మూడు స్థానములలో తన కిరణములను పాదముల నుంచుచున్నాడు. ఆ మూడు స్థానము లెవ్వియను

విషయములో నిట భిన్నభిన్న ఆచార్యుల యభిప్రాయము వెలిబుచ్చుచున్నాడు. పృథివ్యామంతరిక్షాదివి = శాకపూణి అను నాచార్యుడు పృథివ్యన్తరిక్ష ద్యులోకములలో సూర్యుడు (విష్ణువు) తన కిరణములను స్థాపించుచున్నాడని చెప్పెను. ఔర్ణవాభుని మతిలో, విష్ణువు=సూర్యుడు, సమారోహణే = ఉదయగిరియందుద యించుచు నొక పాదమును స్థాపించుచున్నాడు. ఇట్లే, విష్ణుపదే= దినమధ్యమున నంతరిక్షమున నొక పదమును, గయశిరసి = అస్తా చలమున నొక పాదము నుంచుచున్నాడనియు తాత్పర్యము. యాస్కాచార్యు లిట్లు భిన్నభిన్న యాచార్యుల మతములను ప్రక టించి తరువాత మూడవపాదమున కిట్లర్థము వ్రాసిరి. పాంసురే= ఈ అంతరిక్షమున అస్య=సూర్యుని యొక్క, సమూఢమ్ = ఒక పాదము గుప్తమైయున్నది. అనగా కనబడకున్నది. ఇట దుర్గా చార్యుని భావమేమన, విష్ణువు=సూర్యుడు పృథివియందున్న అగ్ని రూపమునను అంతరిక్షముననున్న విద్యుద్రూపమునను,ఆ ద్యులోక మున స్వరూపమునను వ్యాపించుచున్నాడు. ఇట్లంతరిక్ష విద్యు ద్రూపుడగుట విద్యుత్ క్షణికమగుటచే కనబడనట్లు వర్ణింపబడెను. ఇట్లు యాస్కాచార్యు డీ మంత్రమున విష్ణువన సూర్యుడనియే స్పష్టముగా వ్రాసియుండిరి. సూర్యుడే త్రిలోకముల వ్యాపించి త్రివిక్రము డనబడుచున్నాడు. వ్యాపకావస్థయందు విష్ణువన బడుచున్నాడు. దీనినిబట్టి యాస్కాచార్యుల కాలములో వామ నావతార కథ కల్పితమైయున్నట్లు కానరాదు. ఈ కథ యా కాల మున నున్న తప్పక యాస్కాచార్యు లీ మంత్రార్థ ప్రసంగమున వర్ణించియుండెడివారు.

అతో దేవా అవన్తు నో యతో విష్ణుర్విచక్రమే పృథివ్యాః సప్తధామభిః త్రీణి పదా విచక్రమే విష్ణుర్గోపా అదాభ్యః, అతో ధర్మాణి ధారయన్ విష్ణోః కర్మాణి పశ్యత యతో వ్రతాని పస్పశే ఇంద్రస్య యుజ్యః సఖా, తద్విష్ణోః పరమం పదమ్ సదా పశ్యన్తి సూరయః దివీవ చక్షురాతతమ్ తద్విప్రాసో విపన్యవో జాగృవాంసః సమింధతే విష్ణో ర్యత్పరమం పదమ్॥ (ఋ.)

విష్ణుః=సూర్యుడు, సప్తధామభిః = జగత్తును పోషించు తన యేడువిధములైన కిరణములతో, యతఃపృథివ్యాః = భూమినుండి ద్యులోకమువఱకు, విచక్రమే = విశేషరూపమున భ్రమించు చున్నాడు. అతః=ఈ భూలోకముతోగూడ మూడులోకములందు గల, నః = మనయొక్క, దేవాః = వాయు-శుక్ర - బృహస్పత్యాది దేవతలను, అవన్తు=రక్షించును గాక, అదాభ్యః=చిరస్థాయి - అవి నశ్వరుడు, గోపాః=జగద్రక్షకుడునగు, విష్ణుః = సూర్యుడు, త్రీణి పదా=పృథివ్యంతరిక్ష ద్యులోకరూపములగు మూడుస్థానములందు, విచక్రమే = భ్రమించుచున్నాడు-లేక మూడుస్థానముల మూడు పాదముల నుంచుచున్నాడు. అతః = ఈ భ్రమణమువలన, ధర్మాణి = ప్రజలయందు నానావిధములగు ధర్మములను, ధార యన్=పోషించుచు-తిరుగుచున్నాడని తాత్పర్యము.

సూర్యుని ఉదయానంతరమే జనులు తమ తమ ధర్మ కర్మల నాచరించుచున్నారు. అందువలన ధర్మపోషకుడుగా సూర్యు డిట వర్ణింపబడెను. ఇట సూర్యుడు, త్రీణిపదా=మూడు పదములు నడుచుచున్నాడు. అనగా నత్యల్పముగా చలించు

చున్నాడని అర్థము. సూర్యుడు కేవలము తన యాక్షముపై భ్రమించుచు లోకములను పోషించుచు ధారణ చేయుచున్నాడని తాత్పర్యము-భూమ్యాది గ్రహములవలె నన్యగోళముల చుట్టి భ్రమించుటలేదనియు బోధపడుచున్నది. మూడులోకములను రక్షించుటకు మూడుపదములు మాత్రమే సూర్యుడు నడుచు చున్నాడనుట నాలంకారిక భంగియని సాహిత్యవిదులకు తెలిసిన విషయమే.

హే మనుష్యులారా! విష్ణోః=సూర్యుని యొక్క, కర్మాణి= పాలనపోషణాది కర్మలను, పశ్యత=చూడుడు. యతః = ఎవని వలన, వ్రతాని=ధర్మకర్మలను, పస్పశే=చేయుచున్నారో-మఱియు నే సూర్యుడు, ఇంద్రస్య=వాయువునకు, యుజ్యః = అనుకూలు డైన, సఖా=మిత్రుడో-అనగా సూర్యునివలన ధర్మకర్మలు లోక మున ప్రవర్తించుచున్నవి. జీవనమునకు ముఖ్యకారణభూతమగు వాయువుకూడ సూర్యునివలననే చలించుచున్నది. అట్టి వాయు వును బొంది జీవితులై వ్రతాదుల నాచరించుట జగద్విదితము — అందువలన సూర్యునివలన వ్రతములు జరుగుచున్నట్లు వర్ణింప బడెను.

సూరయః=విద్వాంసులు, సదా=సర్వదా, విష్ణోః=సూర్యుని యొక్క, తత్ = ఆ, పరమమ్=ఉత్కృష్టమైన, పదమ్ = స్థాన మును, పశ్యన్తి=చూచుచున్నారు. అనగా విద్వాంసులు సూర్య తత్త్వమును తెలిసికొనుచున్నారు. దివీవచక్షురాతతమ్=ఆకాశ మున వ్యాపించిన కన్నువలెనని దృష్టాంతము. ఆకాశమున నవ రోధము లేకుండుట సర్వమును స్పష్టముగా నెట్లు నేత్రము చూడ గలదో అట్లే విద్వాంసులు సూర్యుని తత్త్వమును విస్పష్టముగా నెఱుగుచున్నారు.

విష్ణోఃయత్పరమంపదమ్ = విష్ణువు యొక్కయే పరమ పదమున్నదో, తత్ = దానిని, విపన్యవః=సదాస్తుతి ప్రార్థనాదుల చేయుచున్నట్టి-లేక జగజ్జంజాటములను విడిచినట్టి, జాగృవాంసః= జాగరణచేయునట్టి, విప్రాసః=మేధావులు, సమింధతే=ప్రకాశింప జేయుదురు.

పాఠకులారా ! సూర్యతత్త్వమును తెలిసికొనుటయు గొప్ప విద్వాంసుల కార్యమే. ప్రత్యక్షముగా గనబడు సూర్యు నెఱుగు టలో నేమి గొప్పతనమని మీకు దోచవచ్చు, కాని బ్రహ్మజ్ఞానము నకై యత్నించువారలకు తన్నిర్మిత విచిత్రపదార్థముల నెఱుంగుట యావశ్యకము. నేడు విద్యావిహీనులగుటం బట్టి భారతమున నెట్టి యజ్ఞానము వ్యాపించినదో చూడుడు. సూర్యగ్రహణము గలిగి నపుడు లక్షలకొలది మనుష్యులు కురుక్షేత్రాది స్థానములకు యాత్రజేయుదురు. దీనిలో నర్థమేమి ? గ్రహణము యొక్క వాస్తవపరిస్థితి తెలిసిన జను లిట్లు వ్యయప్రయాసల కేలబూను దురు. స్నానసమయమునను, దేవతాస్థానదర్శన సమయమునను నిరర్థకముగా నెండతో దుర్బలులు వృద్ధులు మృత్యుముఖమున బడుట చూచుచున్నాము. ఇంతియగాక యిట్టి సమయముల నవి నీతు లెండతో నింద్యాచరణముల కనువులు పొందుచుందురు. వినుతస్థు లెండతో అనాథబాలికల మోసపుచ్చి హరించుచుందురు. ఇట్టి ఘోరయనష్టములకు సూర్యాదిపదార్థ విజ్ఞానరాహిత్యమే గదా ? సూర్యసంబంధమగు విజ్ఞానమువలననే, రాత్రిందినములు, ఋతువులు పరివర్తనము గ్రహణములు, చంద్రుని వృద్ధిక్షయ ములు మున్నగు విషయములు తెలియగలవు. అందువలన సూర్యుని గుణముల నెఱుగనివాడు నిశ్చయముగా నజ్ఞానులై

యుండుటలో సందియములేదు. పృథివ్యాది భూతములు, సూర్య చంద్ర నక్షత్రాదులన్నియు నీశ్వరుని విభూతులు గదా! వాని నెఱుగని వాడీశ్వరు నెట్లు తెలిసికొనగలడు. అందువలననే పై మంత్రములలో రాత్రిందినములు చింతనచేయునట్టి మేధావులగు విద్వాంసులే సౌరవిద్యను చక్కగా తెలిసికొనగలరు. వారే ధన్యులు నని వర్ణింపబడియుండెను. ఇట్టి మహనీయుల చిరకాల పరిశ్రమ ఫలమేకదా నేటి మన భారత సౌరవిద్యా ప్రాశస్త్యము.

ఇట్లే ఋగ్వేదమున నింక ననేకమంత్రములు సూర్య విజ్ఞానమును బోధించునవి గలవు. విష్ణు సూక్తమునగల కొన్ని మంత్రముల నిట నుదాహరించి వాని యర్థములను సాయణ మహీధరాదు లెట్లు అవతారపరముగా చేసియుండిరో చూపుట చాల అవసరమని తోచెడిని.

ఇరావతీ ధేనుమతీ హి భూతం సూయవసినీ
మనుషే దశస్యా
వ్యస్తభ్నారోదసీ విష్ణవే తే దాధర్థ పృథివీమభితో
మయూఖైః॥ (ఋ. మం.)

మనుషే=మనుష్యుని కొఱకు, ఇరావతీ = అన్నాది పదార్థముల నిచ్చునట్టియు, ధేనుమతీ = ఆవులు మున్నగు పశువులతో గూడి నట్టియు, సూయవసినీ = శోభనపదార్థముల నిచ్చుచు, దశస్యా=ఎల్లప్పుడు నేదో-ఒక పదార్థము నిచ్చునవియు, హితమ్= నిశ్చయముగానైన, యే ఏతే రోదసీ = ఈ పృథివ్యంతరిక్షములను, అభితః=అన్నివైపులనుండి, విష్ణో = హే సూర్య, మయూఖైః = కిరణములతో ననగా కిరణములందుగల ఆకర్షణశక్తివలన,

దాదర్థ=నీవు పట్టుకొని యున్నావు. సూర్యకిరణములందుగల ఆకర్షణచేతనే పృథివి తన మార్గమున నిటు నటుపోక నియతముగా భ్రమించుచున్నదని విజ్ఞాను లెఱిగిన విషయమే కదా. ఇట్టి సుందర వైదికభావమును తెలిసికొనజాలక సాయణుడు మహీధరుడు నీమంత్రమున కెట్టి యర్థమును గల్పించియుండిరో తిలకింపుడు.

సాయణుడు—

"అపిచ పృథివీం ప్రథితామిమాం భూమిమ్ అభితః సర్వత్రస్థితః మయూఖైః పర్వతైర్దాధర్థ ధారితవాన్ అపి యథా న చలతి తథా దృఢీకృతవానిత్యర్థః"

ఇందు సంస్కృతమున ప్రసిద్ధమై కిరణపరమగు మయూఖ శబ్దమునకు పర్వతమని వ్రాయుచు పృథివియందుగల పర్వతముల వలననే భూమిస్థిరమైయున్నదని సాయణుని అభిప్రాయము.

మహీధరుడు—

"పృథివీం మయూఖైః స్వతేజోరూపైర్నానాజీవైః వరాహాద్యనేకావతారైర్వా అభితో దాధర్థ దధర్థ సర్వతో ధారితవానసి."

ఇందు మహీధరుడు మయూఖశబ్దమునకు నానావిధజీవులు, లేక వరాహాద్యవతారములు నని భాషించియున్నాడు. వీనిని బట్టి జూడ నీ భాష్యకర్తలకు సౌరవిద్యా సంబంధి సాధారణ జ్ఞానము

కూడ లేనట్లున్నది. ఇట్టి స్థితిలో వేదభాష్యములు వీరి యెంత ప్రామాణికములు కాగలవో విద్వాంసు లూహింతురుగాక.

ఇంతియగాక—

"కిమిత్తే విష్ణో పరిచక్ష్యం భూత్ ప్రయద్వవక్షే శిపివిష్టో అస్మి॰ మావర్పో అస్మదపగృహ ఏతద్యదన్యరూపః సమిధే బభూథ" (ఋ.)

ఈ ఋక్కును వ్యాఖ్యానముజేయుచు సాయణాచార్యులు.

"పురా ఖలు విష్ణుః స్వం రూపం పరిత్యజ్య కృత్రిమ రూపాంతరం ధారయన్ సంగ్రామే వసిష్ఠస్య సాహాయ్యం చకార తం జానన్ ఋషిరనయా ప్రత్యాచష్టే"

అనగా పూర్వకాలమున విష్ణుభగవానుడు తన రూపమును విడిచి కృత్రిమరూపమును ధరించి యుద్ధమున వసిష్ఠునకు సాహాయ్యమొనరించెను. ఇది తెలిసికొని ఋషి యీ ఋక్కు ద్వారా యిట్లనెను. అని వ్రాసియున్నారు. ఇట్టి వ్యాఖ్యానములను జూచినపుడు సాయణ పండితుని బుద్ధినిగూర్చి యాశ్చర్య శోకములు కలుగకపోవు. ఈ వ్యాఖ్యానములు యథార్థమేని వేదము లెట్లు నిత్యములని ప్రతిపాదింపనగును. దీనికి సమాధానము సాయణానుగాములే చెప్పసమర్థులు. ఈ మంత్రార్థము నిరుక్తమున జూడనగును. యాస్కాచార్యు లిట్లు వ్రాయుచున్నారు.

శిపివిష్టో విష్ణురితి విష్ణోర్ద్వే నామనీ భవతః
కుత్సితార్థీయం పూర్వం భవతీత్యౌపమన్యవః॥

విష్ణువునకు రెండునామములున్నవి. శిపివిష్టుడు విష్ణువనని. అందు శిపివిష్టనామము కుత్సిత—నిందార్థబోధకమని ఔపమన్యాచార్యుని మతము. అని వ్రాసి తరువాత యాస్కుడు, తన మతము నిట్లు ప్రకటించెను.

అపి వా ప్రశంసా నామైవాభిప్రేతం స్యాత్॥

లేక శిపివిష్టనామము ప్రశంసా సూచకమే.

శేప ఇవ నిర్వేష్టితోఽసి అప్రతిపన్నరశ్మిః అథవా శిపివిష్టోఽస్మి ఇతి ప్రతిపన్నరశ్మిః శిపయోఽత్ర రశ్మయ ఉచ్యన్తే తైరావిష్టో భవతి.

అనగా, ఉదయకాలమున సూర్యుడు చక్కగా ప్రకాశింపడు. కిరణములన్నియు లుప్తప్రాయములుగా నుండును. ఇట్లు తన కిరణములను పోగొట్టుకొని శోభారహితుడై యుండుటను సూచించుచు శిపివిష్టశబ్దము నిందాపరముగ నన్వయించును—యాస్కపక్షమున (శిపిభిః) అనగా కిరణములతో (ఆవిష్టః) సమ్యక్ పరిపూర్ణుడు. ఇట్లు ప్రశంసా సూచకమగును. ఇట్లు శిపివిష్టశబ్దము రెండర్థములను బోధించును. ఇప్పుడు మంత్రార్థమును గమనించుడు.

విష్ణో ! = హే సూర్య !, తే=నీకు, కిమ్=ఏమి, పరిచక్ష్యమ్ భూత్=ప్రకాశింపజేయవలసియున్నది. లేక, తే=నీవు, కిమ్=ఇది యేమి, పరిచక్ష్యమ్ = చేయుచున్నావు ! యత్ = ఎందువల్లనన, శిపివిష్టఃఅస్మి=నేను శిపివిష్టుడను, ప్రవవక్షే =చెప్పుచున్నావు- హే సూర్య ! అస్మత్=మాకు, ఏతత్వర్పః = ఈ రూపమును, మా అప గూహ =దాచవద్దు, యత్=దేనిని, అన్యరూపః = రూపాంతరముగా

మార్చి, సమిథే=ఆకాశమున, యత్ బభూవ=ప్రాప్తించెదవో, అట్టి రూపమును దాచవద్దని అభిప్రాయము. ఇట్లు మంత్రార్థ మెంతో విస్పష్టముగా నున్నది. ఇది ప్రాతఃకాలపు సూర్యుని వర్ణన, ఉదయభానుడు పృథివ్యాది దేవతలతో నిట్లనుచున్నాడని భావించుడు. నేను శిపివిష్టుడను, అనగా నాయందు కిరణములు ప్రకాశించుటలేదు. నేను మిమ్మెట్లు ప్రకాశింపజేయుదును. అప్పుడు దేవతలందఱు కలిసి యిట్లనుచున్నారు. "హే సూర్య! నీ విది యేమిచెప్పుచున్నావు! నీవు శిపివిష్టుడవు - అనగా కిరణములతో శోభించుచున్నావు. అథవా పరిపూర్ణుడవు. ఈ సమయమున నీలో కిరణములు ప్రకాశింపకున్నను, ప్రాతఃకాలిక శిపివిష్టరూపమును విడిచి విష్ణురూపమును ధరించి వ్యాపకుడవై మమ్ముల నా రూపముతో రక్షింపగలుగుచున్నావు. ఈ వ్యాపక విష్ణురూపమును దాచిపెట్టకుము.

ఇట్టి వర్ణనమున సూర్యుడు ప్రాతఃకాలమున శిపివిష్టుడును మధ్యాహ్నసమయమున కిరణములతో వ్యాపించి విష్ణుడనబడుననియు స్పష్టమగుచున్నది.

పాఠకులారా! ప్రసంగవశమున నిట ననేకమంత్రములు వాని యర్థభేదముల నిట్లు వ్రాయవలసివచ్చినది. ప్రస్తుతము ననుగమించుడు. వామనచరిత్ర మిట్లు నానావిధముల వ్యాపకరూపమున వర్ణించియుండిరి. దీని ముఖ్యాధారము పైన జూపినట్లు సాయంప్రాతఃకాలిక సూర్యునివర్ణనలే. ఈ వామనశబ్దముగూర్చి శతపథమును అనువాదించుచు 'మాక్సుముల్లర్' ఏమి వ్రాసియుండెనో చూడుడు.

This legend is given in muir's Original Sanskrit Texts, IV P 122. Where it is pointed out that we have here the germ of the Dwarf incarnation of Vishnu; and in A. Kuhn's treatise, 'uefer Entwick lungsstufender mythenbildung' P. 128, where the following remarks are made on the story; Here also we meet with the same struggle between light and darkness the Gods of light are vanguished and obtain from he Asuras. Who divided the earth between themselves, only as much room as is covered by Vishnu, who measures the atmosphere with his three steps. He represents) though I cannot prove it in this place the sun-light, which on shrinking into dwarf's size in the evening, is the only means of preservation that is left to the Gods who cover him with metres I E. with sacred hymns probably in order to defend him from the powers of darkness) and in the end kindle Agni in the east-the dawn-and thereby once more obtain possession of the earth." Compare also the corresponding legend in Taitt Br III 2, 9, 7.

విష్ణుశబ్దప్రయోగము

విష్ణుశబ్దము, ౧) విష్ఌ=వ్యాప్తౌ, ౨) విశ=ప్రవేశనే, 3) విపూర్వక అశూవ్యాప్తౌ సంఘాతేచ, అను ధాతువులవలన సిద్ధమగుచున్నది. అందువలన నీ శబ్దార్థము, అన్నిచోట్ల వ్యాపించుట

అథవా ప్రవేశించుట యని తెలియనగుచున్నది. వస్తుతః నీ శబ్దము యొక్క సంపూర్ణమైన అర్థము పరమాత్మునందే అన్వయించును. అన్యసూర్యాదులందు గౌరవముగా వ్యవహరింపనగును. సూర్యుడు గూడ భూమికంటె ననేక లక్షలరెట్లు పెద్దదగు గోళమై యుండి తన కిరణములవలన పృథివ్యంతరిక్షాదిలోకముల వ్యాపించుచున్నాడు. ప్రతివస్తువునందును ప్రవేశించుచున్నాడు. ఈ కారణముచే సూర్యుడుగూడ నొకవిధముగా విష్ణువనబడుచున్నాడు.

శబ్దప్రయోగ విచారసందర్భమున, వైదికశబ్దములవలననే ప్రథమమున మనుష్యులకు పదార్థజ్ఞానము కలిగెనని స్మరించుట చాలఅవసరము. ఇయ్యది చాలవఱకు నిర్వివాద విషయము. ఏ శబ్దమునకే యర్థమో అట్లే వేదములందాశబ్దము ప్రయోగింపబడియున్నది. ఒక్క పదార్థమునకు అనేక నామములునున్నవి. అవన్నియు గుణవాచకములు. అందువలన ననేకశబ్దములు గుణానుసారము ప్రయోగింపబడినవి. ప్రాయః ఈశ్వరుని వ్యాపకగుణమును బోధింపవలసినచోట విష్ణుశబ్దప్రయోగమే వేదమున గాననగును. ఐశ్వర్యమును బోధింపదలచినచోట ఇంద్రశబ్ద ముపలబ్ధము కాగలదు. (ఇది=ఐశ్వర్యే). ఇట్లే సూర్యాది విషయములనీశబ్దములు గమనింపదగినవి. తఱచు సూర్యునందు వ్యాపకతను సూచించుటకై వేదమున సూర్యుడు తన కిరణములద్వారా పృథివ్యంతరిక్ష ద్యులోకముల వ్యాపించియున్నట్లు వర్ణింపబడియుండెను. ఇట్లే విక్రమ బ్దమును సూర్యుని త్రిలోకవ్యాపకతనే బోధించుచున్నది.

విపూర్వక క్రమ్ ధాతువునకు పాణిని వ్యాకరణానుసారము పాదముంచుట అని అర్థము. (క్రము=పాదవిక్షేపే) - (వేః పాద విహరణే) అను సూత్రము ననుసరించి పాదవిక్షేపార్థమునందే

విపూర్వక క్రమ్‌ధాతువున కాత్మనే పదప్రత్యయములు విధింప బడుచున్నవి. (విక్రమతే) వేదమున నీ క్రియ యధికముగ ప్రయోగింపబడినది. ఈ ధాతువునకు గల పాదవిక్షేపార్థమును బట్టి పాదయుక్త వామనాది వ్యక్తులను గల్పించు భ్రమ కొందఱి కేర్పడియుండును. ఇది అజ్ఞానమేకాక వేఱేమియు కాదు. పాణిని ననుసరించి చూడ.

వృత్తి, సర్గ, తాయనేషుక్రమః. వృత్తిరప్రతిబంధః - బుద్ధిక్రమతే బుద్ధిః, నప్రతిహన్యతే ఇత్యర్థః. సర్గః-ఉత్సాహః, అధ్యయనాయ క్రమతే-ఉత్సహతే, క్రమన్తేఽస్మిన్ శాస్త్రాణి-స్ఫీతాని భవన్తీత్యర్థః. ఆఙ్ ఉద్గమనే-ఆక్రమతే సూర్యః, ఉదయతే ఇత్యర్థః.

ఇట్లు అప్రతిబంధ, ఉత్సాహాద్యర్థముల నీ విక్రమక్రియ ప్రయోగింపనగును. అందువలన విక్రమక్రియ నన్వయించుటకై పాదములతో గూడిన వ్యక్తిని కల్పింపనవసరములేదని బుద్ధిమంతులకు తోచకపోదు. ఇట్లు క్రియలు నానార్థకములగుట వలన ప్రకరణాదులను చక్కగా విచారించి అర్థనిర్ణయముచేయుటవసరము. త్రివిక్రమశబ్దమునగల విక్రమశబ్దమునకు పాదవిక్షేపమని యర్థమునుంచినను పరమాత్మునందును సూర్యునందును అన్వయించుటలో క్షతిలేదు. పరమాత్ముని పరముగా నన్వయించుటలో పాదవిక్షేపాదులు "సహస్రశీర్షా..." విశ్వతశ్చక్షురుతవిశ్వతః పాత్ ఇత్యాది స్థలములలోవలె ఆరోపమాత్రమగును. సూర్యుని విషయమున కిరణప్రసార మను నర్థము తగవులేనిదే.

విష్ణువు - అదితి

పురాణములలో వామనుడు అదితిగర్భమున నుదయించుట వర్ణింపబడియున్నది-ఇందుకును సూర్యుడే కారణము. వేదములలో సూర్యు డదితి పుత్రుడుగా వర్ణింపబడెను. అదితి పుత్రుడగుటవల్లనే ఆదిత్యుడనబడెను.

యాస్కాచార్యుడు నిరుక్తమున నిట్లు వ్రాయుచున్నాడు.

ఆదిత్యః కస్మాత్ ఆదత్తే రసాన్ ఆదత్తే భాసం జ్యోతిషామాదీప్తో భాసేతి వా అదితేః పుత్ర ఇతి వా.

(నిరుక్త.)

రసములను గ్రహించుటచేతను, అన్యనక్షత్రాదుల కాంతిని గ్రహించుటచేతను, అదితి పుత్రుడగుటవల్లను సూర్యు డాదిత్యుడనబడుచున్నాడని యర్థము.

తే హి పుత్రాసో అదితేః ప్రజీవసే మర్త్యాయ
జ్యోతిర్యచ్ఛంత్యజస్రమ్. (యజు.)

అదితేః=అదితియొక్క, తేహిపుత్రాసః=పుత్రుడు సూర్యుడు మర్త్యాయ = మనుష్యులకు, జీవసే = బ్రతుకుటకై, అజస్రమ్ జ్యోతిః=ఎల్లపుడు ప్రకాశమును, ప్రయచ్ఛన్తి = ఇచ్చుచున్నాడు- ఇచ్చట జ్యోతిశబ్దసామ్యమువలన సూర్యుడనియే బోధపడుచున్నది (అదితేః పుత్రాసః).

అష్టౌ పుత్రాసో అదితేర్యే జాతాస్తన్వస్పరి,
దేవాన్ ఉపప్రైత్సప్తభిః పరా మార్తాండమాస్యత్॥

(ఋ. 10 మ.)

యే అష్టౌ పుత్రాసః=ఏ యెనిమిదిమంది పుత్రులు, అదితేః తన్వస్పరిజాతాః=అదితి శరీరమునుండి పుట్టిరో, వారిలో సప్తభిః= ఏడుగురితో నా అదితి, దేవాన్ ఉపప్రైత్ = దేవతలను ప్రాపించు చున్నది. అష్టమపుత్రుడగు మార్తాండమ్ = సూర్యుని, పరా ఆస్యత్=పైకి యెగురవేసినది. ఇందును అదితి పుత్రుడని స్పష్ట మగుచున్నది. ఇట్లే సూర్యునకు దివస్పుత్రుడనియు పేరుగలదు. అనగా మనుష్యులలో వలె సూర్యు డొక స్త్రీవ్యక్తికి పుత్రుడని భావింపకుడు. దివః పురుత్రాయతే స ఇతి దివస్పుత్రః - దివః పాలకాయ ఇతివా, అనగా ద్యులోకమును రక్షించువాడని అర్థము. లేక పాలించువాడనియు భావింపనగు. ఇక్కడ ద్యుశబ్దమున కర్థము దినమని యెంచుట బాగుండును. సూర్యుడు దినమునకు పోషకుడు కదా! పౌరాణికు లెట్లు అదితిని దేవమాతగా వర్ణించి యుండిరో అట్టి యదితి వేదములందు కానరాదు. ఈ యదితి యే ఇంద్రునకును తల్లి. అందుచే ఇంద్రుడు విష్ణువు సోదరులైరి. అనగా వామనుడు ఇంద్రుని చిన్నతమ్ముడు. కాని వేదమున నిందుకు విరుద్ధముగా నదితి విష్ణు పత్నియని వర్ణింపబడియున్నది.

అగ్నయే గాయత్రాయ! .... అదిత్యై విష్ణుపత్న్యై చరురగ్నయే వైశ్వానరాయ, ద్వాదశకపాలోఽనుమత్యా అష్టాకపాలః॥ (యజు.)

విష్ణువు - జలంధరుడు

వృందా జలంధరులకు సంబంధించిన కథ ప్రసిద్ధభాగవ తాది గ్రంథములందు కానరాకున్నను కార్తీక మాహాత్మ్యమున నీ యాఖ్యాయిక చూడబడుచున్నది. కార్తీకమాహాత్మ్యము, పద్మ

పురాణాంతర్గతమని భావన. కార్తీకమాసమున స్త్రీలు ప్రాతః స్నానాదుల నొనర్చి బ్రాహ్మణ దేవతాముఖమున నీ కథను బహు భక్తిశ్రద్ధలతో వినుచు నాత్మలను పవిత్రమొనరించుచున్నట్లు భావించుచుందురు. భారతవర్షమున నీ రోజులలో ధార్మికులమని భావించుకొను వారికిది యొక పరిపాటియైనది. ఈ కథ సంక్షేప ముగా నీ క్రింది విధమున నుండును. విష్ణుభగవానునికి తులసి యెందుకు ప్రీతిపాత్రమను ప్రశ్నకు సమాధాన మీ కథకు సందర్భము.

ఒకప్పు డింద్ర రుద్రులలో ఘోరద్వంద్వయుద్ధము ప్రారంభమయ్యెను. అందు రుద్రు డింద్రుని చంపి ఫాలనేత్రా గ్నిచే భస్మమొనరింప దొడగెను. ఇంద్ర గురువు బృహస్పతి మహాదేవుని ప్రసన్నునిగాజేసి యింద్రునకు జీవనదానమిమ్మని ప్రార్థించెను. రుద్రుడు 'తథాస్తు' అని యింద్రుని భస్మీకరణార్థము నిటలాక్షమునుండి బయలుపడిన కాలాగ్నిని సముద్రమందు బడ వేసెను. అది తత్కాలముననే బాలకరూపమున ప్రకటమయ్యె. సముద్రుడు బ్రహ్మచే నీ బాలునకు నామకరణ సంస్కార మొన రింపజేసెను. ఈ బాలుడే జలంధరనామమున ప్రఖ్యాతిగాంచెను. క్రమముగా నితడు వృందను వివాహమాడి స్వబలపరాక్రమము వలన దేవతల నెల్లర జయించి వారి యధికారములను లాగు కొనెను. దేవతలు యథాశక్తి సంగ్రామమొనర్చి కాలికి బుద్ధి చెప్పిరి. కాని రుద్ర జలంధరులలో భయంకర సంగ్రామము జరుగసాగెను. యుద్ధరంగమున జలంధరు డపజయమును బొంద కుండుట జూచి విష్ణువు దీనికి కారణమేమని విచారించెను. జలంధరుని ధర్మపత్ని వృంద యొక్క పతివ్రతాధర్మభగ్న మొనరింపకున్న జలంధరుడు జయింపబడడని యతనికి పొడ

గట్టెను. ఇట్లు విచారించి యెట్టకేలకు "పాతివ్రత్యస్య భంగాయ వృందాయాశ్చాకరోన్మతిః" తానే జలంధరుని రూపముదాల్చి వృందను విశ్వసింపజేసి యామె పతివ్రతాధర్మమును భగ్నము జేసెను. తదుపరి జలంధరుడు యుద్ధమున చంపబడెను. కథా సంక్షేపమిదియు.

పాఠకులారా! కొంచెము సహనబుద్ధితో గమనింతురేని యిందు విచిత్రవిషయము లనేకములు గలవు. విష్ణువు కపట వేషమున తన నిట్లు భంగపఱచెనని వృందకు తెలిసినపు డామె యేమనెనో చూడుడు

వృందోవాచ—

ధిక్ త్వదీయం హరే! శీలం పరదారాభిగామినః
జ్ఞాతోఽసి త్వం మయా సమ్యక్ మాయాప్రత్యక్షతాపసః
యౌ త్వయా మాయినౌ ద్వాస్థౌ స్వకీయౌ దర్శితౌ మమ
తావేవ రాక్షసౌ భూత్వా భార్యాంతవహరిష్యతః
త్వంచాపి భార్యా దుఃఖార్తో వనే కపిసహాయవాన్
భవ సర్వేశ్వరేణాయం యస్తే శిష్యత్వమాగతః
ఇత్యుక్త్వా సా తదా వృందా ప్రావిశద్ధవ్యవాహనమ్
విష్ణునా వార్యమాణాపి తస్యామాసక్తమానసః
తతో హరిస్తామనుసంస్మరన్ ముహుః వృందాన్వితో భస్మ
రజోవగుంఠితః తత్రైవ తస్థౌ సురసిద్ధసంఘైః
ప్రబుధ్యమానోఽపి యయౌ న శాంతిమ్॥ (అధ్యా. 16)

హే విష్ణో! పరస్త్రీలతో వ్యభిచరించు నీ శీలమునకు ధిక్కారము. నిన్ను నే గుర్తించితిని. నీవు మోసగాడవు. నన్ను మోసగించుటకై నీవు చూపిన మాయారూపులగు నిద్ధఱుభటులు రాక్షసులై నీ భార్యను హరింతురుగాక, నీవును భార్యా దుఃఖముచే వనములందు విలపించుచు తిరిగి కపుల సహాయమును బొందుదువు గాక. అని యా వృంద విష్ణువెంత వారించినను వినక అగ్నిలో ప్రవేశించెను. హరియు నామెయందాసక్తుడై యామెను పలుమారు స్మరించుచు వృందా చితిభస్మమును దేహమున బులుముకొని మోహోన్మాదముచే నిటు నటు కదల కటనే నిలబడెను, దేవతలు సిద్ధులు మున్నగు వారెంత బోధించినను ప్రకృతిస్థుడుకా డయ్యె.

అక్కడ జలంధరుడు యుద్ధమున చంపబడెను. మహాదేవుని ప్రశంసించి దేవతలెల్లరు విష్ణువు దుస్థితిని గూర్చి

కించిదన్యత్సముద్భూతం తత్ర కింకరవామ హే
వృందాలావణ్యసంభ్రాన్తో విష్ణుస్తిష్ఠతి మోహితః॥

మఱియొక ముప్పువచ్చినది. విష్ణువు వృన్దాలావణ్యముచే మోహితుడై సంభ్రాంతుడై జగత్తునకు కష్టము కలిగింపనున్నాడు. అందుకు చేయవలసినదేమని ప్రార్థించిరి. మహాదేవుడు మూలప్రకృతిని సేవింపుడని దేవతలకు బోధించెను. వారట్లుచేయ నామూలప్రకృతి తాను గౌరీలక్ష్మీసరస్వతుల రూపముల నుంటిననియు, వారిని యాచించిన మీకు శుభమగునని పలికెను. దేవతు లాదేవీమతల్లులను ప్రార్థింప వారు మూడు బీజములనిచ్చి వానిని విష్ణు వున్నచోట్ల విత్తుడు మీ కార్యము సిద్ధించుననిరి.

ఇమాని తత్ర బీజాని విష్ణుర్యత్రావతిష్ఠతే
నివపధ్వం తతః కార్యం భవతాం సిద్ధిమేష్యతి॥

దేవత లట్లే విత్తనముల నీటచల్లిరి. ఆ మూడు విత్తనములు ధాత్రి, మాలతీ, తులసీ రూపమున వనస్పతు లుద్భవించెను.

ధాత్ర్యుద్భవా స్మృతా ధాత్రీ, మా భవా మాలతీస్మృతా,
గౌరీ భవా చ తులసీ తమః సత్వరజోగుణాః
స్త్రీరూపిణ్యో వనస్పత్యో దృష్ట్వా విష్ణుస్తదా నృప
ఉత్తస్థౌ సంభ్రమాద్ వృన్దారూపాతిశయవిభ్రమః
దృష్టాశ్చ తేన రాగాత్ కామాసక్తేన చేతసా
తం చాపి తులసీ ధాత్రీ రాగేణైవ వ్యలోకయత్
కించ లక్ష్మ్యా పురాబీజమీర్ష్యయైవ సమర్పితమ్
తస్మాత్తదుద్భవా నారీ తస్మిన్నీర్ష్యా పరాభవత్
తతః సా వర్వరీత్యాఖ్యా మవాపాథ విగర్హితా
ధాత్రీ తులస్యౌ తద్రాగాత్ తస్య ప్రీతిపదే సదా
తతో విస్మృతదుఃఖ్యోఽసౌ విష్ణుస్తాభ్యాం సహైవ తు
వైకుంఠమగమత్ హృష్టః సర్వదేవనమస్కృతః॥

సరస్వతి యిచ్చిన విత్తనమువలన ధాత్రీ, లక్ష్మి యిచ్చిన దానివలన మాలతి, పార్వతి యొసంగిన దానివలన తులసియు, స్త్రీ రూపముల వనస్పతు లుద్భవించెను. వృందకంటె యెక్కువ రూపవతులగుట వారిని జూచి విష్ణువు సంభ్రాంతుడై లేచి ప్రేమతో

కామాసక్తచిత్తుడై వారిని జూచెను. వారిలో ధాత్రీతులసులును రాగముతోనే విష్ణుని దిలకించిరి. కాని మాలతి మాత్రము, లక్ష్మి యీర్ష్యచే నిచ్చిన బీజమువలన నుద్భవించుటజేసి విష్ణు నీర్ష్యతో జూచెను. అందుచే నా మాలతి పర్బరియని లోకమున గర్హింప బడెను. ధాత్రి తులసులందు ప్రీతిని గనబఱచుచు వారితో విష్ణువు వృన్దా వియోగము వలన కలిగిన దుఃఖమును మఱచి వైకుంఠ మున కేగెను. దేవతలును నమస్కరించి యనుసరించిరి.

ఇట్లీ కథా ఘట్టములను దిలకింపగా కథా రచయిత యొక శివద్రోహియగు మూర్ఖుడుగా గనిపించుచున్నాడు. మొదట జలంధరుని పత్ని వృందను పతివ్రతగాజేసెను. విష్ణువును పరదారాభి గామిగా నొనరించెను. సరస్వతి పార్వతులకు సహింపరాని కలంక ములతో నంకించెను. సరస్వతీ పార్వతులచే నీయబడిన బీజముల నుండియే కదా! ధాత్రి తులసు లుద్భవించి విష్ణు ప్రేమాస్పద లైరి. ఇందు విశేష్య పార్వతికి సంబంధించిన తులసి సాక్షాత్ విష్ణు ప్రియయైనది. లక్ష్మి బీజోద్భవ నిరాదరింపబడెను. దీని వలన నీ వైష్ణవాభిమానుడు, శైవులు కూడ విష్ణుభక్తులు కాగలరని తలంచి యుండునేమో. కాని యీ యజ్ఞానికి పార్వతిమీద నెట్టి యమార్జనీయమగు కలంకమారోపింపబడుచున్నదో నెఱుగక పోయెను. ఈ కథలను జూచి నప్పుడెల్ల విచారకులకు భారత దేశ మొకప్పుడెంత భ్రష్టస్థితికి వచ్చినదియు పొడకట్టకపోదు. ఈ కాలమున నిట సదాచారము సర్వదా నశించుటయే యీ కథలకు మూలమని తోచుచున్నది. లేకున్న భారతీయుల పరమపూజ్యు డగు విష్ణుభగవానుడు పరస్త్రీ గామియగుటయే గాక నన్యస్త్రీలను రూపాంతరముల నెల్లపుడు ధరించియుండు నంతటి దురాచారి యెట్లు కాగలడు.

భారతీయ విద్వాంసులారా! కొంచెమాలోచింపుడు. ఈ కథలను స్త్రీలకు బోధించి వారికేమి శిక్షణనీయగలరు? వృందవలె పతివ్రతలుగండని శిక్షింతుమందురేని విష్ణువు ననుకరించు పురుషుల నె గోతిలో పడవేయుదురు? పార్వతి సరస్వతు లిడిన బీజముల వలన నేమి బోధింతురు? అహా! ఎంత ఘోరపాపము! ఎంత భయంకర అజ్ఞానము! పవిత్రభారతమున నిట్టి గర్హితకథలు ధర్మ బోధకములా? బుధులారా! అజ్ఞాను లిట్టి కథల నల్లి విష్ణురూపమును కలంకిత మొనరించిరి. ఈ కథకును మూలము మన సూర్యభగవానుడే.

జలంధరతీతి=జలధరః, అథవా జలంధరః, జలధరుడు అనగా మేఘము. సముద్రజలమున నధిక ఉష్ణము కలిగినపుడు మేఘమేర్పడును. రుద్రుడు అనగా విద్యుత్ = అగ్నేయశక్తి సముద్రమున నధికోష్ణమును కలిగించినపుడు మేఘము = జలంధరుడు జన్మించుచున్నాడు. ఇదియే సముద్రమున రుద్రు డగ్నిని పడవేయుట జలంధరుడు జన్మించుటయు. జలంధరుడు మేఘుడు=ప్రబలుడై జలమును వర్షింపనపుడు దేవగణములు పృథివ్యాది పదార్థములు=ఆల్లాడును. అప్పుడు రుద్రుడు విద్యుత్= మేఘముతో యుద్ధమాడ నారంభించును. కాని యింతమాత్రమున వర్షముకురియదు. మేఘముల సముదాయమునకు సంస్కృతమున వృంద, (సమూహము) అని పేరు. స్త్రీలింగమున వృందా అనబడును. ఇట్లు మేఘ ఘటయే వృందానామమున జలంధరుని స్త్రీగా భావింపబడెను. సూర్యకిరణములు మేఘముల మీదబడినపు డవి కరిగి అనగా రాసాయనిక సమ్మిశ్రణమువలన వర్షింప నారంభించును. కిరణముల కుహరియని సంస్కృతమున పేరుం

డుట విద్వాంసులకు విదితమే. మేఘ ఘట (వృంద) యందు కిరణ (హరి) సంచారమే విష్ణు వృందాభిగమనము. వర్షమే పతివ్రత ధర్మభంగము. వర్షానంతరము మేఘుడు నశించుటయే జలంధర వధ యిట్లు కథ ముగియుచున్నది. ఇట్టి కథాభాగమును తెలియక విచిత్రరచనల నొనరించిన పౌరాణిక గాథ లెంత యనర్థమునకు మూలమగుచున్నవో చూడుడు. ఈశ్వరుడే భారతీయులకు సద్బుద్ధి నొసంగి రక్షించుగాత.

విష్ణువు – (శా)సాలిగ్రామము

మనదేశమున అగ్రజన్ములలో ననేకమంది నైష్ఠికులు వైదికాచారములందు విశేషపటిమగలవారని పేరుపొందిన కర్మఠులును సాలిగ్రామమును పూజించుచు సాక్షాత్ విష్ణువును పూజించుచున్నా మనుకొని దానివలన మోక్షమార్గ మధిగమించి నట్లెంచుచుందురు. అందువలన నియ్యది విచారించుట చాల అవసరమని తోచెడిని. దేవీభాగవతమున నవమస్కంధములో నిట్లున్నది.

నారద ఉవాచ—

నారాయణశ్చ భగవాన్ వీర్యాధానం చకార హ
తులస్యాం కేన రూపేణ తన్మే వ్యాఖ్యాతుమర్హసి॥
నారాయణశ్చ భగవాన్ దేవానాం సాధనేషు చ
శంఖచూడస్య కవచం గృహీత్వా విష్ణుమాయయా
పునర్విధాయ తద్రూపం జగామ తత్సతీగృహమ్
పాతివ్రతస్య నాశేన శంఖచూడజిఘాంసయా
దుందుభిం నాదయామాసతులసీద్వారసన్నిధౌ॥

నారాయణుడు తులసియందెట్లు వీర్యాధానముచేసినాడని నారదుడు ప్రశ్నింప తత్సందర్భమున తులస్యుపాఖ్యాన మిట్లు వర్ణింపబడెను. ఈ కథయు దాదాపు వృందోపాఖ్యానము ననుస రించుచుండును. ఇందు కూడ విష్ణువు యొక్క దుశ్చరిత్రమే చక్కగ చిత్రింపబడియున్నది.

శంఖచూడు డను నొక రాక్షసుడుండెను. అతని ధర్మపత్ని పేరు తులసి. ఈమె చాల ప్రతివ్రతయైయుండెను. ఈ దంపతులు విష్ణుభక్తి పరాయణులు గూడాను. తులసి పాతివ్రత్య మహిమచేత శంఖచూడుడు యుద్ధరంగమున నజేయుడైయుండెను. అందు వలన విష్ణువు మొదట మోసగించి శంఖచూడుని కవచమును యాచించి తెచ్చుకొనెను. తరువాత నతని సమానరూపమును ధరించి తులసి పాతివ్రత్యమును భంగపఱచి తద్ద్వారా శంఖ చూడుని చంప నిచ్ఛగించుచు తులసీద్వారముకడకు పోయి దుందుభినాదముచేసెను. తులసియు నతని కపటరూపము నెఱుం గక పతినిబోలి సత్కరించెను.

రేమే రమాపతి స్తత్ర రామయా సహ నారద
సా సాధ్వీ సుఖసంభోగాదాకర్షణవ్యతిక్రమాత్
సర్వం వితర్కయామాస క స్త్వమేవేత్యువాచ సా

తులస్యువాచ—

కో వా త్వం వద మాయేశ ! భుక్తాహం మాయయా త్వయా
దూరీకృతం మత్సతీత్వం యదతస్త్వాం శపామి హే
తులసీవచనం శ్రుత్వా హరిః శాపభయేన చ

దధార లీలయా బ్రహ్మన్ ! సుమూర్తిం చ మనోహరామ్
దదర్శ పురతో దేవీ దేవదేవం సనాతనమ్
పాషాణహృదయస్త్వం హి దయాహీనో యతః ప్రభో !
తస్మాత్ పాషాణరూపస్త్వం భువి దేవ భవాధునా
యే వదన్తి తు సాధుం త్వాం తే భ్రాంతా హి న సంశయః
భక్తో వినాపరాధేన పరార్థేచ కథం హృతః
భృశం రురోద శోకార్తా విలలాప ముహుర్ముహుః॥

ఇట్లామెను విశ్వసింపజేసి తులసితో రమించి యామె సతిత్వమును భగ్నముచేసెను. కాని యెట్టకేలకు తెలిసికొని దుఃఖితయై పలికెను. నీవు కఠోరహృదయుడవు కపటివి. నీ హృదయము పాషాణమయము. అందువలన నేడు మొదలు నీవు పాషాణ (శిలా) రూపమును బొందుము. నిన్ను సాధువని యెంచువారు నిస్సందేహముగా భ్రాంతులు. నిరపరాధియు నీకు భక్తుడునగు నా భర్తను ఇతరుల కొఱకేల యీ కపటవృత్తితో హరించితివి." ఇట్లు పలికి మిక్కిలి విలపింపసాగెను. విష్ణువు నామె శోకమును బోగొట్టుటకై

ఇయం తనుర్నదీరూపా గండకీతి హ విశ్రుతా
తవ కేశసమూహశ్చ పుణ్యవృక్షో భవిష్యతి
తులసీకేశసంభూతా తులసీతి చ విశ్రుతా
త్రిషు లోకేషు పుష్పాణాం పత్రాణాం దేవపూజనే
ప్రధానరూపా తులసీ భవిష్యతి వరాననే
స్వర్గే మర్త్యే చ పాతాలే గోలోకే మమ సన్నిధౌ

భవ త్వం తులసీవృక్షవరా పుష్పేషు సుందరీ
అహం చ శైలరూపేణ గండకీతీరసన్నిధౌ
అధిష్ఠానం కరిష్యామి భారతే తవ శాపతః
కోటిసంఖ్యాస్తత్రకీటాః తీక్ష్ణదంష్ట్రావరాయుధైః
తచ్ఛిలాకుహరే చక్రం కరిష్యంతి మదీయకమ్॥

నీ యీ శరీరము లోకమున గండకీనదియయి ప్రసిద్ధ మగును. నీ కేశములు పవిత్రవృక్షములగును. తులసికేశ సంభూతములగుటచే తులసియని పిలువబడును. స్వర్గ మర్త్య పాతాల లోకముల నీ తులసీ పత్రపుష్పములను మించిన పూజా ద్రవ్య మింకొకటి ఉండబోదు. హే సుముఖీ! నీవు సర్వత్ర నా సమీపముననే ఉండుము. నీవు లేక నా పూజవ్యర్థమగును. నీచే నన్ను పూజించువారికి భుక్తి ముక్తి కలుగగలదు. నేను నీ శాపమున గండకీ తీరమున ప్రస్తరరూపమున పడియుందును. అందు పదునుదంతములుగల పలుపురుగులు శిలాఛిద్రమున నా చక్రరూపమును జేయును.

శాలిగ్రామం చ తులసీం శంఖం వై చక్రమేవ చ
యో రక్షతి మహాజ్ఞానీ సభవేచ్ఛ్రీహరేః ప్రియః॥

సాలిగ్రామము, తులసి, శంఖము, చక్రము, వీనినే జ్ఞానులు తమ యొద్ద నుంచుకొందురో వారు శ్రీహరికి ప్రియులగుదురు. ఇట్టి కథ దేవీభాగవతమున విస్తారముగ వర్ణింపబడియుండుటను

విజ్ఞులు చూడవచ్చును. కాని యీ కథలన్నియు చాల అధునిక ములు, శాలిగ్రామమును గుఱించి ప్రాచీనగ్రంథముల నెక్కడ నెట్టిచర్య కానరాదు. వృందా, తులసీ కథలలో గల వైచిత్ర్య మొకటి గమనింపదగినది. అందు కార్తీకమాహాత్మ్యమున తులసి చెట్టు గౌరి యిచ్చిన బీజమువలన నుద్భవించెను. ఇందు దేవీ భాగవతమున తులసీకేశ సంభూతమయ్యెను. తథ్యము పాఠకులు నిర్ణయింతురు గాక.

భారతవర్షమున పూజింపబడు సాలిగ్రామము వస్తుతః ప్రస్తరము (రాయి) కాదు. ప్రమాదమున దానిని రాయిగా నెంచు చున్నారు. మనదేశముననే గాక పాశ్చాత్యులు సయితము దానిని శిలయని భావించిరి. కాని పరీక్షకుల దృష్టిలో నదియొక విధమైన గవ్వ (**Shell**) యని నిశ్చయింపబడినది. ఇవి యనేకవిధములుగా నుండును. కొన్ని చాల చిన్నవి-కొన్ని బండిచక్రమంత పెద్దవిగా గూడ నుండును. దీని నాంగ్లేయభాషలో (**Ammonite**) ఎమ్మో నైట్ అని చెప్పుదురు. ఇది సైంటిఫిక్ నామము, ఇవి భారతము ననే గాక యితర దేశములందును దొరకగలవు. గండకీనదిలో (నేపాలమున ప్రవహించుచున్నది) నివి చాలలభించును. ఇందు కొన్నిటిని జీవించినవానిని కొన్నిటిని మృతావస్థలో చూడగలము. వీనిని గుఱించి యొక విద్వాంసు డిట్లు వ్రాయుచున్నాడు.

Ammonites :– This sheel fish was found through the mesozoic Age in many forms.

Several hundred species are known. They varied size some being very minute others as large as a cart wheel They were called ammonites, from a fancied resemblance to the horns on the sculptured heads jupiter Ammon. In former days in Europe they were mistaken for snakes turned into stone. Among Hindus they are known as Salagramas.

ఇంకొక విద్వాంసు డిట్లు వ్రాయుచున్నాడు.

Ammonites attracted the attention of the curious long before geology was seriously studied and legends were inventeds to explain them

Then whitfay's nuns exulting told
How of thousand snakes each one
Was turned into a coil of stone
When holy Hilda prayed.

- Scott's Murmion.

ఈ సాలిగ్రామ మనబడువస్తువు చూచుటకు చాల సొంపుగా నుండును. ఈ సౌందర్యమును జూచియే యజ్ఞానులు దీనిని బూజింపసాగిరని తోచెడిని. అథవా విష్ణు కల్పకులు సూర్యుని మనుష్యరూపమున విష్ణుదేవుని గల్పించి పూజాప్రచారముజేసి యుండవచ్చును. కాని మూర్తి పూజకులలో చలమూర్తులు అచల

మూర్తులు నని రెండుభేదములు గలవు. ఆ భేదము ననుసరించి మనుష్యుని రూపముననున్న విష్ణువు అచలమూర్తిగను సాలిగ్రామ మును చలమూర్తిగను భావించి పూజావిధానమును ప్రచురించి యుండవచ్చు. లేక సాలిగ్రామ మధ్యమున నొక చిన్నపురుగు సుందరసువర్ణ కాంతితో భాసించుచుండును. శంఖాదులలోనున్న పురుగు లెట్లు మరణించునో అట్లిందుండు పురుగుగూడ మర ణించును ఈ పరిస్థితులను చూచి పౌరాణికులు సృష్టి కాలీ హిరణ్యగర్భుని యవతారముగా దీనిని భావించియుందురేమో. సాలిగ్రామమును హిరణ్యగర్భుడని వాడుటయు కలదు. ఎట్లైనను గానిండు పాఠకులారా! భారతీయులలో నిట్టి గవ్వలు, రాళ్లు, రప్పలు, చెట్లు పుట్టలుగుట్టలు మున్నగు జడపదార్థములను పూజించు పద్ధతి యజ్ఞానమువలననే యేర్పడినది. ఏకేశ్వరోపాస కులు నిర్గుణపరబ్రహ్మ ధ్యానపరులు నగు భారతీయులు తుచ్ఛ పదార్థముల నన్నిటి నీశ్వరస్థానమున పూజింప దొడగుట మిగుల దుఃఖాకరము. ఈ సాలిగ్రామము భారతవర్షమున గండకీనదిలో దొరకును. అందువలన విష్ణుభగవానుడు శాపవశమున గండకీనదీ గర్భముననను తత్తీరమున నుండు గడ్డి గాదములో పడియుండ వలసిన గతియుబట్టెను. ఇంతియగాక యీ రోజులలో నన్యత్ర గూడ నీ గవ్వలు (శాలిగ్రామములు) దొరకుచున్నట్లు విను చున్నాము. దీనినిబట్టి జూడ భగవంతుడు నేను గండకీతీరమున నుందునని చెప్పిన వచనము మృషయయ్యెను. శంఖచూడునికి పూర్వము భారతమున గండకీనది లేకుండెనా? ఒకవేళ తులసి

తనువే గండకి యనుకొందము. అప్పు డితర నదులవలె నాయా ఋతువులలో శుష్కించుట ప్రవాహాదులతో కూడియుండు టెట్లు పొసగును. శాపగ్రస్తుడయ్యు తులసి తనువు నాశ్రయించి యుండుట విష్ణుభగవానునిలో నెట్టి యౌచిత్యమును గనబఱచును ? సాలిగ్రామమను శబ్దముగూడ లేశమైన నీశ్వరుని గుణప్రభావాదుల సూచించునదిగా గానరాదు. ఏవిధమున జూచినను ఈ కథ సర్వథా అసంగతముగానే తోచుచున్నది. విష్ణుభగవానుడు కేవల సూర్య ప్రతినిధి రూపమున పూజింపబడుచున్నను కొంతబాగుండెడిది. ఆ మాత్రమైన నుండనీయక పౌరాణికులు తమ యిచ్ఛవచ్చి నట్లెల్లవిధముల రచించిరి.

తమలోగల ఛలమును పోషింపవలసినచోట భగవంతుని ప్రథమశ్రేణిలో లెక్కింపదగిన ఛలునిగా వర్ణించిరి. లంపటత, చౌర్యము మున్నగు దుర్గుణములను కప్పిపెట్టుటకై తాము విష్ణు భగవానుని ముందుగా నుదాహరణ స్థానమున నుంచిరి. మద్య పానాదులకు భగవానుని వంశమే అతి ప్రసిద్ధము కదా. మద్య పానముజేసి పరస్పరకలహముచే శ్రీహరివంశము నశించుట యెవ రెఱుగని విషయము. ఇట్లు పౌరాణిక ప్రపంచమున సాలిగ్రామ మునకు సంబంధించిన కథ మిగుల దుఃఖాకరము. తులసి విష్ణు వును నీవు పాషాణమై పొమ్మని శపించిన దెంతయుబాగున్నది. పాషాణమగుటయు బాగున్నది. ఇందు మీద ఆ పాషాణమును నింద్యముగా జూచిన నీకథ కొంత శిక్షాప్రదమై రోచకముగానుండును

శాపగ్రస్తుడై పాషాణరూపమున నిందనీయుడైన విష్ణుని పూజా పద్ధతి జగమున వ్యాపింపజేయుట అధర్మాచారములను పోషించుటకు గాక వేరేమి కాగలదు ! విద్వాంసులు స్వయముగా నూహింతురు గాక.

పాఠకులారా ! విష్ణువునకు సంబంధించిన గాథ లిట్లనేక ములు గలవు. వాని నన్నిటిని నిట గ్రంథ విస్తరభియా విచా రించుట మానితిని. బుద్ధిమంతులు స్వయముగానే తర్కించుకొన గలరని నమ్ముచున్నాడ—